01-10Pg1fB 1 GNT_01-10Pg1fB.qxd 10/1/2025 12:05 AM Page 1

సూపర్ GST సూపర్ సేవింగ్స్
డబుల్ ఇంజిన్ సర్కార్ - ఏపీలో డబుల్ బెనిఫిట్స్ - సూపర్ 6 & జీఎస్టీ 2.0

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 241 పేజీలు: 12 వెల: 6.50

సూపర్ GST సూపర్ సేవింగ్స్
డబుల్ ఇంజిన్ సర్కార్ - ఏపీలో డబుల్ బెనిఫిట్స్ - సూపర్ 6 & జీఎస్టీ 2.0


## పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం

22 సెప్టెంబర్ 2025 నుండి అమల్లోకి వచ్చిన తగ్గించిన GST రేట్లు

రోజువారీ ఉపయోగించే అనేక వస్తువులపై **0% లేదా 5% GST**
ఇప్పుడు ప్రధానంగా 2 పన్ను స్లాబ్ లు మాత్రమే

**సూపర్ GST సూపర్ సేవింగ్స్**

ప్రతి కుటుంబానికి ₹15,000 వరకు ఆదా!

వ్యాపారులకు అమ్మకాల పెరుగుదల!

సులభతరమైన GST స్లాబ్ పద్ధతి

పన్ను తగ్గింపుతో సంక్షేమం... ప్రజల ఆర్థికాభివృద్ధికి సోపానం...

**99% వస్తువులు మరియు సేవలు పన్ను రహితం...**
**(లేదా) కేవలం 5% లేదా 18% GST మాత్రమే..**


| విభాగం | గతంలో | ఇప్పుడు | ఆదా |
|---|---|---|---|
| కిరాణా సామాగ్రి | 18/12/5% | NIL/5% | 13% వరకు ఆదా |
| రోజువారీ నిత్యావసరాలు | 18/12% | 5% | 13% వరకు ఆదా |
| ఆరోగ్యం & జీవిత బీమా | 18% | NIL | 18% వరకు ఆదా |
| దుస్తులు & పాదరక్షలు | 12% | 5% | 7% వరకు ఆదా |
| మందులు | 12% | NIL/5% | 7-12% వరకు ఆదా |
| స్టేషనరీ | 12/5% | NIL/5% | 7% వరకు ఆదా |

### వీటిపై కూడా GST రేట్ తగ్గింపు

| ట్రాక్టర్లు (1800 సిసి వరకు) | చిన్న కార్లు (1500 సిసి వరకు) | సైకిళ్లు/స్కూటర్లు (350 సిసి వరకు) |
|---|---|---|
| సేవింగ్స్ దాదాపు ₹ 40,000 | సేవింగ్స్ దాదాపు ₹ 70,000 | సేవింగ్స్ దాదాపు ₹ 8,000 |

| టెలివిజన్లు | ఎయిర్ కండిషనర్లు |
|---|---|
| సేవింగ్స్ : దాదాపు ₹ 3,500 | సేవింగ్స్ : దాదాపు ₹ 2,800 |

**GST**
**బెటర్ & సింపుల్!**
జీఎస్టీ 2.0 సంస్కరణలతో ఒక్క నెలలో మీరు ఎంత ఆదా చేస్తున్నారో ఈ QR కోడ్ ద్వారా తెలుసుకోండి.



**డబుల్ ఇంజిన్ సర్కార్ - ఏపీలో డబుల్ బెనిఫిట్స్ - సూపర్ 6 & జీఎస్టీ 2.0**

01-10pg2exHMNWJQER 2_01-10pg2exHMNWJQER.qxd 9/30/2025 11:46 PM Page 1





మంగళవారం వికె మల్హోత్రా భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

# అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సమావేశంలో అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్ట్‌పై చర్చించినట్లు సమాచారం. ఎపిలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. సమారు 40 నిమిషాలపాటు సమావేశం కొనసాగింది. రాష్ట్రానికి ఆర్థిక సాయం సహా పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సిఎం ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్సీ హయాంలో రాష్ట్రంలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థను కేంద్రం అండతో పునరుద్ధరిస్తున్నామని అమిత్‌షాకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫున మరింత సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. సిఎంతో పాటు భేటీకి కేంద్ర మంత్రుల రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని హాజరయ్యారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో సీఐఐతో కలిసి నిర్వహించనున్న సీఐఐ సదస్సుకు పారిశ్రామిక వేత్తలను వీరు ఆహ్వానం పలుకుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. పూర్వోదయ పథకం కింద ఏపీకి ఆర్థికసాయం కోరారు. పూర్వోదయ నిధులతో ఎపిలోని పలు ప్రాంతాల అభివృద్ధి కోసం.. ప్రణాళికలు రూపొందించినట్లు నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు తెలిపారు. అనంతరం సీఐఐ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలతో జరిగిన సీఐఐ సదస్సులో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, ప్రాడెక్టు పర్ఫెక్షన్ లాంటి కీలకమైన లక్ష్యాలను పెట్టుకున్నామని వివరించారు. సమీకృత అభివృద్ధి అనేది ఇప్పుడు ఓ నినాదం.. పి4 ద్వారా సమీకృత అభివృద్ధి సాధ్యం అవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# ఎపిలో ఎయిర్‌బస్ ప్రాజెక్టు

>> గ్లోబల్ క్వాలిటీ మాన్యుఫాక్చరింగ్, టెక్నాలజీ ట్రాన్స్ ఫర్‌కు అనుకూలంగా ఉన్న రాష్ట్ర ఏరో స్పేస్ పాలసీని వివరించారు. తద్వారా రాష్ట్రాన్ని ఎగుమతి ఆధారిత ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ప్రధాన యూనిట్‌తో పాటు సరఫరాదారులు, ఎంఎస్ఎంఇలు, భాగస్వాములు కలిసి పనిచేయగల ఇంటిగ్రేటెడ్ క్లస్టర్ ను ఏర్పాటుచేయాలని మంత్రి నారా లోకేష్ ఎయిర్ బస్ ను కోరారు. దీనివల్ల టైమ్ లైన్ రిస్కులు తగ్గడంతో పాటు లోకలైజేషన్ పెరిగి తక్కువ ఖర్చుతో విస్తృతస్థాయిలో తయారీ సాధ్యం అవుతుందని వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్న ఏరోస్పేస్ కారిడార్‌లలో అనేక సైటింగ్ ఆప్షన్స్ ఉన్నాయని, అవి ఎయిర్ బస్ ప్రోగ్రామ్ అవసరాలకు, సరఫరాదారుల క్లస్టరింగ్, రవాణ సౌకర్యాలు, భవిష్యత్ విస్తరణలకు అనుగుణంగా ఉంటాయని వివరించారు. ఈ భేటీ కోసం మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా న్యూఢిల్లీ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడిదారుల ప్రాధాన్య విధానాన్ని, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సౌకర్యం, నిర్ధిష్ట గడువులోగా ప్రాజెక్ట్ అమలు వంటి అంశాలతో పాటు చంద్రబాబు బ్రాండ్, ప్రపంచస్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించిన ఆయన ట్రాక్ రికార్డ్‌ను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఎపి దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఎయిర్ బస్ రాష్ట్రంలో యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన పూర్తి ఎకో సిస్టమ్ అందించేందుకు ఎపి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# పెట్టుబడుల ధామం ఎపి

>> వాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం పెట్టుకున్నాం. ఎపిలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ సులభతర వాణిజ్య విధానం అమలు చేయటంలో అగ్రస్థానంలో ఉంది. పోటీ ప్రపంచంలో పెట్టుబడులు ఆకర్షిస్తూ ఉండాలి. సంస్కరణలు ఆలస్యంగా ప్రారంభించినా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాం. ప్రస్తుతం జిఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా మరింత సులభంగా వాణిజ్యం జరుగుతుంది. కోవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించగలిగాం. యూపిఐ పేమెంట్ విధానాన్ని సింగపూర్, ఫ్రాన్స్ లాంటి దేశాలకూ పరిచయం చేశాం. ఎపి సోలార్, పంప్డ్ ఎనర్జీ, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టులు చేపట్టాం. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశ పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఏపీని తయారు చేస్తాం. భారత కర్బన ఉద్గారాల రహిత ప్రయాణంలో కీలక భాగస్వామిగా ఏపీ ఉంటుంది."అని ముఖ్యమంత్రి వివరించారు. తీర ప్రాంతంలో ప్రపంచ ప్రమాణాలతో పోర్టులు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్ల నిర్మాణం చేస్తున్నాం. అడ్వాన్స్డ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహిస్తాం, రైతులకు లబ్ధి కలిగేలా బిగ్ టెక్ కంపెనీలకు ఎపి కీలక స్థానంగా మారుతోంది. సెమీకండక్టర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులతో గ్లోబల్ టెక్ పవర్ హౌస్ గా భారత్ మారుతుంది. సహజ పర్యాటక ప్రాంతాలు ఏపీకి ఉన్న అతిపెద్ద వనరు, విద్య, వైద్య రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. అమెరికా తర్వాత ఇదే రెండో అతిపెద్ద కేంద్రం అవుతుంది. ఎపిలో మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎపిని సందర్శించిన తర్వాతే ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిస్తున్నాను. పెట్టుబడులను ఆకర్షించటంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది. ఐటీ రంగంతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి అత్యుత్తమ నివాస నగరంగా మార్చాం. ప్రస్తుతం అమరావతి నగరాన్ని గ్రీన్ సిటీగా నిర్మాణం చేస్తున్నాం. అమరావతి సమీపంలో ప్రస్తుతం రోజుకు 7 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కృష్ణా గోదావరి నదులను అనుసంధానించాం. ఈ ఏడాది ఈ రెండు నదుల నుంచి 5 వేల టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది. ప్రపంచంలోని అత్యధిక తలసరి ఆదాయం కలిగిన వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉన్నారు. సుస్థిరమైన ప్రభుత్వాలు.. సుస్థిరమైన విధానాలు దేశంలో, రాష్ట్రంలో ఉన్నాయి" అని సిఎం చంద్రబాబు చెప్పారు.

# నిర్మాణ అనుమతుల ఫీజు రూపాయే

>> రూపాయి ఫీజు చెల్లిస్తే అనుమతులిచ్చేలా ఏర్పాట్లు చేసింది. ఈ నిర్ణయంతో ప్రజలకు ఏటా రూ.6 కోట్ల ఫీజుల భారం తప్పనుంది. ఈ మేరకు పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏటా 35 వేలకు పైగా ఇళ్లు,అపార్ట్‌మెంట్లు,ఇతర నిర్మాణాలకు అనుమతులిస్తున్నారు. వీటిపై ఫీజుల కింద రూ.1,500 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. మొత్తం అనుమతుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు 50 చదరపు గజాల్లోపు విస్తీర్ణంలో నిర్మించుకుంటున్న ఇళ్లు 25-30% వరకు ఉంటున్నాయి. రెండస్థుల్లో వీరు నిర్మించుకుంటున్నా ఇళ్లకు ఫీజుల కింద రూ.3 వేలు నుంచి రూ.4వేల వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో పేదలకు ఈ భారం తగ్గనుంది50 చదరపు గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు మిగతా నిర్మాణాల్లా పనులు పూర్తయినట్లుగా ధృవీకరణ అవసరం లేదు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను పట్టణ ప్రణాళిక విభాగం తీసుకోవాల్సిన పనికూడా లేదు. ఇందుకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం సవరించింది. ఇళ్లనిర్మాణానికే రూపాయి ఫీజు వర్తిస్తుంది. ఇదే స్థలంలో దుకాణాల వంటివి నిర్మిస్తే వాటికి యథా ప్రకారం ఫీజులు చెల్లించాలి 60 చదరపు గజాల విస్తీర్ణంలో స్థలంఉండి.. దాన్ని 50 గజాలకు కుదించి చేపట్టేఇళ్ల నిర్మాణాలకు రూపాయి ఫీజు వర్తించదు. ప్రభుత్వ వివాదాస్పద స్థలాల్లో ఇళ్ళ నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లు తనిఖీల్లో వెల్లడైతే వాటిని రద్దు చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నారు.



మంగళవారం ఉదయ్‌పూర్‌లో బాలేశ్వరి మాతను రూ.51,51,151 కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

# కరెన్సీ నోట్లతో దుర్గామాత అలంకరణ

**ఉదయ్‌పూర్ (రాజస్థాన్), సెప్టెంబరు 30:** దసరా నవరాత్రుల సందర్భంగా రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో బాలేశ్వరి మాతను మంగళవారంనాడు దుర్గాష్టమి సందర్భంగా రూ.51,51,151 కరెన్సీ నోట్లతో అలంకరించి పూజలు నిర్వహించారు. బాలేశ్వర్ యువ మండల్ నేతృత్వంలో రూ.50, రూ.100, రూ.200,రూ.500 నోట్లతో దుర్గామాతను అలంకరించారు. గత మూడేళ్లుగా కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ చేస్తున్నామని, తొలి ఏడాది రూ.11,11,111లతో, రెండో ఏడాది రూ.21,21,121, మూడో రూ.31,31,131, నాల్గో ఏడాది అంటే ఈ సంవత్సరం రూ.51,51,151ల విలువైన కరెన్సీ నోట్లతో బాలేశ్వరి మాతను అలంకరించినట్లు బాలేశ్వర్ యువ మండల్ నిర్వాహకులు తెలిపారు. దుర్గాదేవి విగ్రహం చుట్టూ అన్ని వైపులా కరెన్సీ నోట్లను వేలాడదీసి ఉంటాయి. అమ్మవారి కిరీటం కూడా పూర్తిగా నోట్ల పొరలతో అలంకరించారు. ఇక ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో దుర్గామాత మండపాన్ని 400ఏళ్లనాటి రాజా రతన్ సింగ్ రాయల్ మాన్షియన్‌ను పోలి ఉండేలా రూపొందించారు. రూ.1.51 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఈ కరెన్సీ నోట్లతో అలంకరించిన దుర్గామాతను దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలు తరలివస్తున్నారు.

# బేబీ కిట్‌లో మరో రెండు వస్తువులు

>> వేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక 'ఎన్టీఆర్ బేబీ కిట్' పేరుతో పథకాన్ని పునః ప్రారంభించాలని నిర్ణయించింది. మొదట్లో 11 వస్తువులతో బేబీ కిట్ పంపిణీ చేయాలనుకుంది. ఈ కిట్‌కు అయ్యే ఖర్చును రాష్ట్ర బడ్జెట్ నుంచి అమలు చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు.

గతంలో వీటికి ప్రజాదరణ ఉండడంతో బేబీ కిట్‌ల సరఫరా పథకాన్ని పునః ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ పథకాన్ని 2014-19లో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసింది. తర్వాత అధికారంలో వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం కొన్ని సంవత్సరాలు అమలు చేసి రద్దుచేసింది. ప్రస్తుతం నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 13 వస్తువులతో కూడిన బేబీ కిట్ అందుబాటులో తీసుకురానున్నారు. రాష్ట్రంలో సగానికి పైగా ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరుగుతున్నాయి. త్వరలోనే తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్ల పంపిణీ చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ద్వారా 26 జిల్లాల్లోని డిఎంహెచ్‌వోలు, డిఇహెచ్ఎస్‌లు, జిజిహెచ్‌లకు రెండు సంవత్సరాల పాటు 'రేట్ కాంట్రాక్ట్' పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా జూన్‌లో టెండర్లు పిలిచింది. పలు సంస్థలు ఆసక్తి చూపించాయి. సీఎం ఆదేశాల మేరకు అదనంగా రెండు వస్తువులను చేర్చాల్సి రావడంతో మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఈపథకం అమలుకు రూ.65 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నిధులివ్వగానే వెంటనే టెండర్లు పిలిచేందుకు ఏపీఎంఎస్ఐడీసీ సన్నాహాలు చేస్తోంది.బేబీ కిట్‌లో దోమ తెరతో కూడిన పరుపు, వాటర్ ప్రూఫ్ షీటు, దుస్తులు, న్యాప్కిన్లు, తువాలు, సబ్బు, సబ్బు పెట్టె, పౌడర్, ఆయిల్, షాంపూ, బొమ్మ ఇలా 11 వస్తువులు ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఫోల్డబుల్ బెడ్, బ్యాగ్‌నూ ఇవ్వనున్నారు. దీనితో వాటి సంఖ్య 13కి చేరింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవానికి వచ్చి, డిశ్చార్జి అయ్యేటప్పుడు తల్లులకు ఉచితంగా ఈ కిట్లు అందజేస్తారు. గతంలో ఒక్కో కిట్‌కు రూ.1,504 ఖర్చు అయ్యేదని అంచనా వేస్తే, ఈ రెండు వస్తువుల చేరికతో అదనంగా రూ.450 వ్యయం కానుంది



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# పూర్వోదయ పథకం కింద నిధులివ్వండి

## వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఆ నిధులే కీలకం

## కేంద్ర ఆర్థిక మంత్రికి సిఎం చంద్రబాబు వినతి

**విజయవాడ సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి పూర్వోదయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన సిఎం ఆమెకు ఈ అంశంపై వినతిపత్రం సమర్పించారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు.

పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి వివరించారు.

వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వెనుక బడిని ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ను కోరారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్,కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ సీఎం రమేష్ తదితరులు సీఎం చంద్రబాబును అనుసరించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాల్గొన్నారు.

# ప్రకాశం వద్ద తీవ్రస్థాయికి వరద

>> మండలం రామాపురం వద్ద వరద నీరు భారీగా రావడంతో ఆ గ్రామస్తులను పునరావాస శిబిరాలకు అధికారులు తరలించారు.

**లంక గ్రామాలకు ముప్పు**

వరద మరింత పెరిగితే గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని దాదాపు 50 లంక గ్రామాలకు ముంపు సమస్య ఏర్పడనుంది. నాగార్జునసాగర్, పులిచింతల జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి.

**ఒకటిన మరో అల్పపీడనం**

అక్టోబరు ఒకటిన బంగాళాఖాతంలో మరో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. సోమవారం ఉత్తరాంధ్రతోపాటు నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కృష్ణా, గోదావరి పరీ వాహక ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్, నాలుగు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేశారు. పర్యాటకశాఖ బోట్లను తాళ్లతో కట్టేశారు. కృష్ణా నది పరీవాహక లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. గురటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలకు వరద నీరు చేరింది. తుళ్లూరు, కొల్లిపర మండలాల్లోని లంక గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. కొల్లిపర, దుగ్గిరాల తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లో 12 వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. కంద, అరటి, పసుపు, కూరగాయల తోటలు నీట మునిగాయి. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు నీట మునిగినట్టు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా దాచేపల్లి, అమరావతి, అచ్చంపేట, మాచవరం మండలాల్లో పది వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. కృష్ణాతీరంలోని ఎనిమిది మండలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాలో 1634 మంది రైతులకు సంబంధించిన 2174 ఎకరాలు ఉద్యానవన పంటలు నీట మునిగాయి. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లోని అరటి, కంద, బొప్పాయి, తమలపాకులు, కూరగా యలు, మల్బరీ తదితర పంటలు ముంపుకు గురయ్యాయి. ఉత్తర కోస్తా బంగాళాఖాతం అనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దీని ప్రభావంతో ఆ ప్రాంతంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణం కేంద్రం మంగళవారం వెల్లడించింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది. ఇక ఉత్తర అండమాన్ పరిసర ప్రాంతాలలో మంగళవారం అంటే.. ఈ రోజు ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని.. అది రేపు అంటే.. అక్టోబర్ 1వ తేదీ నాటికి మధ్య బంగాళఖాతంలో అల్పపీడనంగా మారుతుందని స్పష్టం చేసింది.

2వ తేదీ నాటికి పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి.. అది వాయుగుండంగా మారుతుందని చెప్పింది. ఇది 3వ తేదీ నాటి దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తా జిల్లాల మధ్య తీరం దాటే ఆవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో అల్లూరి, పార్వతీపురం, కాకినాడ, యానాం, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాలలో రానున్న 24 గంటల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు.. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నివారణ సంస్థ అప్రమత్తమైంది. అందులోభాగంగా జిల్లా కలెక్టర్లకు కీలక సూచన చేసింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. పలు చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. బాపట్ల, ప్రకాశం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. చెట్ల కింద నిలబడరాదన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

**వారం - వర్జ్యం**

01-10-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, శుక్లపక్షం
నవమి సా.6.56
పూర్వాషాఢ ఉ.8.04
వర్జ్యం : సా.4.26-సా.6.07
దు.ఉ.11.34-మ.12.22
రాహుకాలం - మ.12.00-1.30

**వార్తాఫలం**

**మేషం :** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది.

**వృషభం:** గృహం, స్థలాల కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మిథునం:**కోర్టుకేసుల నుండి బయట పడతారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :**ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అవకాశాలు లాభిస్తాయి.

**సింహం:** ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు పొందుతారు. మానసిక ప్రశాంత పొందుతారు.

**కన్య :** రాజకీయ, కళా రంగాల వారికి విదేశీ పర్యటనల సూచన.

**తుల :**చేపట్టిన పనులలో అనేకమైనవాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన వ్యక్తులు పరిచయాలు.

**ధనుస్సు:** సన్నిహితుల నుండి అతి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**మకరం:** ఒత్తిడుల నుండి బయట పడతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కుంభం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మీనం :** గృహనిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విద్యార్థులకు టీచర్లే మార్గదర్శకులు

>> సేవగా భావించి అంకితభావంతో పనిచేస్తారో అప్పుడే విద్యార్థులు వారిని ఎంతో గౌరవిస్తారన్నారు. ఆలా కాకుండా సింప్లి సిటింగ్ అండ్ మంత్లీ టేకింగ్‌లా ఉంటే వారికి సమాజంలో అంత గౌరవం ఉండదని తెలిపారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం పేదవర్గాల పిల్లలే చదువుకుంటున్నారని అన్నారు. ఆ పిల్లల భవిష్యత్తు వారి తల్లితండులను కూడా తెలియదని వారికి తెలిసిందల్లా మా పిల్లవాడు బాగా చదువుకుని పట్టణంలో మంచి ఉద్యోగం చేసుకోవాలని ఆశిస్తారన్నారు. ఒకప్పుడు తమ పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు కావాలని తల్లిదండ్రులు కోరుకునేవారని, ఇప్పుడు ఐఎఎస్, ఐపిఎస్ కావాలని కోరుకుంటున్నారన్నారు. స్కూల్ దశలోనే విద్యార్థులకు మంచి పునాది వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుందని అందుకు నిదర్శనం మంత్రి నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు ఎన్నుకోవడమే అని తెలుసుకోవాలన్నారు. సూపర్ 6లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డిఎస్సీపై మొదటి సంతకం పెట్టారన్నారు. మెగా డిఎస్సీ పూర్తి కాకుండా ఋషులు యజ్ఞాలు చేస్తుంటే రాక్షసులు ఆ యజ్ఞాలను పాడుచేసే విధంగా డిఎస్సీ పూర్తి కాకుండా ఉండడానికి ఎన్నో కేసులు వేశారన్నారు. అయినా మంత్రి నారా లోకేష్ అనుకున్న విధంగా మెగా డిఎస్సీని పూర్తి చేయడం గొప్ప విషయం అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ పిల్లవాడు చదువుకోవాలని ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో 67 లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం అందించారన్నారు. గతంలో ఇంటికి ఒకరికి ఇస్తే నేడు ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటుంటే అంత మంది పిల్లలకు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో చదువుకుంటున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అమరావతి నగరాన్ని అమెరికాలో సిలికాన్ వ్యాలీ లాగా క్వాంటం వ్యాలీ లా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు బాధ్యత తీసుకుని విద్యార్థులకు పాఠాలు నేర్పించటంలో సఫలీకృతం కావాలని కోరారు. మెగా డిఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు సాధించడంలో ఎస్ఎస్ పబ్లికేషన్స్ కృషి అనితర సాధ్యం అన్నారు. లాభా పేక్ష లేకుండా ఈ సంస్థను నిర్వహించడం చాలా గొప్పవిషయం అని మంత్రి కొలుసు పార్థసారథి తెలియజేసారు.ఎస్ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి మాట్లాడుతూ రాష్ట్రంలో మెగా డిఎస్సీలో 50 శాతం కంటే పైన ఉద్యోగాలు సాధించడం మా సంస్థ పురోభివృద్ధికి నిదర్శనం అన్నారు.

అంతే కాకుండా మా సంస్థ నుంచి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం మా సంస్థకు గర్వకారణం అని తెలిపారు. ఎన్నో రాష్ట్రస్థాయి ర్యాంకులను స్వంతం చేసుకుని మా సంస్థ గౌరవాన్ని ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు కాపాడారన్నారు. మెగా డిఎస్సీలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు పొందిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన శేషాద్రి నాయుడు, విత్తనాల వంశీ కృష్ణలకు రూ. 50,000 చెక్‌లను మంత్రి పార్థసారథి అందించారు. అదేవిధంగా ఎస్ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి కుటుంబాన్ని మంత్రి పార్థసారథి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు కె. లక్ష్మణ రావు, కె. శ్రీనివాస్, ఐపిఎస్, సైకాలజిస్ట్ నాగేశ్వరరావు, అంగలూరు డైట్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ఎన్వీజీ ఆంజనేయులు, మెగా డిఎస్సీలో ఉద్యోగాలు సాధించిని ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్టీ తగ్గింపుతో సాగుకు ఊపిరి

>> సేవింగ్స్' కార్యక్రమం జరిగింది. పెద్ద ఎత్తున ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహపరిచారు. పరిణితితో కూడిన కలెక్టర్ డ్రైవింగ్ చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. మంత్రి శ్రీనివాస వర్మ కూడా నాగరాణితో కలిసి ట్రాక్టర్‌లో ప్రయాణించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు కూడా ట్రాక్టర్ నడిపి రైతులకు ప్రోత్సాహం ఇచ్చారు.

సెప్టెంబర్ 22 నుండి కొత్త జిఎస్టీ రేట్లు అమల్లోకి వచ్చాయని మంత్రి వివరించారు. 12 లేదా 7 శాతం ఉన్న పన్ను ఇప్పుడు 5 శాతానికి పరిమితం కావడం వల్ల అందరికీ మేలు జరుగుతుందని చెప్పారు. ఆరోగ్య, విద్య, బీమా రంగాల్లో కూడా జిఎస్టీ తగ్గిందని తెలిపారు. కొన్ని వస్తువులు జీరో శాతానికి తగ్గించబడ్డాయని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు పాకాల వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా వ్యవసాయ రంగం 2 శాతం వృద్ధి సాధించిందని గుర్తు చేశారు. ఇప్పుడు జిఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబం నెలకు రూ 3,000 - 5,000 వరకు ఆదా చేసుకోవచ్చని అన్నారు.

కలెక్టర్ నాగరాణి జిఎస్టీ తగ్గింపు వల్ల సాధారణ ప్రజలకు నిజమైన ఉపశమనం లభిస్తోందని చెప్పారు. ఆహారం, మందులు, పాఠ్యపుస్తకాలు, బట్టలు, రవాణా వంటి వాటికి పన్నులు తగ్గించారని వివరించారు. మత్స్యకారులు, చిన్నతరహా వ్యాపారులు, నేత కార్మికులు, శిల్పులు, జిమ్‌లు, టూరిజం, లాజిస్టిక్స్ రంగాల వారికి ఉపయోగం కలుగుతుందని తెలిపారు.

జీఎస్టీ స్లాబులు నాలుగు నుంచి రెండు మాత్రమే మిగిలాయని చెప్పారు. రాష్ట్రానికి ఏడాదికి రూ. 8,000 కోట్ల నష్టం వచ్చినా ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా హస్తకళలు, నూలు రంగానికి జీరో శాతం జిఎస్టీ అమలు పెద్ద ఊరట అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, అధికారులు, రైతులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

1-10Pg3exHMNWJQEKV 3 GNT_1-10Pg3exHMNWJQEKV.qxd 9/30/2025 11:57 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-10-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 241 పేజీలు: 12 వెల: 6.50

**అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ** 2లో

**పూర్వోదయ పథకం కింద నిధులివ్వండి : కేంద్రమంత్రితో సిఎం**

# పెట్టుబడుల ధామం ఎపి

## 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మా విధానం

## ఇన్వెస్ట్‌మెంట్ల ఆకర్షణలో మాకు ట్రాక్ రికార్డు ఉంది

## తీర ప్రాంతం మాకున్న బలం

## విశాఖలో జరిగే భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలు రావాలి

## ఢిల్లీ సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు



మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశంలో పెట్టే పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తామని తెలిపారు. వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సిఎం పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన సిఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, వివిధ దేశాల రాయబారులను సిఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విశాఖలో నిర్వహించే 30వ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామిక వేత్తలను, వివిధ దేశాల రాయబారులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. నవంబరు 14, 15వ తేదీల్లో సిఐఐ భాగస్వామ్య సదస్సు జరుగుతుంది. పరిశ్రమలకు అనువుగా ఉండేలా లాజిస్టిక్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారుల నిర్మాణం చేపడుతున్నాం. సంపద సృష్టికి పెట్టుబడులు రావాలి, సంపద సృష్టిస్తేనే పేదరికాన్ని నిర్మూలించగలం.

ప్రధాని మోడీ వికసిత్ భారత్ 2047 రూపొందిస్తే.. మేం స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశాం. ఎపిని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటమే స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యం. దీని కోసం 10 సూత్రాలను ఆధారంగా చేసుకుని పని చేస్తున్నాం. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, ప్రాడెక్టు పర్ఫెక్షన్ లాంటి కీలకమైన లక్ష్యాలను పెట్టుకున్నాం. సమీకృత అభివృద్ధి అనేది ఇప్పుడు ఓ నినాదం... పి4 ద్వారా సమీకృత అభివృద్ధి సాధ్యం. స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరోస్పేస్ సిటీలను ఏపీలో ఏర్పాటు చేస్తున్నాం." అని సిఎం చెప్పారు. 2026 జనవరి నాటికి ఎపి రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. ఆ తదుపరి రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్ పరికరాలను కూడా ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటాం. 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పని చేస్తోంది. పనిచేసే యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద వనరు. ఇదే దేశాభివృద్ధికి కీలకం. పునరుద్పాదక విద్యుత్ రంగంలో 500 గిగావాట్లను దేశంలో ఉత్పత్తి చేయాలని నిర్దేశిస్తే... అందులో ఎపిలోనే 160 గిగా >>2



మంగళవారం న్యూఢిల్లీలో ఎయిర్ బస్ బోర్డుతో సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి లోకేష్, ఇతరులు

# రాష్ట్రానికి ఎయిర్‌బస్ ప్రాజెక్టు

## సంస్థ బోర్డుతో చర్చలు జరిపిన మంత్రి లోకేష్

### ఏరోస్పేస్ హబ్‌గా రాష్ట్రం, యూనిట్‌కు పూర్తిగా సహకారం : మంత్రి

**విజయవాడ, సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో ఎయిర్‌బస్ ప్రాజెక్టు ఏర్పాటుకు అన్నివిధాలుగా సహకరిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రధాన యూనిట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌ను ఏర్పాటుచేస్తే అందుకు అవసరమైన అన్నింటిని అందుబాటులో ఉంచుతామన్నారు. విమానాల తయారీ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాత ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్ పెట్టుబడుల కోసం రాష్ట్రం మరో ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్ సంస్థ పూర్తిస్థాయి బోర్డుతో ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీలో ఎయిర్ బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తో పాటు ఎయిర్ బస్ ఇండియా, సౌత్ ఏషియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొన్నారు. మేకిన్ ఇండియా, స్వదేశీకరణ అవకాశాల అన్వేషణలో భాగంగా ఎయిర్ బస్ బోర్డ్ మొదటిసారి భారతదేశానికి రావడం జరిగింది. రాష్ట్రంలో ఎయిర్ బస్ ఆధారిత ప్రపంచస్థాయి ఏరోస్పేస్ మ్యానుఫాక్చరింగ్ ఫెసిలిటీతో పాటు దీనికి అనుబంధంగా టైర్1, టైర్2 సరఫరాదారుల సహ ఉత్పత్తి యూనిట్ల రూపంలో కలిసి పనిచేసేలా ప్రతిపాదనను మంత్రి లోకేష్ వారి ముందుంచారు. ఎపిలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భూమి లభ్యతతో పాటు ప్రాజెక్ట్ వేగవంతంగా పూర్తి, >>2



# ఫర్నిచర్, కలపపైనా సుంకాల మోత

## ట్రంప్ పేల్చిన మరో బాంబు

**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బాంబు పేల్చారు. ముందుగా చెప్పినట్టుగానే ఫర్నిచర్, కలపపై సుంకాల మోత మోగించారు. కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ పరికరాలతో పాటు అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్, భారీ ట్రక్కులపై భారీ సుంకాలు విధిస్తానంటూ ఇటీవల ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే ఆ మేరకు తాజాగా కలపపై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలను తాజాగా విధించారు. ఇవి అక్టోబరు 14వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. చైనా సహ ఇతర దేశాల దిగుమతుల కారణంగా ఫర్నిచర్ వ్యాపారానికి కేంద్ర స్థానంగా ఉండే అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం దాని ప్రాభవాన్ని కోల్పోయిందని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయకపోతే భారీ స్థాయిలో టారిఫ్‌లను వేస్తామని తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో హెచ్చరించారు. ఇక ఇప్పటికే.. సినిమాలపై కూడా ట్రంప్ భారీగా సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా బయట నిర్మించే సినిమాలపై 100 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడనున్నట్లు సంబంధిత విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో సోమవారం మరోసారి సుంకాల రూపంలో అంతర్జాతీయ వాణిజ్య భాగస్వాములపై డొనాల్డ్ ట్రంప్ దాడి చేశారు. ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ.. దిగుమతి చేసుకుంటున్న కలప, ఫర్నిచర్ ఉత్పత్తులు అమెరికా జాతీయ భద్రతకు విఘాతం కలిగిస్తున్నాయని వాదించారు. ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ 232 కింద ఈ సుంకాలను విధిస్తున్నట్లు పేర్కొన్నారు. అమెరికా కలప పరిశ్రమ బలహీనపడటం వల్ల కలప మిల్లులు మూతపడే ప్రమాదం ఉందని జాతీయ భద్రత, క్లిష్టమైన మౌలిక సదుపాయాలకు అవసరమైన కలప ఉత్పత్తుల డిమాండ్‌ను తీర్చలేమని ఆ ప్రకటనలో తెలిపారు. ఈ టారిఫ్‌ల పెంపుతో అప్‌హోల్‌స్టర్డ్ కలప ఉత్పత్తులపై సుంకాలు 30 శాతానికి కిచెన్ క్యాబినెట్‌లపై 50 శాతానికి పెరుగుతాయి. అయితే ఇది అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోని దేశాలకు మాత్రమే వర్తిస్తుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కలప ఉత్పత్తులతో పాటు, పేటెంట్ పొందిన ఫార్మాస్యూటికల్స్, భారీ ట్రక్కుల దిగుమతులపైనా సుంకాలు విధిస్తామని గత వారమే ట్రంప్ ప్రకటించారు. తాజాగా తీసుకున్న ఈ చర్యలు అమెరికాకు కలపను సరఫరా చేసే అతిపెద్ద దేశమైన కెనడాపై అదనపు భారం పడనుంది. మరోవైపు ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు చైనా ఫర్నిచర్‌పై సుంకాలు విధించడంతో ఆ ఉత్పత్తులను ఇప్పుడు మెక్సికో, వియత్నాం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

## రాజమండ్రి-తిరుపతి మధ్య విమానం

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాజమండ్రి - తిరుపతి మధ్య అలయన్స్ ఎయిర్ కొత్త విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రారంభోత్సవం అక్టోబర్ 1, 2025 ఉదయం 9 గంటలకు రాజమండ్రి విమానాశ్రయంలో జరుగుతుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్నారు. ఈ కొత్త సర్వీసుతో ప్రజలు సులభంగా, త్వరగా రాజమండ్రి - తిరుపతి మధ్య ప్రయాణించ గలుగుతారు.

## చిరు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు

### ప్రభుత్వ నిర్ణయం

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో చిరు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం దసరా శుభవార్త తెలిపింది. 2014-19 మధ్య పనులు చేసిన చిరు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. దాదాపు ఏడేళ్లుగా ఈ బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రూ.5 లక్షల మేర బిల్లుల చెల్లింపునకు ఆర్థికశాఖ నిర్ణయం తీసుకుంది. ఎపిలో 2019 నుంచి ఇప్పటివరకు చేపట్టిన పనులకు రూ.5 కోట్ల మేర బిల్లుల చెల్లింపుకు ఎపి ఆర్థికశాఖ నిర్ణయం తీసుకుంది. దీనివలన ఎపిలో దాదాపు రూ.400 కోట్ల మేర చిరు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరనుంది.

## పేదల ఇళ్ల నిర్మాణ అనుమతుల ఫీజు రూపాయే

### పేద, మధ్యతరగతికి తగ్గనున్న భారం

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** పుర,నగరపాలక సంస్థలు,నగర పంచాయితీల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఇళ్ల నిర్మాణ అనుమతుల ఫీజులు భారం కాకుండా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 50 చందరపు గజాల్లోపు విస్తీర్ణంలో చేపట్టే జీ+1,ఆ లోపు భవన నిర్మాణానికి ఫీజు రూపాయింగా నిర్ణయించింది. ధరఖాస్తుతోపాటు ఇంటి నిర్మాణానికి సంబంధించి డ్రాయింగ్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి >>2

# విద్యార్థులకు టీచర్లే మార్గదర్శకులు



మంగళవారం డిఎస్సీ సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

## 'సింప్లీ సిటింగ్, మంత్లీ టేకింగ్'లా ఉపాధ్యాయులు ఉండకూడదు..

## మంచి ఉపాధ్యాయుడు ఒక భావితరాన్ని మార్చగలడు: మంత్రి పార్థసారథి

**విజయవాడ, సెప్టెంబరు 30, ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజంలో ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. మంగళవారం నగరంలో మెగా డిఎస్సీ 2025 సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డిఎస్సీ అంటే అందని ద్రాక్ష పండులా ఉండేదని దానిని అందేలా చేసిన ఘనత సిఎం చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో 16 వేల టీచర్ పోస్టులను సకాలంలో పారదర్శకంగా భర్తీ చేశారన్నారు. ఇందులో ఎక్కువగా ఎంపికైన వారు పేద కుటుంబాల నుంచి వచ్చిన వారై ఉంటారని నేను భావిస్తున్నానన్నారు.

డిఎస్సీలో ఉద్యోగం సాధించినవారు ఎంతో బాధ్యతాయుతంగా ప్రభుత్వ స్కూల్స్‌కు వచ్చే పేద విద్యార్థుల పిల్లలకు గుర్తుండే విధంగా విద్యా బుద్దులు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. స్కూల్లో పాఠాలు నేర్పించడం ఎంతో కష్ట సాధ్యమైన విషయం అని పాఠాలు చెప్పే వ్యక్తి కంటే విద్యార్థుల బ్రెయిన్స్ పది రెట్లు ఎక్కువుగా పనిచేస్తామని తెలిపారు. అలాంటి పిల్లలను సక్రమమైన దారిలో పెట్టి విద్యాబుద్దులు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. స్వర్ణాంధ్ర 2047కు ప్రపంచంలో భారతదేశం నెంబర్ వన్ లాగా ఉండేలాగా విద్యార్థులను టీచర్‌లు సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు.

ఒకప్పుడు టీచర్‌లు అంటే ఒక విధమైన భయం, గౌరవం ఉండేదని నేడు టీచర్‌లు అంటే పరిస్థితి ఎలా ఉందో మనందరం చూస్తూనే ఉన్నామన్నారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల ఉన్న గౌరవం విద్యార్థుల్లో కొంత తగ్గిందని, ఇది సమాజానికి ఆరోగ్యకరం కాదన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తెలిపారు. ఎప్పుడైతే ఉపాధ్యాయులు తమ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా, >>2



## ఎన్టీఆర్ బేబీ కిట్‌లో మరో రెండు వస్తువులు

**విజయవాడ,సెప్టెంబరు30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారికి ఉచితంగా అందించే ఎన్టీఆర్ బేబీ కిట్‌లో మరో రెండు అదనపు వస్తువులు చేర్చారు. ఇటీవల ఈ కిట్‌ను పరిశీలించిన సిఎం చంద్రబాబు నాయుడు అదనంగా ఫోల్డబుల్ బెడ్, బ్యాగ్‌ను చేర్చాలని ఆదేశించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ దీని కోసం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం సుమారు 3.20 లక్షల మంది తల్లులకు ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం 2016లో టిడిపి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆతర్వాత వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం కొన్నాళ్లు అమలు చేసి నిలిపి >>2



మంగళవారం జిఎస్టీ అవగాహన ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి, ట్రాక్టర్‌పై కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ

# జిఎస్టీ తగ్గింపుతో సాగుకు ఊపిరి

### -కేంద్రమంత్రి భూపతిరాజు

### సంస్కరణల అవగాహన ర్యాలీలో ట్రాక్టర్ నడిపి ఆకట్టుకొన్న కలెక్టర్ నాగరాణి


**విజయవాడ సెప్టెంబరు 30,ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ పరికరాలపై జిఎస్టీ తగ్గించడం రైతులకు పెద్ద ఊరట కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఉత్పత్తి వ్యయాలు తగ్గుతాయని వివరించారు. భీమవరం లూథరన్ స్కూల్ మైదానంలో మంగళవారం 'సూపర్ జిఎస్టీ - సూపర్ >>2

# ప్రకాశం వద్ద తీవ్రస్థాయికి వరద

## నీట మునుగుతున్న ఇళ్లు, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## నది ఘాట్లలో స్నానాలపై నిషేధం

**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ వరద ఉధృతి తీవ్రస్థాయికి చేరుతుంది. ఆనకట్ట వద్దకు 6,86,074 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఇక్కడ రెండో నెంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. బ్యారేజీకి చెందిన 69 గేట్లను ఎత్తి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఏడు లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దసరా శరన్నవరాత్రులకు వచ్చే యాత్రికులు నది ఘాట్లలో స్నానాలు చేయరాదని, జల్లు స్నానం మాత్రమే ఆచరించాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ స్నానాల కోసం నదిలోకి దిగకూడదని హెచ్చరించింది.



ప్రకాశం బ్యారేజీ వద్ద వరద దృశ్యం

**పునరావాస శిబిరాలకు తరలింపు**

ఏకకాలంలో నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో గుంటూరు జిల్లా తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని పలుగ్రామాల్లోకి వరదనీరు చేరింది. పల్నాడు జిల్లా దాచేపల్లి >>2

**వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు** 9లో

వార్త

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.

-స్వీడెన్ బర్గ్

# ఇక 'పైరసీ' ఆటకట్టేనా!

పైరసీ అనగానే చలనచిత్ర ప్రపంచాన్ని ఊపేస్తున్న రక్కసి. దీని బారినపడి తెలుగు చిత్రసీమలో డబ్బు పోసి చిత్రనిర్మాణం సాగిస్తున్న నిర్మాతలకు దాదాపు రూ.3700కోట్ల నష్టం వాటిల్లిందని తేల్చారు. ఇది ఏమంత చిన్న మొత్తం కాదు. సినిమాల మీద ఆధారపడి ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. చిన్నా చితక ఎవరైతేనేం సినీ కార్మికుల ఎంతో మందికి కూడు పెట్టే ఈ రంగం మూలబడితే వారి జీవన విధానానికే గొడ్డలిపెట్టు అవుతుంది. ఏదో సినిమా తీసాక పైరసీ జరిగితే నష్టం కేవలం నిర్మాతకేననుకుంటే పొరపాటు. నష్టాలొస్తే మరో సినిమా తీయడం కష్టం. ఈ నేపథ్యంలో సినీ రంగం కుంటుపడుతుంది. ఎన్నాళ్లుగానో చిత్ర రంగానికి పెను సవాల్‌గా మారిన పైరసీముఠాను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకోగలగడం అభినందించదగిన విషయం. చాలా సంవత్సరాలుగా అగ్ర కథానాయకుల చిత్రాలు పైరసీకి గురికాగా సినీ హీరోలు మహేష్‌బాబు, చిరంజీవి వంటి వారు 'పైరసీ' మంచి పద్ధతి కాదని సందేశాలు ఇస్తూనే ఉన్నారు. మన భాషా చిత్రాలకే పైరసీ పరిమితంకాలేదు. పరభాషా చిత్రాలను పైరసీకారులు వదలి పెట్టలేదు. దేశంలోనే అతిపెద్ద పైరసీ ముఠాను పట్టుకున్న ఖ్యాతి నగర పోలీసులకు దక్కింది. చెట్టు చాటునో, పుట్ట చాటునో దాగినేరానికి పాల్పడిన వారు దొరకడం సులభమేమో కానీ సినీ థియేటర్లలోఅత్యంత రహస్యంగా కెమెరాలతో పకడ్బందీ ప్లాన్‌తో సినిమాలను కాపీ చేసేవారిని పట్టుకోవడానికే చాలా రోజులు పట్టింది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన దేశంలో మాయచేయడం కష్టమైన పనేం కాదు. మంచికి ఉపయోగపడే పరికరాలే చెడుకు, అక్రమ సంపాదనకు మార్గాలుగా అక్కరకొస్తున్నాయి. తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన యాంటీ వీడియో పైరసీ సెల్ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సర్వర్ హ్యాకింగ్‌తోపాటు క్యామ్ కార్డర్ ద్వారా నిందితులు సినిమాలను పైరసీ చేస్తున్నారు. తమిళనాడులోని ఒ ప్రధాన పట్టణం కరూర్‌కు చెందిన ప్రధాన నేరస్తుడు సిరిల్ ఇన్‌ఫంట్ రాజ్, సుధాకరన్‌లు, అశ్వీన్‌కుమార్ (బీహార్) జానా కిరణ్ కుమార్ (హైదరాబాద్) అర్సలన్ అహ్మద్( నార్త్‌గోవా)లతో ఒక ముఠాగా ఏర్పడి పైరసీ కార్యకలాపాలను విజయవంతంగా చేయగలుగుతారని పోలీసుల దర్యాప్తులో తేలింది. వారు పైరసీ చేసిన చిత్రాల సంఖ్య తక్కువేమీ కాదు. వారుగా ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని పైరసీ వీడియోలను రహస్యంగా విక్రయిస్తున్నారు. పైరసీ వద్దంటూ ఎవరెన్ని విజ్ఞాపనలు చేసినా ఎక్కడా ఆగలేదు. కోట్లాది రూపాయల నష్టంతో నిర్మాతలు దిగాలు పడిపోయిన సందర్భాలే ఎక్కువ. కొంతమంది పైరసీ ముఠా నెట్‌వర్క్ సభ్యులు దుబాయ్, నెదర్లాండ్స్, మయన్మార్‌లోఉన్నారని తెలిసి అక్కడి వారి వ్యవహారాలను కూడా ఛేదించారు. తాజాగా కుబేర, హరిహర వీరమల్లు, సింగిల్, హిట్ వంటి చిత్రాలను కూడా పైరసీచేశారు. వీరు పైరసీ చేసిన వెంటనే వాటిని తమిళ్ బ్లాస్టర్స్, మూవీ రూల్స్, తమిళ్ ఎంవీసైట్లలో ఉంచుతారు. ఈముఠా నాయకుడు కంప్యూటర్‌సైన్స్ ఇంజినీరింగ్ చేసిన కరూరు నివాసి, 2020 నుంచి నాలుగు వెబ్‌సైట్లు నడుపుతున్నాడు. ఎంతో పకడ్బందీగా ఎవరికీ తెలియకుండా పైరసీ వ్యాప్తి తద్వారా ఈజీమనీ సంపాదించడమే అతని ప్రధాన వ్యాపకం. గత యేడాది ఈపైరసీ అధికస్థాయిలో జరిగినటు నగరపోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ మీడియాకు ఈ ముఠా పాల్పడిన చిత్ర విచిత్ర విశేషాలను అందించారు. ఈ ముఠా సభ్యులు రహస్యంగా పైరసీ చేయడం వాటిని విస్తృత పరిచే విషయంలో తీసుకునే జాగ్రత్తలు తదితర పాటించే మెళకువలన్నిటినీ కూలంకషంగా వెల్లడించారు. థియేటర్లలలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడిని, ప్యాస్‌వర్డ్‌లను హ్యాక్ చేస్తున్నారని, ఒకవేళ హ్యాక్ అవకపోతే ఏజెంట్లకు కెమెరాలిచ్చి వాటిని రహస్యంగా రికార్డు చేయిస్తుంటారని లోగుట్టును పోలీసులు గుర్తించారు. పాప్‌కారన్ డబ్బా, కోక్ టిన్, షర్ట్ జేబులో కెమెరాలు, సెల్‌ఫోన్లతో కెమెరాలు పెట్టి ఆయా సినిమాలు చిత్రీకరిస్తున్నారు. గత ఏడాదిన్నరలో నిందితుడు జానా కిరణ్ 40 సినిమాలను రహస్యంగా చిత్రీకరించాడు. సినిమా విడుదలైన తొలి రోజునే వాటిని చిత్రీకరించేవాడు. ప్రతి సినిమాకు 300నుంచి 400డాలర్ల బిట్‌కాయిన్స్ రూపంలో తీసుకునేవాడు. ఈటివి విన్ కంటెంట్‌ను కూడా వదిలిపెట్టలేదు. ఇదిలా ఉండగా గత యేడాది మొత్తం సినిమా ఇండస్ట్రీకి సుమారు రూ.22,400 కోట్ల నష్టం రాగా తెలుగు ఇండస్ట్రీకి సుమారు రూ.3,700 కోట్లు నష్టం వాటిల్లింది. గత ఐదేళ్లలో 500చిత్రాల పైరసీకి పాల్పడిన అంతర్ రాష్ట్రముఠా ఆటకట్టించడం ఇప్పటికైనా నెరవేరడం చాలా మంచిదయ్యింది. డిజిటల్ మీడియాను హ్యాక్ చేయడం, థియేటర్లలో రికార్డు చేసి పైరేటెడ్ సినిమాలను వెబ్‌సైట్‌ల ద్వారా ఇంత విస్తృతంగా పంపిణీ చేయడంలో ఈ ముఠా ఆరితేరింది. ఇలాంటి వారిపై చట్టరీత్యాచర్యలు తీసుకోగలిగితేనే మరికొందరు మంచి మంచి సినిమాలను నిర్మించగలుగుతారు.. వీరిని అరెస్టు చేసిన సందర్భంలో వెబ్‌కామ్, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్స్, హార్డ్‌డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లు డాంగెల్స్, పెన్‌డ్రైవ్‌లు వంటి అత్యాధునిక ఎలక్ట్రానిక్ వస్తువులనూ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఐదేళ్లగా ఈముఠా పోలీసుల కన్నుకప్పి తిరుగుతోందంటేవారు ఏ మేరకు సాంకేతిక నిపుణులో అర్థమవుతోంది. కంటెంట్, రొబస్ట్, ఫోరెన్సిక్స్, వాటర్ మార్కింగ్‌లనే చైన్ కస్టడీని వినియోగిస్తున్నా ఫలితాలు కనపడలేదు. తాజాగా పైరసీ రాకెట్ ముఠాను పట్టివేత సినీ నిర్మాతలను ఆనందంలో ముంచెత్తింది. సినీ రంగం మూడుపువ్వులు ఆరుకాయల చందాన విలసిల్లగల తరుణం ఆసన్నమైంది.

అన్ని స్వర్గాలకంటే కూడా భూమి చాలా ఉన్నతమయినది. విశ్వంలోనే ఇది ఒక గొప్ప పాఠశాల.




స్వామి వివేకానంద

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.



జార్జ్ ఇలియట్

## ప్రజావాక్కు



### ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదం

**భారత** ఐటీ రంగంఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్నా, హెచ్1బివీసాలపై అధిక ఆధారపడటం భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతోంది. ప్రపంచ వలస విధానాలు క్రమంగా కఠినతరమవుతున్న ఈ పరిస్థితుల్లో, స్థిరమైన వ్యూహాలను అవలంబించడం అనివార్యం. స్థానిక నియామకాలనుపెంచడం, రిమోట్‌డెలివరీ విధానాలను అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడంద్వారా సంస్థలు తమ స్వావలంబనను నిర్ధారించుకోవాలి. అదేసమయంలో స్వదేశీ ప్రతిభను పెంపొందించడం అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశం. భారతీయ యువత, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు, తమ ప్రతిభనుప్రదర్శించిస్థానికస్థాయిలో స్టార్ట్‌అప్స్‌ను స్థాపిస్తే, దేశీయఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు, గ్లోబల్ టెక్ రంగంలో మన స్థానం మరింత బలపడుతుంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆధిపత్య ధోరణి

**సోనమ్** చేసిన తప్పేమిటి తమ ప్రాంతం పైన ఉన్న ప్రేమను తెలియజేయడమే కదూలేదా తనప్రాంతం, అస్తిత్వం నిలుపుకోవడానికి ప్రయత్నించడమేకదా తమ ప్రాంత వనరులపైన తమ అధికారమేఉండాలి అని కోరుకోవడమే కదా, ప్రభుత్వంతో ఇదేతంటా పోరులు చేస్తున్న ఉద్యమానికి సాంఘిక సామాజిక ఆర్థిక కారణాలు ఉంటాయి అయితే ప్రభుత్వం దానిని దేశ రక్షణకు భంగం అంటుంది. శాంతి భద్రతల సమస్యగా చూపడం సామాజిక ఉద్యమ కారులు అయితే వాళ్ళు నడిపే సంస్థలకీ నిధులు వేరే దేశాల నుండి వస్తున్నాయి. ప్రచారంలోకి తేవడం ఆధిపత్య ధోరణి ప్రదర్శించడం పరిపాటిగా మారింది.

- భారత అవినాష్, జనగామ

### నూతన చైర్మన్ ఎంపికలో జాప్యంవద్దు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ప్రస్తుత చైర్మన్ పదవీ కాలం అక్టోబర్9తో ముగుస్తుంది. పదులసంఖ్యలో నియామకాలు చివరిదశలో ఉన్నాయి. తదుపరి చైర్మన్ ఎంపిక ఆలస్యం అయితే ఇంకొన్ని నెలలు నిరుద్యోగులు తమ ఫలితాల కోసం, నూతన నోటిఫికేషన్ల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితివస్తుంది. ప్రభుత్వం త్వరితగతిన నూతన చైర్మన్ ఎంపిక ప్రక్రియ చేపట్టాలి.

- జి.వి.సాయికుమార్ గుంత, పెనుగొలను

### స్థానిక సంస్థల ఎన్నికలు

**అక్టోబర్**9న విడుదలకానున్న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాజకీయ వాతావరణాన్ని ఉత్కంఠభరితంగా మార్చబోతోంది. అయితే ఈ ఎన్నికలలో అత్యంత చర్చనీయాంశం బీసీలకు 42శాతం రిజర్వేషన్. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశ్యం సమాజంలోని వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాతినిధ్యం ఇవ్వడం. కానీ ఈ నిర్ణయం చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రస్తుతం హైకోర్టులో నిలిచిపోయింది. సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టంచేసింది స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతం 50మించకూడదని. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు అయితే, ఆపరిమితి దాటుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజకీయ పరంగా బీసీవర్గాల మన్నన పొందేలా కనిస్తోంది. కానీ అది న్యాయస్థానాల పరిశీలనలో ఎంతవరకు నిలబడుతుందన్నది ప్రశ్నార్థకమే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### భవిష్యత్తు అగమ్యగోచరం

**అమెరికా** దన్నుతో పాలస్తీనాలోని గాజా సిటీపై పూర్తి పెత్తనం సాధించడానికి ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దారుణ మారణ హోమాన్ని చాలాదేశాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇందుకు సాక్షిగా మొన్న జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు ప్రసంగం ప్రారంభిస్తుండగా అక్కడ హాజరయిన చాలా దేశాల నాయకులు తమ సీట్లలో నుండి నిరసనను తెలియజేస్తూ బయటకు వెళ్ళిపోయారు. వీరినందరిని ప్రజా వ్యతిరేకులుగా, ఉగ్రవాద సమర్థకులుగా చిత్రీకరించి తన ఉపన్యాసాన్ని కొనసాగించడం జరిగింది. ఉక్రెయిన్ రష్యాల అధినేతలు సంవత్సరం పైగా తమ ఆస్తిపాస్తులను, అమాయక ప్రజలప్రాణాలను పణంగా పెట్టి మారణా యుధాలతో ఆడుకుంటున్నారు. భవిష్యత్తుఅగమ్య గోచరంగా కనపిస్తున్నది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### రైతు సమస్యలను పట్టించుకోండి

వ్యవసాయరంగం భారత ఆర్థికవ్యవస్థకు ఆధారస్తంభంగా నిలుస్తోంది. ప్రధానంగా, 2013 భూసేకరణ చట్టంప్రకారం, భూమిని కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం ఇప్పటికీ పూర్తిస్థాయిలోఅందడం లేదు. అలాగే, నూతన జాతీయ మార్కెటింగ్ విధానాన్ని పునఃసమీక్షించి, రైతుఉత్పత్తులకు అనుకూలమైనవిధంగామార్చాలి. రైతుకువాస్తవలాభంచేకూరేలా చేయాలి.

- కె.రామారావు, నల్గొండ జిల్లా

మన వి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మాబ్ సైకాలజీకి మందులేదా?

**ఎన్నో దుర్ఘటనలు, ఊరేగింపులలో దేవాలయాలల్లో, పుష్కరాలలో బహిరంగ సభలలో, జనసమూహాలు ఎక్కడున్నా, తొక్కిస లాటలూ జరగటం సర్వసాధారణమయింది. ఇలాంటివాటిని అరికట్టి ప్రజల ప్రాణాలూ, గౌరవ జీవితాలనూ కాపాడటా నికి మార్గాలు లేవా? ఎందుకు లేవు? క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, మొదట పాలకులు నేర్చుకోవాలి. అలనాడు జరిగిన రైల్వే ప్రమాదానికి కేంద్ర మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తప్పుకున్నారు. అటు తర్వాత ఎందరో నాయకులు ప్రత్యక్ష బాధ్యత లేకపోయినా బాధ్యత నెత్తిమీద వేసుకొని మార్గదర్శకులుగా ఉన్నారు. ఇప్పుడు అలాంటి దార్శనికత దుర్లభం అయింది. ప్రజల్లోంచి ప్రజాప్రతినిధులోంచి పాలకుల్లోంచి అలాంటి మార్గదర్శకులు వచ్చినప్పుడే మానవ తప్పిదాలను అరికట్టడానికి ఈ ప్రజాస్వామ్యంలో రహదారి ఏర్పడుతుంది. అది సాధ్యమా? సాంకేతిక పరిజ్ఞానాన్నిఅంది పుచ్చుకున్న ఈ కాలంలో ఆన్‌లైన్‌లో ఇలాంటి సమావేశాలు జరుపుకొని తమ సందేశాలను అదించి స్వీయ నియంత్రణతో సక్రమంగా బాధ్యత నిర్వహించుకోవచ్చు కదా! ప్రజలు అప్పుడు క్రమశిక్షణకు కట్టుబడే అవకాశం ఉంటుంది కదా!**



రావులపాటి సీతారాం రావు

నాగరిక సమాజ నిర్మాణంలో అసంకల్పితంగా అనాగరికంగా తయారవుతున్నామా అనే సందేహం ఈ మధ్య జరుగుతున్న దుర్ఘటనలు తెలియపరుస్తున్నాయి. కరూర్ దుర్ఘటన (తమిళనాడులో జరిగింది) ఒక్కటి చాలు! ఇలాంటి వాటికి అడ్డం పట్టటానికి. అట్టహాసంగా ప్రతిక్రియా ఉండాలనే తాపత్రయం మన దేశంలో ముఖ్యంగా దక్షిణాదిన రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నది. రాజకీయాల్లోకి సినిమా నటులు వస్తే రాజకీయ ఉన్నత పదవులు వాటంతటా అవే వస్తాయనే ఆలోచనలు కాస్త పేరు తెచ్చుకున్న, తెచ్చుకుంటున్న ఏ నటుడికైనా, నటులకైనా ఈ మధ్య ఎక్కువవుతున్నాయి. రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చు. ముఖ్యంగా జన బాహుళ్యంలో పేరున్న జనం మధ్య పెరిగిన ఎవరైనా రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తే, వారికున్న విషయ పరిజ్ఞానంతోటి, అపారమైన అనుభవంతోటి సమాజానికి తమవంతుగా, ఇతోధికంగా సేవతోపాటు సహాయ సహకారాలు అందించే అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. అంత మాత్రాన వారి రాకతో ప్రతిపక్షాలూ, తమను కాదనుకొనేవారు ఉలిక్కిపడేలా భారీ సభలూ, సమావేశాలు పెట్టి అదుపు చేయలేని సంఖ్యలో జనసమూహాలను రప్పించి అక్కడ ఏదైనా జరుగుతే తమకేమీ సంబంధంలేదని, అది పోలీసుల, ప్రభుత్వాల బాధ్యత అని సుతారంగాచెప్పి తప్పుకోవటం సరికాదేమో! బాధ్యత అనేది కేవలం పోలీసులకూ, ప్రభుత్వాలకే సంబంధించిన సమస్య అనుకుంటే, ప్రజాస్వామ్య పరధులను అవగాహన చేసుకోలేదని భావించక తప్పదు. సినిమా నటులను ప్రేమించనివారు చాలా తక్కువ మంది! నిత్య జీవితంలో వారు భాగమయ్యారు. ఈ మధ్య టివిలూ, మరికొన్ని సౌకర్యాలు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించడానికి దృశ్య మాధ్యమాలు విరివిగా అందుబాటులో ఉండటంతో సినిమాలు చూడటం తక్కువయింది. కానీ పేరుగాంచిన నటుల ఫాన్స్ మాత్రం హెచ్చుసంఖ్యలో జన జీవనంలో భాగం కావటమే కాకుండా, వారు అభిమానించే నటుల మీద యీషణ్మాత్రం కూడా విమర్శలు కానీ, విరుపులు కానీ రానీయకుండా వారి చుట్టూ రక్షణ నిలయాలుగా అభిమాన ఈ సంఘాలు పనిచేయడం ముదావహం. కానీ తప్పొప్పుల విచక్షణ లేకుండా ప్రతిదీ తాము భావించిందే కరెక్టు అని అనుకోవటంలో సమాజంలోని హెచ్చుమందికి ఇబ్బందులు కలుగుతున్నాయి. తమ పేరుతో ఫాన్స్‌సంఘాలు శృతిమించుతున్న సమయాలలో ఈ సంఘాలలో ఉన్న చాలా మంది ప్రసిద్ధులైన నటులు వీరివల్ల ఏ ఇబ్బందులు కలిగినా ఆ సంఘాలను తప్పుపట్టడానికి వెనుకాడటంలేదు. అయినా సరే కొన్నిసార్లు రాజకీయ కార్యకర్తల మాదిరే వెనుకడుగు వేయకుండా తమ మాటే నెగ్గించుకొనే ప్రయత్నం ఈ సంఘాలు చేస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అదృష్టవశాత్తు ఇంతవరకూ ఏ ప్రాముఖ్యత కలిగిన విషయంలోనూ వారు నిర్ణయాత్మకంగా ఉండకపోవడంతో టీ కప్పులో తుపాను మాదిరి ఆ సంఘటనలు చల్లారిపోతున్నాయి. సాధ్యమైనంతవరకూ అభిమాన సంఘాలు ఒక సమస్యను హైటైల్ చేయడం వరకే చేస్తున్నారు. అంతకుమించి ఇబ్బందికరంగా వ్యవహరించకపోవటం గమనార్హం. సమస్యల్లా ఆకతాయిలు విచ్చలవిడిగా తిరిగేవారు, గుంపులు గుంపులుగా నిర్వాహకుల సహకారంతో సభలకు పెద్ద ఎత్తున రావటం మాబ్‌గా రూపాంతరం చెంది ఈ పోలీసుల



మాటకానీ, నిర్వాహకుల మాటకానీ లెక్క చేయకుండా ప్రాణాంతకమైన పరిస్థితులు కల్పించడం ఈ మధ్య ఎక్కువయింది. పైగా కార్యనిర్వాహకులకు పూర్తిగా వారెవరో తెలియదు. పోలీసులు కండిషన్లను లెక్కచేయటం లేదని నిర్వాహకులకు చెబుతున్నప్పుడు వారిని కూడా లెక్కచేయకుండా మాబ్ మెంటాలిటీతో తొక్కిసలాట లాంటి సంఘటనలకు కారణమవుతున్నారు. గుంపులో గోవిందలా వారి పనిఉంది. ఎంత మంది పోలీసులున్నా, బలప్రయోగం చేసినా, పరిస్థితులు అదుపు తప్పటం ఇలాంటి అన్ని సంఘటనల్లోనూ సంభవిస్తున్నాయి. కరూర్ సంఘటన సందర్భంగా నమోదు చేసిన ఎఫ్.ఐ.ఆర్‌లోని విషయాలు ఎంతవరకూ వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయో తెలియదు కానీ, ప్రాథమికంగా అనే సాక్షాలుగా కోర్టులలో నిలబడితే, ఇలాంటి ఘటనల్లో అనవసరంగా కోల్పోయిన నిండు ప్రాణాలను, పసి ప్రాణాలను, తల్లుల, తండ్రుల గుండె కోతలను కళ్లముందుంచుతాయి. పోలీసులు ఎలాంటి నిబంధనలు పెట్టి ఈ బహిరంగ సభకు అనుమతి ఇచ్చారో అప్రమత్తం! ఎందుకంటే అలాంటి నిబంధనలు కేవలం కాగితాలకే పరిమిమవుతున్నాయి. శాంతి భద్రతల సమస్యలు ఏర్పడినప్పుడు నిర్వాహకులు, నాయకులూ తమవంతు పాత్రను పోషించకుండా, సమూహాలను నియంత్రించకుండా భారమంతా దేవుడికి వదిలేసి పలాయనం చిత్తశిస్తున్నారు. భారతదేశంలో స్వతంత్ర్యం రాక మునుపు, పరాయి పాలనలో మృగ్గుతున్నప్పుడు జాతిపిత గాంధీ మహాత్ముడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరాకరణోద్యమంలోనైనా, సత్యాగ్రహంలోనైనా సభలూ, సమావేశాలు చేసినప్పుడు ప్రజలు అదుపు తప్పితే ఆ సభలనూ, సమావేశాలనూ ఊరేగింపులనూ వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి మధ్యలోనే నియంత్రించడానికి, ఆపు చేయడానికి వెనుకాడకపోయేవారు. నిజానికి పరాయి పాలనలో అధికారాలను ధిక్కరించడానికి సహాయ నిరాకరణోద్యమానికి నడుం కట్టినప్పుడు అంతగా నైతిక విలువలను పాటించాల్సిన అవసరం లేదని ఒక్క క్షణమైన ఆలోచించకపోయే నాయకుడు అవటంచేతనే గాంధీ మహాత్మాగా, జాతిపితగా చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. నాయకుడు ముందుండి నడిపించినప్పుడే నాయకులు అని పిలిపించుకోటానికి అర్హత లభిస్తుంది. అప్పుడే సార్థకత నాయకత్వానికి సమకూరుతుంది. స్వతంత్ర భారతదేశంలో మన ప్రజలను మనం పాలించుకుంటున్న రోజుల్లో గతకాలంలోని నాయకులు పాటించిన విలువలను ఇప్పుడు జ్ఞాపకం చేయాలనిపిస్తున్నది. కానీ ఇప్పుడు అవి ఎంతవరకు ఈ కాలపు రాజకీయ ప్రతినిధులూ, నాయకులూ ప్రజలూ పరిగణనలోకి తీసుకోగలరు అని ఆలోచించటానికి కూడా మనస్కరించటం లేదు. కాలం మారిపోయింది. విలువలు అడుగంటాయి. లక్ష్యం సాధించడానికి మార్గం మహత్తరంగా నిర్ణయించుకోవాలన్న నిబంధనలు అటకెక్కాయి. నేనూ, నా అధికారం, నా స్వార్థం నిలువెల్లా ఆక్రమించుకున్నప్పుడు అహం ఏ చిన్న మంచి ఆలోచననైనా మధ్యలోనే త్రుంచేస్తుంది. నా బాధ్యతఅంటూ ఏదీ లేదు. పక్కవాడిదే బాధ్యత, తప్పు నాది కాదు. ఈ సమాజానిదే అన్న ధోరణిలో తప్పించుకొని పోవటానికి అలవాటుపడ్డ వారికి ఎవరేమి చెప్పగలరు. చట్టాలు నిబంధనలూ పరిస్థితులకు అనుగుణంగా మార్చినా ఎవరు పట్టించుకొనే స్థితిలోఉన్నారు? పాతకాలపు సెక్షన్లు 30,144 సి.ఆర్.పి.సి కాగితాలలో, ప్రాథమిక రిపోర్టులలో, దర్యాప్తులలో వినవచ్చేవే. అంతకంటే వాటికి విలువనివ్వటం అనవసరం. ఎప్పుడో నిజానికి అవి అటకెక్కాయి. ఇలాంటి ఎన్నో దుర్ఘటనలు, ఊరేగింపులలో దేవాలయాలల్లో, పుష్కరాలలో బహిరంగ సభలలో, జనసమూహాలు ఎక్కడున్నా, తొక్కిసలాటలూ జరగటం సర్వసాధారణమయింది. ఇలాంటివాటిని అరికట్టి ప్రజల ప్రాణాలూ, గౌరవ జీవితాలనూ కాపాడటానికి మార్గాలు లేవా? ఎందుకు లేవు? క్రమశిక్షణ, స్వీయ నియంత్రణ, మొదట పాలకులు నేర్చుకోవాలి. అలనాడు జరిగిన రైల్వే ప్రమాదానికి కేంద్ర మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి తప్పుకున్నారు. అటు తర్వాత ఎందరో నాయకులు ప్రత్యక్ష బాధ్యత లేకపోయినా బాధ్యత నెత్తిమీద వేసుకొని మార్గదర్శకులుగా ఉన్నారు. ఇప్పుడు అలాంటి దార్శనికత దుర్లభం అయింది. ప్రజల్లోంచి ప్రజాప్రతినిధులోంచి పాలకుల్లోంచి అలాంటి మార్గదర్శకులు వచ్చినప్పుడే మానవ తప్పిదాలను అరికట్టడానికి ఈ ప్రజాస్వామ్యంలో రహదారి ఏర్పడుతుంది. అది సాధ్యమా? సాంకేతిక పరిజ్ఞానాన్నిఅంది పుచ్చుకున్న ఈ కాలంలో ఆన్‌లైన్‌లో ఇలాంటి సమావేశాలు జరుపుకొని తమ సందేశాలను అదించి స్వీయ నియంత్రణతో సక్రమంగా బాధ్యత నిర్వహించుకోవచ్చు కదా! ప్రజలు అప్పుడు క్రమశిక్షణకు కట్టుబడే అవకాశం ఉంటుందికదా! ●

# అన్ని దానాలలో రక్త దానమే మిన్న

కామిడి సతీష్ రెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం. అత్యవసర సమయాలలో శస్త్రచికిత్స సమయంలో రక్తం అవసరం ఉంటుంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందక చనిపోయిన వారు అధిక సంఖ్యలో ఉంటున్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 1వ తేదీన జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా జరుపుకుంటారు. 1975 సంవత్సరంలో స్వరూప కృష్ణన్, డా.జె.జి.జొలిల చొరవతో ఈ రక్తదాన దినోత్సవం ప్రారంభం అయినది. రక్తదానం చేయాలని ప్రోత్సహిస్తూ రక్తదానం ఆవశ్యకతను తెలియపరచడం రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యతగా చెప్పవచ్చు. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో రక్తదానంపై ప్రజలకు యువతకు అవగాహన లేదు. రక్తదానం చేస్తే నీరసించి పోతామని, బలహీనపడి పోతామని అపోహ ప్రజల్లో బలంగా ఉంది. వివిధ స్వచ్ఛందసంస్థలు, రెడ్‌క్రాస్ లాంటివి గ్రామాల్లో, పట్టణాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తున్నారు. ముఖ్యంగా యువత మాత్రం రక్తదానం అంటేనే రెండు అడుగులు వెనక్కి వేస్తున్నారు. ఒకవేళ స్వచ్ఛందంగా రక్తదానం చేసే వారికి ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల నుండి ప్రోత్సాహం లేకపోవడంచే రక్తదానం చేయడానికి అనేకమంది వెనుకంజ వేస్తున్నసంఘటనలు కోకొల్లలు. ప్రతి ఆరోగ్యవంతుడిలో సుమారు 5నుండి 6 లీటర్ల రక్తం ఉంటుంది. 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల లోపు ఉన్న ఎవరైనా రక్తదానం చేయడానికి అర్హులు. ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఓమారు అనగా సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానంచేయవచ్చు. 45 కిలోల బరువు పైన ఉన్న వారు మాత్రమే రక్తదానం చేయడానికి అవకాశం ఉంటుంది. సాధారణంగా ఒక వ్యక్తి నుండి రక్తదాత 350 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్తదానం చేసేవ్యక్తిని వైద్యుల సంరక్షణలో కొన్ని వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. హైపటైటిస్ బి, హెచ్‌ఐవి, రక్తహీనత, బలహీనత, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులతో, బాధపడేవారు రక్తదానం చేయడానికి అనర్హులు. ఒకవేళ తెలియక చేసి రక్తం ఉపయోగపడదు. రక్తదానం చేసిన వారికి పూర్తిస్థాయిలో రక్తం 21రోజుల్లో తిరిగి ఉత్పత్తి అవుతుంది. రక్తంలో మొత్తం ఎనిమిది గ్రూపులు ఉన్నాయి 4 నెగటివ్ గ్రూపులు నాలుగు పాజిటివ్ గ్రూపులు రక్తదానం చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీవోనెంబర్ 184ద్వారా ఆ రోజు స్పెషల్ క్యాజువల్ మంజూరు చేయబడుతుంది. ప్రపంచంలో అధిక మొత్తంలో ఓ పాజిటివ్ వారే అధికంగా ఉన్నారు. ఒక యూనిట్ సుమారు 500 మిల్లీ లీటర్లు రక్తంలో మూడు నిండు ప్రాణాలు కాపాడవచ్చు. రక్తదానం చేసేవారు మిగతా వారికన్నా చాలా చురుకుగా ఆరోగ్యంగా ఉంటారు. రక్త గ్రూపులు దేశవ్యాప్తంగా వాని శాతం ఓ పాజిటివ్ 46, ఏ పాజిటివ్ 37శాతం, బి నెగిటివ్ 8శాతం, యే నెగిటివ్ 4 శాతం, నెగిటివ్ 2, ఏబి నెగిటివ్ ఒక శాతం. ఒక శాతం ఏ బి పాజిటివ్. ఒక శాతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో రెడ్ క్రాస్ అనే అంతర్జాతీయ సంస్థ, ఆయా జిల్లాల ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న రక్తనిధి కేంద్రాలు అధిక సంఖ్యలో రక్తాన్ని సేకరిస్తున్నాయి. ప్రతిఏటా వందలాది రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ వేల యూనిట్ల రక్తం సేకరిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాలలో రక్తదాన కేంద్రాలు ఉన్నాయి. అనేక మంది తమ జన్మదినాలు, పెళ్లి రోజును పురస్కరించుకొని కూడా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమ మిత్రులు, బంధువులు, సన్నిహితుల ద్వారా రక్తాన్ని సేకరిస్తున్నారు. బ్లడ్ బ్యాంకులకు అందజేస్తూ తమ దాతృత్వంతో, ఉదారతను చాటుతున్నారు. ప్రైవేటు బ్లడ్ బ్యాంకులలో కల్తీ రక్తాన్ని విక్రయిస్తున్నట్లు కూడా వార్తలు వినవస్తున్నాయి. రెడ్‌క్రాస్, ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలలోనామ మాత్రపు డబ్బులతో రక్తాన్ని విక్రయిస్తున్నారు. సమాజంలో ఇప్పటివరకు రక్తదానం చేయని వారు అధిక సంఖ్యలో ఉన్నారు. రక్తదానం చేయడం అంటే ఓ మనిషిని బ్రతికించేది. రక్తం ఎవరికో ఒకరికి ఉపయోగపడుతుంది. రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన కొరవడింది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కరపత్రాలు, గోడ పత్రికలు, సదస్సుల ద్వారా గ్రామ ప్రజలు యువతలో, మహిళా సంఘాలద్వారా విస్తృత ప్రచారం చేయాలి. రక్తదానం మించిన దానం లేదు అనే నినాదాన్ని విశ్వవ్యాప్తం చేయాలి. ●

# సంక్షేమ వసతి గృహాల సమస్యలు పట్టవా?

బి. వీరభద్రం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో 7,65,705 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే 10 నెలల క్రితం డైట్ చార్జీలు పెంచేందుకు అప్పటి బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి, ప్రస్తుత టీజీపీఎస్సీ చైర్మన్ ఆధ్వర్యంలో వేసిన ఉన్నతాధికారుల కమిటీ ప్రతిపాదనల మేరకు డైట్ చార్జీలు 40 శాతం పెంచింది. ఉన్నతాధికారుల కమిటీ జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) సూచనలను పరిగణలోకి తీసుకొని, చివరిసారిగా 2017లో మెస్‌చార్జీలు పెంచినప్పుడు నిత్యావసరాల ధరలు, ప్రస్తుతం రెండు రెట్లు పెరిగిన ధరలను బేరీజు వేసుకొని, సుమారు 22రకాల నిత్యావసరాల ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుదల అధ్యయనం చేసి, పలు సూచనలతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు పెంచాలని, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు 200శాతం కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని ఉన్నతాధికారుల కమిటీ ప్రభుత్వం ఎదుట పలు ప్రతిపాదనలతో కూడిన రిపోర్ట్‌ను ఉంచింది. ఉన్నతాధికారుల కమిటీ మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని సూచన చేస్తూనే, ప్రతి నెల వసతిగృహాలకు గ్రీన్ ఛానల్ ద్వారా డైట్ బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారుల కమిటీ కోరింది. రాష్ట్ర ప్రభుత్వం ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ ఘటనలు, కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లో విద్యార్థిని మరణించడం కారణంగా ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను దారి మళ్ళించడం కోసం, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుండి మెస్ చార్జీలు పెంచాలని వస్తున్న ఒత్తిడిల తట్టుకోలేక రాష్ట్రవ్యాప్తంగానున్న సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి భాజా భజంత్రీలతో అమలుకు సాధ్యంకాని, ప్రభుత్వమే తయారు చేసిన కామన్ మెనూతో హంగూ, ఆర్భాటంగా నూతన డైట్ అమలు ప్రారంభమనీ, ఇక విద్యార్థులకుఆకలి బాధలు ఉండవనీ, ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కావనీ, వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకూ తగు చర్యలు తీసుకొని 200శాతం కాస్మొటిక్ ఛార్జీలు పెంచినట్లు ప్రజాప్రతినిధులు అసాధ్యమైన హామీలిచ్చి సన్నాయి నొక్కులు నొక్కారు. 10నెలలైనా చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. పెరుగుతున్న వడ్డీల భారం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారుల కమిటీ చేసిన ప్రతిపాదనలలో కేవలం మెనూ చార్జీలు పెంచడం మాత్రమే కాదు, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా



డైట్‌చార్జీలు సంక్షేమ వసతి గృహాలకు చెల్లించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రతీనెల డైట్ చార్జీలు చెల్లించకుండా, విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలతో డైట్ అందించడం సాధ్యపడదు. గతం కంటే నేడు పెరిగిన చార్జీలతో విద్యార్థులకు డైట్ అందిస్తున్న కారణంగా సంక్షేమ వసతి గృహాధికారులకూ డైట్ చార్జీలు సకాలంలో చెల్లించకపోవడంతో అదనపు భారంగా మారింది. ఫైనాన్షియెర్స్‌ల దగ్గర వడ్డీలు, ఇఎమ్‌ఐ లతో పర్సనల్‌లోన్లు, తమ పుస్తెల తాడులమ్మి, తాకట్టు పెట్టి, విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాల్లో రెగ్యులర్ మెనూ ప్రకారం భోజనం అందించాల్సిన దుస్థితి ఏర్పడింది. అద్దె భవనాల కిరాయిలూ, కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో సుమారు 2300ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, 400కు పైగా గురుకులాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రైవేటు బిల్డింగ్ ఓనర్లకు కిరాయిలు చెల్లించకపోగా బిల్డింగులకు తాళాలు వేసినసందర్భాలు లేకపోలేదు. కనీసం కరెంట్ బిల్లులు చెల్లించకపోయినా డిస్కంలు నిరంతరాయంగా పవర్‌సప్లై చేస్తున్నాయి. సంక్షేమ వసతి గృహాలకు, గురుకులాలకు నిత్యవసర వస్తువులు కూరగాయలు, పాలు, కోడిగుడ్లు, చికెన్, అరటిపండ్లు అందించే టెండరుదారులు తమ బిల్లులు చెల్లించకపోవడంతో చేతులెత్తేశారు. కొన్నిచోట్ల 15రోజులకు సరిపడా ఒకేసారి కూరగాయలు వేస్తే మురిగిపోతున్న సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇటు టెండర్ దారులకు, బిల్డింగ్ ఓనర్లకుబిల్లులు చెల్లించకపోవడంతో సంక్షేమ వసతి గృహాల అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులపైన తీవ్ర ఒత్తిడులు తీసుకొస్తున్నారు. కేజీబీవీలలో చదువుకునే విద్యార్థులు ఇతర గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో పోలిస్తే తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారు. ఉపాధ్యాయుల కొరత, మౌళిక సదుపాయాలు, నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇతర విద్యార్థులతో పోల్చినప్పుడు తమకు కల్పిస్తున్న సదుపాయాలు చాలా పరిమితమైనవి. అక్కడ పనిచేసే ఉద్యోగులు తమని పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవిత భీమా, ఆరోగ్య భీమా తమకు వర్తింపజేయాలని, 20సంవత్సరాలుగా శ్రమదోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వం కేజీబీవీలు పట్ల వివక్ష వీడాలి. ప్రతిఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్యపెరుగుతున్న డ్రా పౌట్స్ తెలంగాణ రాష్ట్రంలో ప్రతియేటా సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థుల సంఖ్యతగ్గిపోతుంది. వసతిగృహాల వ్యవస్థ నిర్వీర్యం అవుతోంది. వసతి గృహాల్లో నాసిరకం భోజనం, అపరిశుభ్ర పరిసరాలు, వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు, అధికారుల నిర్లక్ష్యం, చాలీచాలని తిండి కారణంగా తల్లిదండ్రులు విసుగెత్తి విద్యార్థులను ఇండ్లకు తీసుకెళ్తున్నారు. దీనితో ఏటేటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి వసతి గృహాలపై దృష్టి సారించి తగు సదుపాయాలు కల్పించాలి. లేనిపక్షంలో సంక్షేమవసతి గృహాలు రానున్న రోజుల్లో ప్రభుత్వ విధానాలతో మూతపడే పరిస్థితి ఏర్పడుతుంది. ●

# గుంటూరు వార్త



## నూతన జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు రూ.8వేల కోట్ల ప్రయోజనం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు క్రైమ్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు రూ.8వేల కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో విలేఖరులతో ముచ్చటిస్తూ ...ఈ సంస్కరణలు రైతులు, మహిళలు, చిన్న వ్యాపార వర్గాలకు గేమ్‌చెంజర్ అవుతాయన్నారు. జిఎస్టీ 2.0వల్ల రాష్ట్రానికి రూ.8వేల కోట్ల అదనపు ఆదాయం లభించనుందని, పాఠ్యపుస్తకాలు, మందులు, ట్రాక్టర్లు వంటి అవసరమైన వస్తువులపై పన్ను తగ్గింపుతో ప్రజల ఖర్చులు తగ్గి కొనుగోలు శక్తి పెరుగుతుందని వివరించారు. చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు కూడా ఈ జిఎస్టీ సంస్కరణలు ఆశీర్వాదమని ఎమ్మెల్యే తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే కాకుండా విజన్ 2047లక్ష్యాలను చేరుకునే దిశగా ఒక పెద్ద అడుగు అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

## వేద పండితుల వేద స్వస్తి ఆశీర్వాదం

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ధార్మిక ప్రాంగణంలోని యాగశాల వేదికగా భారతీ ధార్మిక విజ్ఞాన్ పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి



సత్యనారాయణ, లలితాంబ దంపతుల నిర్వహణలో సుమారు 30సంత్సరాలుగా నిర్వహిస్తున్న వేద స్వస్తిలో 235మంది వేద పండితులతో అత్యంత భక్తిశ్రద్ధలతో వేద స్వస్తి నిర్వహించారు. అనంతరం వేదపండితులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులను ఆశీర్వదించారు. పండితులకు తాంబూలం చిరు కానుకలను అందించారు. కార్యక్రమంలో శ్రీహరి, సత్యనారాయణ, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## పేద బ్రాహ్మణ విద్యార్థినులకు రూ.45వేలు ఆర్థికసాయం : రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ

గుంటూరు విద్య, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో గాయత్రీ విద్యాపథకం కింద దుర్గాష్టమి రోజున ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం అందించారు. గుంటూరులో సీఎస్సీ బిటెక్ మొదటి సంవత్సరం కిట్స్ అక్షరలో చదువుతున్న కొండకావూరి దేదీప్య కు రూ.35000లు, సిమ్స్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న హర్షిణి కి రూ.10,000లు సమాఖ్య యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెక్ ద్వారా వారి తల్లి కొండకావూరి శైలజ కరూర్ వైశ్యాబ్యాంక్ పేరిట చెక్ పంపిణీ చేశారు. కోనూరు సతీష్‌శర్మ మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రతి ఏడాది గాయత్రీ విద్యానిధి పథకం ద్వారా నిరుపేదలకు ఆర్థిక సహకారం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పులిపాక ప్రసాద్, మునిపల్లె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.




## కృష్ణమ్మకు భారీ వరద: లంకవాసుల ఆందోళన

కొల్లిపర, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు మంగళవారం సాయంత్రానికి 6లక్షల53వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని లంక గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటల్లోకి నీరు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. వల్లభాపురం సమీపంలో ఉన్న స్లూయిజ్ వద్ద వరద నీరు చేరడంతో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణానదిలో నీటి మట్టం పెరుగు తుండ టంతో వల్లభా పురం, మున్నంగి, పిడపర్తి పాలెం, కొల్లిపర, కొత్తూరు లంక, అన్నవరపు లంక గ్రామాల పరిధిలో నదిఒడ్డున పల్లపు ప్రాంతాల్లో సాగు చేసిన పసుపు, కంద, అరటి, మినుము పంటల్లో వరద నీరు చేరటంతో పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని కృష్ణానది పరివాహాక ప్రాంతాల్లో బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరపు లంక గ్రామాల్లో రేవులను డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ, ఎస్సై కోటేశ్వరరావులు సందర్శించి వరద ఉధృతిని పరిశీలించి రైతులకు, గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ప్రజలతో వరద ఉధృతి పెరుగుతుందని అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పడవ నడిపే జాలర్లకు తగు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇదిలా ఉంటే వరదల మూలంగా గ్రామాల్లోకి పాములు, కొండచిలువలు రావడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి వింత ఆకారంలో ఉన్న పాములు రావడాన్ని గ్రామస్తులు గుర్తించారు. పాములకు రెండువైపులా తలకాయలు ఉండటంతో గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. పాములకు రెండువైపులా తలలు ఉండటం ఎప్పుడూ చూడలేదని గ్రామస్తులు తెలియజేశారు. వాటిని గోని సంచిలో బంధించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మండల స్థాయి అధికారులు వరద నీటి కారణంగా కొండచిలువలు, వివిధ రకాల పాములు గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉందని తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.











మంగళవారం రాత్రి ఢిల్లీలో కేంద్ర హోమ్ శాఖామంత్రి అమిత్ షాతో భేటీ అయిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంపీలు (గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి)

## ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా కల్పించిన సిఎం చంద్రబాబు

### - ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెం బర్ 30: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల ముందు చెప్పిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారిదని అన్నారు. 15 నెలల పాలనలోనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశాం. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలను విన్న మంత్రి నారా లోకేష్ నేడు చెప్పిన ప్రకారం ఆటో డ్రైవర్లకు అండగా నిలిచారు. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి లారీ డ్రైవర్లకు ఆర్థిక భరోసానిచ్చారు. నేడు ఆటో కార్మికులకు రూ.15 వేలు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ పథకం అమలుకు రూ.435 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించింది. అక్టోబర్ 4 న సుమారు 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేయబోతున్నాం. ఆటో డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకునేందుకే ఈ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో



కార్మికులను, కర్షకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జగన్ హయాంలో ఆటో డ్రైవర్లను వేధించుకుతిన్నారు. గ్రీన్ ట్యాక్స్ పేరుతో లారీ డ్రైవర్ల నుంచి వందల కోట్లు దోచుకున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డెక్కాలంటే భయపడే పరిస్థితులు జగన్ రెడ్డి పాలనలో చూశాం. పోలీసుల వేధింపులు, వైసీపీ నాయకుల బెదిరింపులతో ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బంది పడ్డారు. నేడు ఆటో డ్రైవర్లు సురక్షితంగా జీవనం సాగిస్తున్నారు. ఎక్కడా పోలీసుల వేధింపులు లేవు. ఆటో డ్రైవర్లపై అత్యధిక ట్యాక్సులు విధించి ఇబ్బందులు పెట్టే చర్యలు లేవు. రూ.1400 కోట్లు ఖర్చు చేసి రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు పడ్డ రహదారులను బాగు చేశాం. లారీ డ్రైవర్లకు అండగా ఉండేందుకు ఇప్పటికే గ్రీన్ ట్యాక్స్ ను తగ్గించాం. ఈ ట్యాక్స్ తగ్గింపుతో ఏటా లారీ డ్రైవర్లకు ఆర్థికంగా పెనుభారం తగ్గింది. ఉచిత బస్సు పథకం ద్వారా మహిళలకు అండగా నిలిచాం. ఆగస్టు 15న ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 8.85 కోట్ల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారు. సుమారు రూ.300 కోట్లకు పైగా మహిళలు ఈ ఉచిత బస్సు పథకం ద్వారా లబ్ధి పొందారు. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, లారీ డ్రైవర్లకు గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుతో కూటమి ప్రభుత్వం కార్మికుల ప్రభుత్వమని నిరూపితమైంది. కార్మికుల పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో తల్లికి వందనం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి అందజేశాం. నిరుద్యోగులకు అండగా నిలిచేలా 16,347 డీఎస్సీ పోస్టులను ఏడాదిలోనే మంత్రి నారా లోకేష్ భర్తీ చేశారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్ ను రూ.4 వేలు చేసి పేద ప్రజలను ఆదుకున్న ప్రభుత్వం మాది. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్లకు పండుగ రోజు. సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా రూ.435 కోట్లు అందజేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వంలో మాదిరి అరకొరగా కాకుండా ప్రతి ఒక్కరికి అందజేసే విధంగా ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రం కూడా రూ.15 వేలు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయంగా ఏ ప్రభుత్వం ఇవ్వడం లేదు. కేవలం సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలవాలనే రూ.15 వేలు ఇస్తున్నారు. రాష్ట్రంలో కార్మిక కర్షక ప్రభుత్వం కొనసాగుతుంది. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోరే సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... 4.5 లక్షల ఉద్యోగాలు కల్పించారు. అని అన్నారు.

## దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పాలకమండలి ఆధ్వర్యంలో శ్రీపద్మావతి కల్యాణమండపం వేదికగా అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ పాలకమండలి విశేషంగా భక్తులు అమ్మవారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను అందుకున్నారు. అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మీ









సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. విశేషంగా పాల్గొన్న సువాసినులచే కుంకుమార్చనలు, సాయంత్రం దంపతులచే అమ్మవారి సహస్రనామ పూజలు నిర్వహించారు. విశేష హారతి మంత్రపుష్పం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో వ్యవస్థాపకులు ఘంటసాల విజయస్వామి ఆధ్వర్యంలో దుర్గాదేవిగా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, ప్రత్యేకంగా అలంకరణ చేశారు. లోకకళ్యాణార్థం ప్రతిరోజు శక్తి హోమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. వికాసనగర్ 11వ లైనులోని శ్రీషిర్డిసాయి మందిర్‌లో పాలకమండలి అధ్యక్షులు పూర్ణచంద్రరావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు దుర్గామాతగా దర్శనమిచ్చారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సువాసినులచే కుంకుమార్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు వితరణ చేస్తున్నారు. మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గామాతగా అలంకరించి విశేషపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. బ్రాడీపేట 2/14లోని శంకరమందిరంలో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు శ్రీదుర్గామాతగా దర్శనమిచ్చారు. విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం కుంకుమార్చనలు జరిగాయి.

## అక్టోబర్ 7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయండి

గుంటూరు విద్య, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు నక్కా వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయటానికి సన్నాహక సమావేశం జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.నరసింహారావు అధ్యక్షతన ఏపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశంలో యుటిఎఫ్ ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, ఫ్యాప్టో జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండి ఖలీద్, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్.కళాధర్, జి.వెళాంగిణి రాజు, ఫ్యాప్టో జిల్లా నాయకులు దిబ్బయ్య, ఎమ్.కోటిరెడ్డి, షేక్ బాజీ, బి.బాలాజి, ఎం.వి.ప్రసాద్, జె.విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.





## వచ్చే ఏడాది రూ.2,300 కోట్ల టర్నోవర్ లక్ష్యం





**-45వేల నుంచి 10లక్షల లీటర్లకు పైగా పాలసేకరణ**
**-సంగం డెయిరీని దేశం మొత్తం వ్యాప్తి చేస్తాం**
**-సంగం డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర**

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: తాను సంగం డెయిరీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాడు 45వేల లీటర్ల పాల సేకరణ జరిగేదని ప్రస్తుతం రోజుకు 10లక్షల లీటర్లపైగా పాల సేకరణ జరుగుతున్నట్లు సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీ 12వ వార్షికోత్సవ సభలో నరేంద్రకుమార్ మాట్లాడారు. సంగం డెయిరీ ఈ ఏడాది రూ.2018.67కోట్ల రెవెన్యూ పొందిందన్నారు. వచ్చే ఏడాది రూ.2,300కోట్ల టర్నోవర్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఈ ఏడాది రూ.12.79కోట్లు నిఖరలాభము ఆర్జించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి అంతా పాల ఉత్పత్తిదారులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, వినియోగదారుల కృషి వల్లేనన్నారు. కంపెనీ విస్తరణలో భాగంగా కొత్త డెయిరీలు, పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటును ప్రారంభించామన్నారు. నాయుడుపేటలోని సెజ్‌లో 2ఎల్ఎల్‌పిడి నుండి 4ఎల్ఎల్‌పిడి వరకు పెంపుదల చేసే సామర్థ్యంతో ఒక ఒత్త డెయిరీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి పనులు ఇప్పటికే ప్రారంభించామన్నారు. హైదరాబాద్ మెట్రో, పరిసర పట్టణాల డిమాండ్‌ను తీర్చేందుకు మిర్యాలగూడలోని డెయిరీ ప్లాంటులో ప్రస్తుతం సామర్థ్యమునకు అదనముగా రోజుకు 1.50లక్షల లీటర్ల ప్రాసెస్ చేసేందుకు నిర్ణయించామన్నారు. మొత్తం సామర్థ్యమును రోజుకు మూడు లక్షల లీటర్లకు విస్తరిస్తున్నామన్నారు. వడ్లమూడిలోని ప్రధాన డెయిరీలో, అత్యాధునిక ప్యాకింగ్ టెక్నాలజీతో పనీర్ విభాగాన్ని రోజుకు ఐదు మెట్రిక్ టన్నులకి విస్తరిస్తున్నామన్నారు. ప్యాకింగ్ చేయబడిన పాలు, పాల పదార్థములు, ప్యాకింగ్ సామాగ్రికి గిడ్డంగి సౌకర్యాన్ని 4200చ.మీటర్లకు విస్తరించుటకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రైతుల చెల్లింపులను నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయడమే ప్రధాన లక్ష్యముగా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ విధానం భవిష్యత్తులో పాడి రైతులకు మరిన్ని సదుపాయాలు పొందేందుకు ఉపయోగపడుతుందన్నారు. పాల దిగుబడి అధికంగా ఉండే ప్రాంతాలలో ఎంసిసిలను స్థాపించడంతోపాటు, ప్రస్తుత సేకరించుచున్న ప్రాంతాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు అదనపు శీతలీకరణ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కంపెనీ ఇప్పటికే పశువుల సంతానోత్పత్తి కార్యక్రమాలలో భాగముగా సెక్స్ సార్టెడ్ వీర్యం(ఎస్ఎస్ఎస్)ను వినియోగించడాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇది మన పశువుల జన్యు సామర్థ్యాన్ని పెంచడానికి చాలా ముఖ్యమైన చర్యగా మారుతుందన్నారు. రాబోయే సంవత్సరంలో 10వేల సెక్స్ సార్టెడ్ వీర్యం గర్భధారణలను లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ఈ ప్రయోజనం కోసం మూడు బ్యాచ్‌ల ద్వారా 59 ఎ1 కార్మికులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం పశువుల దాణా తయారీ 100మెట్రిక్ టన్నుల నుంచి 200మెట్రిక్ టన్నుల వరకు జరుగుతుందన్నారు. పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు వల్ల మన ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. గ్రీన్ ఎనర్జీకి మారడం, వాతావరణ చొరవలకు మద్దతు ఇవ్వడం మా లక్ష్యం కాబట్టి రాబోయే సంవత్సరాల్లో గ్రీన్ ఎనర్జీలో భాగంగా సోలార్ ఎనర్జీ ద్వారా విద్యుత్‌ను సమకూర్చుకోబోతున్నట్లు చెప్పారు. విత్తన ప్రాజెక్టుకు సంబంధించి, ఇప్పటి వరకు పరిశోధనలు చేస్తున్న వరి, మినుము, పెసర, టమోటా, బెండ, చిక్కుడు పైర్లతో విడుదలైన 10రకాలతోపాటు కొత్త వంగడాలు రూపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. డెయిరీ ఆవరణలో అత్యాధునిక వసతులతో ఇన్నోవేషన్ సెంటర్ రూ.2.50కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన టెండర్లలో పాల్గొనగా మొట్టమొదటి సారి ఐదు లక్షల కిలోల ఆవు నెయ్యిని దేవస్థానమునకు సరఫరా చేసే నిమిత్తం దేవస్థానం టెక్నికల్ టీమ్ మన డెయిరీని సందర్శించి సంతృప్తి చెందినట్లు చెప్పారు. టెండర్ మనకు దక్కడానికి డెయిరీ అధికారులు, ఉద్యోగులు ఐదేళ్ళ శ్రమ దాగి ఉందన్నారు. 25సెప్టెంబరులో తొలి విడత నెయ్యిని శ్రీవారి పాదాల చెంతకు పంపేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించి నెయ్యి వాహనాన్ని ప్రారంభించామన్నారు. నెయ్యి నాణ్యత తనిఖీ, సరఫరాకు అవసరమైన యంత్రాలు 2023లోనే సమకూర్చుకున్నామన్నారు. సంగం డెయిరీపై ఎలాంటి తనిఖీలు నిర్వహించాలన్నా తామే ఆహ్వానించి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ ఎండి గోపాలకృష్ణన్, సీఓఓ పర్వతనేని అనిల్‌కుమార్, సీఎఫ్ఓ పెద్ది సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.


పంజాబ్ నేషనల్ బ్యాంక్
punjab national bank
(భారత ప్రభుత్వరంగ సంస్థ)

అస్సెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్
డి.నెం.9-13-45/2/91, 5వ అంతస్తు, ఎమ్‌విఆర్ వినాయగర్ సెంటర్, వివిపి రోడ్డు, విశాఖపట్నం-530003.
ఇ-మెయిల్ : CS8333@pnb.co.in

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **పంజాబ్ నేషనల్ బ్యాంక్, అస్సెట్ రికవరీ మానిటరింగ్ బ్రాంచ్, విశాఖపట్నం / స్టేషన్ రోడ్డు గుంటూరు బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని **ఋణగ్రహీత : శ్రీమతి గద్దం రాధిక, (భర్త: జి బాలాజీ రావు)** #188, NH 5 రోడ్డు దగ్గర, గణపవరం, నాదెండ్ల మండలం, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-522619, మరియు **మరియొక చిరునామా: శ్రీమతి గద్దం రాధిక, (భర్త: జి బాలాజీరావు)** డి.నెం. 3-45, మరబావి సెంటర్, గణపవరం, నాదెండ్ల మండలం, గుంటూరు, ఏపి-522619. మరియు **హామీదారులు: 1. శ్రీ జంపాల సత్యనారాయణ, (తండ్రి: వెంకట సుబ్బయ్య)** 9-388 చిన్నకోట వీధి, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616. **2. శ్రీ. జంపాల వెంకటేశ్వర రావు, (తండ్రి: జంపాల సత్యనారాయణ)** ఫ్లాట్ నెం. 4, కమలేష్ ఎస్టేట్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఎదురుగా, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522006 & **3. శ్రీ గద్దం బాలాజీ రావు, (తండ్రి: నాగేశ్వరరావు)** డోర్ నెం.42-1-53, కమ్మపాలెం, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523001, **(అకౌంట్ శ్రీమతి గద్దం రాధిక - 019500SA00000014)** క్రింద **మొత్తం తేది.31.03.2025 నాటికి రూ.63,07,860.57 (అక్షరాల అరవై మూడు లక్షల ఏడు వేల ఎనిమిది వందల అరవై రూపాయల యాభై ఏడు పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి మొత్తం బకాయి ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ **తేది.10.04.2025న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **25.09.2025 వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారు మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

సబ్ సెక్షన్ (8), సెక్షన్ 13 చట్ట ప్రకారము ఋణగ్రహీత లు/హామీదారులు/తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి/ఆస్తుల విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **పంజాబ్ నేషనల్ బ్యాంక్** వారికి చెల్లించవలసిన బకాయి **తేది.31.03.2025 నాటికి రూ.63,07,860.57 (అక్షరాల అరవై మూడు లక్షల ఏడు వేల ఎనిమిది వందల అరవై రూపాయల యాభై ఏడు పైసలు మాత్రమే)** + **తేది.01.04.2025** నుండి తదుపరి వడ్డీ మరియు ఛార్జీలతో కలుపుకొని మొత్తమునకు లోబడివుంటాయి.

**తనఖాపెట్టిన ఆస్తి వివరములు:**

**ఆస్తి నెం. 1: శ్రీమతి గద్దం రాధిక, (భర్త: గద్దం బాలాజీరావు) పేరుతో ఉన్న రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 4626 /2007 తేది: 23.08.2007, రిజిస్టర్డ్ ఎమ్ఒడి నెం. 1185/2014 తేది: 12.03.2014 ప్రకారం :** నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరి పేట సబ్-జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామం, డి.నెం.188, మొత్తం ఎ. 7.56 సెంట్లులో ఎ. 1.70 సెంట్లులో ఉమ్మడి ఎ. 0.96 సెంట్లుకు హద్దులు: తూర్పు: పోతూరి కోటేశ్వరరావు భూమి 195 లింకులు; దక్షిణం: ఉమ్మడి దారి 143 లింకులు; మరలా తూర్పు: ఉమ్మడి దారి 75 లింకులు; మరలా దక్షిణం: పెంటల సాంబశివావు భూమి 590 లింకులు; పడమర: పెంటల సాంబశివావు భూమి 243 లింకులు; మరలా దక్షిణం: పెంటల సాంబశివావు భూమి 92 లింకులు; మరలా పడమరం : పెంటల సాంబశివావు భూమి 56 లింకులు; ఉత్తరం: గొరంట్ల కోటేశ్వరరావు భూమి 751 లింకులు.

******ఆస్తి నెం. 2: శ్రీ. జంపాల వెంకటేశ్వర రావు, (తండ్రి: జంపాల సత్యనారాయణ) పేరుతో ఉన్న రిజిస్టర్డ్ పార్టీషియన్ డీడ్ నెం. 198 /2012 తేది: 11.01.2012, రిజిస్టర్డ్ ఎమ్ఒడి నెం. 1185/2014 తేది: 12.03.2014 ప్రకారం :** నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరి పేట సబ్-జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామ పంచాయతీ ఏరియా, డి.నెం. 1341/1 నందు విస్తీర్ణం ఎ. 1.28 సెంట్లు భూమికి హద్దులు:- తూర్పు: కెల్లంపల్లి నాగేశ్వరరావు భూమి; దక్షిణం: సాగర్ కాలువ; పడమర: పుట్ల భూలక్ష్మి భూమి; ఉత్తరం: కాత సూర్యనారాయణ భూమి.

ఈ హద్దుల యందు విస్తీర్ణం ఎ. 1.28 సెంట్లు లేదా 0.517 హెక్టార్లు భూమి.

****** ఆస్తి నంబర్ 2 లో పేర్కొన్న ఆస్తులు వ్యవసాయ భూమి కాబట్టి, సర్ఫేసి చట్టం, 2002 లోని సెక్షన్ 31 ప్రకారం సర్ఫేసి చట్టం వర్తించదు.**

తేది : 25.09.2025
ప్రదేశం : గణపవరం

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఆలపాటి

తెనాలి టౌన్ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులలో చికిత్స పొందిన ఆరుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శాసనమండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందించారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి మంజూరైన మొత్తం రు.5,35,959 ఆర్థిక సాయాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సీఎం సహాయనిది పేద వర్గాల ప్రజలకు ఎంతో అండగా ఉంటుందని, వారి ఆరోగ్యానికి జీవితానికి, భరోసా కల్పిస్తుంది అన్నారు. వైద్యం చేయించుకోలేక, అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధపడకూడదు అనేది కూటమి ప్రభుత్వా లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దుస్, రాష్ట్ర పద్మశాలీయ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తెదేపా పట్టణ కార్యదర్శి వసంతం అశోక్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ డి. కోటేశ్వరరావు, ఎస్. సుభాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గామాత అలంకారంలో అమ్మవారి దర్శనం

తెనాలి టౌన్ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, తొమ్మిదో రోజు మంగళవారం, అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని పలు ఆలయాల్లోని అమ్మవారికి విశేషంగా అలంకరణ చేశారు. దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వగా, ఉదయం నుండి విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుండి భక్తులు ఆలయాలకు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకుని, కానుకలు సమర్పించారు. పట్టణంలోని అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, శివాజీ చౌక్ ప్రాంతంలోని శ్రీ కాళికామాత దేవస్థానం, అలాగే దేవిచౌక్ ప్రాంతంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి దేవస్థానం, ఇంకా పలు దేవాలయాల్లోని అమ్మవారి ఆలయాల్లో, అమ్మవారి దివ్యశోభ, భక్తుల కోలాహలం, ఆలయ ఏర్పాట్లు దసరా ఉత్సవాల వైభవాన్ని చాటి చెబుతున్నాయి. ఈ ఆధ్యాత్మిక వాతావరణం భక్తుల రద్దీని, ఏర్పాట్ల తీరును, ప్రతిబింబిస్తూ తయారుచేసిన ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



## బాలకృష్ణ అహంకారపు మాటలు: మాజీ ఎమ్మెల్యే 'అన్నాబత్తుని'

తెనాలి టౌన్ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో, సిని పరిశ్రమ విషయంలో, ఎమ్మెల్యే సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ఆయన అహంకారానికి నిదర్శనమని, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సినిమా పరిశ్రమకు మంచి చేయాలని చూశారని, ఆయనను కలిసిన సినీనటుల్లో చిరంజీవి కూడా ఎంతో హుందాగా వ్యవహరించారని, కాలానికి మెమరీ పవర్ ఎక్కువ అని అన్నిటికీ సమాధానం చెబుతుందని, మొన్న శాసనసభలో జరిగిన చర్చ ఆనాడు జగన్ చేసిన మంచిని వాస్తవాలను వెలుగులోకి తెచ్చిందన్నారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలు చర్చించకుండా, వైయస్ జగన్ ని విమర్శించడానికి కూటమి ప్రభుత్వం ఎక్కువ సమయం కేటాయించిందని, ఒక సీనియర్ శాసనసభ్యుడిగా బాలకృష్ణ హుందాగా వ్యవహరించ లేదని, జగన్ పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు



## సమాధుల కోసం స్థలం కేటాయించాలంటూ సంతకాల సేకరణ

తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): పట్టణంలోని ఐతానగర్లో, నూతన క్రైస్తవ సమాధుల తోటకు స్థలం కేటాయించాలని కోరుతూ, క్రైస్తవ సమాధుల తోట సాధన సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సుమారు 40 ఏళ్ళ క్రితం ఐతానగర్ ప్రాంతంలో రెండు వేల కుటుంబాలు కోసం, కేటాయించిన, రెండున్నర ఎకరాలు స్థలం పూర్తిగా నిండిపోయిందని, దీనివల్ల ఐతానగర్ ప్రాంతవాసులు మృతదేహాల అంత్యక్రియల కోసం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే నూతన స్థలాన్ని కేటాయించాలని వారు కోరుతున్నారు. పెరిగిన జనాభా కారణంగా, నాలుగుదశాబ్దాల క్రితం కేటాయించిన స్థలం నేడు సరిపోవట్లేదని, కావున మృతదేహాలు ఖాననానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రభుత్వం తమ సమస్యను గుర్తించాలన్నారు.




## దేవస్థానం దుకాణాలకు బహిరంగ వేలం

తెనాలి మున్సిపాలిటీ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): పట్టణంలోని షరాఫ్ బజార్ లో వేంచేసిన, శ్రీ సువర్చల సమేత పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నకు చెందిన దుకాణానికి, అక్టోబర్ 6వ తేదీన బహిరంగ వేలం వేయడం జరుగుతుందని, ఆలయ కార్య నిర్వహణాధికారి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. షరాఫ్ బజార్ లోని జైన్ టెంపుల్ దగ్గరలో ఉన్న, డోర్ నెంబర్ 738 లోని, 10వ నెంబర్ దుకాణానికి 3 సంవత్సరముల కాలపరిమితితో బహిరంగ వేలం వేయడం జరుగుతుందని, ఆసక్తి ఉన్నవారు, అక్టోబర్ 6వ తేదీన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించే, బహిరంగ వేలంపాటలో పాల్గొనవచ్చని, ఈఓ హరిప్రసాద్ తెలియజేశారు.

## ఇంటీరియర్ ప్రారంభం

తెనాలి టౌన్ సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త): తెలుగుదేశం పార్టీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు అత్తోట శరత్ బాబు ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన "రాయల్స్ బ్లాక్" ఇంటీరియర్‌ను ప్రారంభించిన శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నిర్వహించిన ప్రారంభోత్సవంలో పాల్గొన్న పలువురు నాయకులు, నూతన వ్యాపారం విజయవంతంగా ఉండాలని, అత్తోట శరత్ బాబు కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అత్తోట శరత్ బాబు జన్మదినం సందర్భంగా ఎంఎల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శరత్ బాబు చేత కేక్ కటింగ్ చేయించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు పిల్లి మాణిక్యారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్ కుమార్, తెదేపా నాయకులు సుద్దపల్లి నాగరాజు, పట్టణ తెదేపా అధ్యక్షులు ఎండి. ఖుద్దుస్, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని శరత్ బాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## సినిమా టిక్కెట్ల రేటు పెంపు
## ప్రేక్షకుల వ్యతిరేక చర్యగా పరిగణించాలి
### -డబ్బింగ్ సినిమాకు అనుమతులా? 'మా-ఎపి' దిలీప్‌రాజా

తెనాలి టౌన్, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : కన్నడ భాషలో చిత్రీకరించిన కాంతార సినిమా టికెట్ రేట్లు తెలుగు రాష్ట్రాల్లో పెంచడం ప్రేక్షకుల వ్యతిరేక చర్యగా రెండు ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని మా ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. స్థానిక మా ఏపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి సానుభూతి ఉంటె పన్ను రాయితి ఇవ్వాలిగాని టికెట్లు రేట్లు పెంచి ప్రేక్షకుల మెడలో గుదిబండను వేయటం సముచితం కాదని ఆయన తెలిపారు. టికెట్ ధరల పెంపు అంశాన్ని హైదరాబాద్ హైకోర్టు సీరియస్‌గ పరిగణించిన నేపథ్యంలో ప్రభుత్వాలు కూడా సహేతుక నిర్ణయం తీసుకోవలసిందిగా దిలీప్‌రాజా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు మనవి చేశారు. రాష్ట్రంలో తీసిన తెలుగు సినిమాలకు ఈ బంపర్ ఆపర్ వర్తించకపోవడం దురదృష్టకరమని చెప్పారు. సినిమా నచ్చితే ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడతారని, రేట్లు పెంచితే దోపిడీ అవుతుందని దిలీప్‌రాజా వ్యాఖ్యానించారు. కాంతార తెలుగు డబ్బింగ్ సినిమా బయ్యర్ల జేబులు నింపడం అవసరమా? వినోదాన్ని బ్రతికిస్తున్న తెలుగు ప్రేక్షకుడిపై? వినోదాన్ని బ్రతికిస్తున్న తెలుగు ప్రేక్షకుడిపై అధికభారం తొలగించడం అవసరమా? ప్రభుత్వమే విజ్ఞతతో నిర్ణయం తీసుకోవలసిందిగా ఆయన కోరారు. ఆంధ్రాలో సినిమాలు తీసే నిర్మాణ సంస్థలకు ప్రభుత్వం అందిస్తున్న ఫలాలు రాష్ట్ర విభజన అనంతరం ఒక్క నిర్మాణ సంస్థకు దశాబ్ద కాలంగా ఎలాంటి రాయితీలు ఇవ్వకపోటం చూస్తుంటే ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నించడంతో మినహా చేయగలిగింది ఏమీ లేదని ఆయన నిస్సహాయత వ్యక్తం చేశారు.



# బాపట్ల జిల్లా వార్త



## జిల్లాలో రూ.97.73 కోట్ల పెన్షన్లు: కలెక్టర్



బాపట్ల, సెప్టెంబర్30, ప్రభాతవార్త: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంద శాతం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద మొత్తం 2,27,105 మందికి వివిధ రకాల పెన్షన్లకు రూ. 97.73 కోట్ల పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. 2025 అక్టోబర్ 1 బుధవారం ఉదయం నుండి పెన్షన్ చెల్లింపు జరుగుతుందన్నారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందరాదని, అధికారులు మీ ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు అందజేయడం జరుగుతుందన్నారు. బుదవారం పెన్షన్ తీసుకోలేని వారికి గురువారం తీసుకోవచ్చునన్నారు.

## 'వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి'

బాపట్ల, సెప్టెంబర్30, ప్రభాతవార్త: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యాధికారి విజయమ్మ తెలిపారు. స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం క్లిన్ అండ్ క్లీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి విజయమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, స్వచ్ఛందసేవా సంస్థ రోజ్ సంస్థ అద్యక్షులు ప్రసాద్, సఫోర్ట్‌సంస్థ సెక్రటరీ పఠాన్‌మహమ్మద్‌ఖాన్, తదితరులుపాల్గొన్నారు.




## కత్తి కిరణ్ కుటుంబానికి నాగార్జున పరామర్శ

కర్లపాలెం, సెప్టెంబర్30, ప్రభాతవార్త: కర్లపాలెం మండలం వైసీపీ నాయకులు బుద్దాం గ్రామానికి చెందిన కత్తి కిరణ్ తండ్రి కత్తి ఆదాము ఇటీవల మృతి చెందగా మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ మంత్రి బాపట్ల జిల్లా వైసీపీ అధ్యక్షుడు మేరుగా నాగార్జున పరామర్శించారు. బాపట్ల విచ్చేసిన ఆయన బుద్దాం వెళ్ళి కిరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ నాయకులు నాగేశ్వరరెడ్డి, అంబేద్కర్ సేవా సమాజం గౌరవాధ్యక్షుడు పరమానంద కుమార్, నాయకులు ,డేవిడ్, మండే విజయకుమార్ పేర్లి రాజేష్, నిరీక్షణరావు తదితరులు ఉన్నారు



## దుర్గాదేవిగా దర్శనం

బాపట్ల, సెప్టెంబర్30, ప్రభాతవార్త:శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో బాపట్ల కోన ప్రభాకర రావు కళాక్షేత్రం లో అత్యంత వైభవంగా జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల లో భాగంగా మంగళవారంర అమ్మవారు శ్రీ దుర్గా దేవి గా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు నెమలికంఠి హనుమంతరావు మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన, అమ్మ వారికి ప్రీతికరమైన బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులకు సరస్వతీ పూజ అనంతరం తీర్థ ప్రసాద వినియోగం జరిగాయన్నారు. సామూహిక దుర్గా సహస్రనామ, పూజా కార్యక్రమం , సాయింత్రం 6గంటలకు కుంకుమార్చన, 7గంటలకు తీర్ధ ప్రసాద వినియోగం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో రొంపిచర్ల మణికంఠ, ప్రశాంత్, వక్కలగడ్డ బాలాజీ, సొల్లేటి యశ్వంత్, కృష్ణసాయి మరియు భక్తులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలకు కేఎల్ఎస్ఆర్
## ఇన్ ఫ్రాటెక్ లక్ష నోట్ పుస్తకాలు,పెన్నులు విరాళం
### --నోట్ పుస్తకాల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి లోకేష్




తాడేపల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పథకానికి హైదరాబాద్ కు చెందిన కెఎల్ఎస్ఆర్ ఇన్ ఫ్రాటెక్ లిమిటెడ్ లక్ష నోట్ పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందించింది. సుమారు 40లక్షల విలులైన నోట్ పుస్తకాలు, పెన్నులను కెఎల్ఎస్ఆర్ సంస్థ విరాణంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేయనున్నారు. ఈమేరకు నోట్ పుస్తకాల పంపిణీని విద్య, ఐటి శాఖలమంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. పుస్తకాల ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్‌తోపాటు కెఎల్ఎన్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండి కెఎల్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ కె.ప్రీతమ్ రెడ్డి, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అష్టోత్తర, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. దుర్గాదేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకుంటే సర్వసుఖాలు, సుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం దీంతో భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## 132 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను సీజ్ చేసిన అధికారులు

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు మంగళవారం పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక సోదాలు నిర్వహించారు. అందులో భాగంగా 21వ వార్డు, ఎస్వీపీరోడ్డులోని ఓషాపులో నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొన్నారు. 132కిలోలను సీజ్ చేశారు. సంబంధిత యజమానికి రూ.5వేలు జరిమానా విధించారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషధం కొనసాగుతుందని, ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించినా, ఉపయోగించినా చట్టపరమైన చర్యలు తీసు కొంటామన్నారు. ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.




**2న మాంసం విక్రయాలు జరపొద్దు:**

ఈ నెల రెండవ తేదీన జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పురపాలక సంఘ పరిధిలో ఎలాంటి మాంసం విక్రయాలను జరపొద్దని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు హెచ్చరించారు. మాంసము, చేపలు, ఇతరత్రా మాంసాలను విక్రయించడం నిషేధించడమైనదన్నారు. మాసం విక్రయదారులు షాపులను మూసివేయాలన్నారు. ఎవరైనా విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

## వరద ముంపు ప్రభావిత గ్రామాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనంద్‌బాబు

కొల్లూరు, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని పలు లంక గ్రామాలు నదీ ప్రవాహాల కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలుస్తూ వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం స్వయంగా ముంపు ప్రభావిత గ్రామాలను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలుత కొల్లూరులోని ది ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మండల స్థాయి అధికారులతో వరదపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం లంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వరదల వల్ల ఇళ్ళను కోల్పోయిన కుటుంబాలను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడిన ఆయన తక్షణ సహాయ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు అందేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులను కలసి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన తక్షణమే పంట నష్టాలపై సర్వే నిర్వహించి, పరిహారం అందించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలని ఆదేశించారు. రైతులు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం మీ పక్షాన ఉందని, వరదల వల్ల కలిగిన ఇబ్బందులను తగ్గించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరికి సహాయం అందే వరకు నేను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తామన్నారు. ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ మరియు రవాణా వ్యవస్థలు త్వరగా పునరుద్దరించే చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. స్థానిక ప్రజలు ఈ క్లిష్ట సమయంలో ఎమ్మెల్యే స్వయంగా వచ్చి తమ సమస్యలను విని తక్షణ చర్యలు తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అన్ని విధాల సహాయం చేస్తుందని మరోసారి హామీ ఇచ్చిన నక్కా ఆనందబాబు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు వరద ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, మండల స్థాయిలోని వివిధశాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## రైతులను ఆదుకోవాలి

కొల్లూరు, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : వరద ముంపు కారణంగా కొల్లూరు మండల పరిధిలోని తడికలపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వేములపల్లి మోహన్ కృష్ణ కుటుంబ సభ్యులు మంగళవారం వరద నీరు రోడ్లపై రావడంతో వరద నీటిలో నడుస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లంక గ్రామాల్లో ఈ వరదల వలన పంట నష్టమే కాకుండా అన్ని విధాల నష్టపోతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.



## వరద బాధితులకు ఆర్థిక సహాయం చేసిన ఎస్సై జానకి అమరవర్ధన్



కొల్లూరు, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : కొల్లూరు మండల పరిధి కృష్ణానది వరదల వలన నిరాసితులైన వరద బాధితులు పునరావాస కేంద్రంలో ఉన్న మూడు కుటుంబాలకు మంగళవారం కొల్లూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జానకి అమరవర్ధన్ తన వంతు సహాయంగా రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

## కొల్లిపర మండలంలో దసరా వేడుకలు

కొల్లిపర, సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా మండలంలోని పలు దేవాలయాల్లో నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధస్వామి దేవాలయంలో శ్రీ దుర్గాదేవిగా, శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో శ్రీ దుర్గాదేవిగా, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీ భవానిదేవిగా, శ్రీవీరభద్రస్వామి కాలనీలో శ్రీ దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



## అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలకు ఎల్లవేళలా ఉండాలి

వేమూరు సెప్టెంబర్ 30 (ప్రభాతవార్త) : దసరా ఉత్సవాలు సమాజంలో శాంతి ఐక్యతకు నాంది పలికే పండుగని అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లవేళలా ప్రజలందరికీ ఉండాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆకాంక్షించారు. మంగళవారం పోతుమర్రు గ్రామంలో జరుగుతున్న దసరా ఉత్సవాలలో ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలు భక్తి విశ్వాసాన్ని పెంచే విధంగా ప్రతిభింబిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, వేమూరు సొసైటీ అధ్యక్షులు ఉషారాజేష్, ఉత్సవాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## టిడిపి సభ్యత్వం కార్యకర్తల కుటుంబానికి అండ

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: టిడిపి సభ్యత్వం కార్యకర్తల కుటుంబానికి అండ అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పార్టీ సభ్యత్వం పొంది ఇటీవల అకాల మరణం చెందిన కుటుంబాలకు టిడిపి కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 2024-2026కాలానికి రూ.100తో టిడిపి సభ్యత్వం నమోదు చేసుకొని ఇటీవల కాలంలో రోడ్డు ప్రమా దవశాత్తు మరణించి నటువంటి పెద ఇటికం పాడు గ్రామానికి చెందిన ఇంటూరి దిల్దార్, పచ్చల తాడిపర్రు గ్రామానికి చెందిన మొవ్వా వెంకటేశ్వ రరావు కుటుంబాలకు (నామిని)కి ఒక్కొక్కరికి రూ.5లక్షలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ నీటిపారుదల శాఖామంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న పార్టీ ఒక్క టిడిపి మాత్రమేనని గుర్తించాలన్నారు. టిడిపికి కార్యకర్తలే అండని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, పఠాన్ అహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## జై వాసవి....జైజై వాసవి

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: జై వాసవి....జై జై వాసవి...జై దుర్గా.....జైజై దుర్గా....అనే భక్తుల నినాదాలతో శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం మార్మోగిపోయింది. దేశీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి నిడుబ్రోలు నుంచి సారెను తెచ్చి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలోకి వేంచేపుచేసి పల్లకీసేవ నిర్వహించారు. కేవలం మహిళా భక్తులు మాత్రమే అమ్మవారి పల్లకీని తమ భుజస్కంధాలపైకి ఎత్తుని ప్రత్యేకంగా వేడుక నిర్వహించారు. ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకొంది. అనంతరం అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. భక్తులందరికీ తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కారుమూరి ప్రకాష్ నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## అధికారమంటే ప్రజలకు సేవ చేయడం అని నిరూపించిన చంద్రబాబు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,సెప్టెంబర్30,ప్రభాతవార్త: జగన్ అవినీతికి పూర్తిగా కుదేలైన రాష్ట్ర విద్యుత్ రంగాన్ని కేవలం 15 నెలలోనే గాడిలో పెట్టి, విద్యుత్ తయారీ, సరఫరాలో తలెత్తే నష్టాలను అధిగమించి, కంపెనీ సంస్థలపై పడిన భారాన్ని తగ్గించడం సామాన్యవిషయం కాదని మాజీమంత్రి, శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ట్రూఅప్‌లకే పరిమితమైన గత పాలకుల చర్యలతో విద్యుత్‌భారాలతో



అల్లాడిపోయిన రాష్ట్ర ప్రజానీకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ట్రూడౌన్ పరిచయం చేయడం ఆయన పనితీరుకు నిదర్శనమని ప్రత్తిపాటి వివరించారు. మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ కొనుగోళ్లలో ఆదా అయిన రూ 1000కోట్లు ( రూ 923.55 కోట్లు) నేరుగా ప్రజలకు అందించేలా ఆయన తీసుకున్న నిర్ణయం సదా ప్రసంశనీయమని అన్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి వసూలుచేసిన గత పాలకులకు భిన్నంగా ప్రజలకే తిరిగి ఇవ్వాలని నేటి పాలకుల ఆలోచనా విధానం గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. మొన్నటికి మొన్న జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల రాష్ట్రానికి కలిగే రూ 8వేల కోట్ల ప్రయోజనాన్ని, నేరుగా ప్రజలకే అందించిన చంద్రబాబు, తాజాగా మరో 1000 కోట్ల రూపాయిల లబ్ధిని తాజాగా ట్రూడౌన్ రూపంలో వారికే అందివ్వడం చరిత్రలో నిలిచిపోయే అంశమని ప్రత్తిపాటి వివరించారు. తన పాలనలో జగన్ ప్రజలపై రూ 32వేల కోట్ల విద్యుత్‌చార్జీల భారం మోపాడని అన్నారు. పిపిఎల రద్దు మొదలు అనాలోచిత నిర్ణయాలతో ఏపి విద్యుత్ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసి 11 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, అదనంగా ట్రూఅప్, ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో పట్టపగలే వినియోగదారులకు చుక్కల చూపించాడని ప్రత్తిపాటి తెలిపారు.

**రాష్ట్ర ఖజానాకంటే ప్రజల సంతోషమే కూటమి ప్రభుత్వానికి ముఖ్యం**

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌తో పాటు, ట్రూడౌన్ చార్జీల రాయితీ అందివ్వడంతో పాటు 50 గజాలలో నిర్మించే ఇంటి నిర్మాణ అనుమతి ఫీజును కేవలం రూపాయిగా నిర్ణయించడం మరో విశేషమని ప్రత్తిపాటి తెలిపారు. పట్టణాలు, నగరపంచాయితీలలో ఇళ్ల నిర్మించుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడే నిర్ణయమని అన్నారు. దీనివలన ఖజానాకు జమ అయ్యే రూ 4వేల కోట్లను కూడా కాదనుకొని ప్రభుత్వం ప్రజల సంతోషానికి ప్రాధాన్యత నిచ్చిందని అన్నారు.

## సరస్వతీదేవి అమ్మవారిని దర్శించుకున్న ప్రత్తిపాటి సతీమణి వెంకటకుమారి





చిలకలూరిపేట,సెప్టెంబర్30,ప్రభాతవార్త: దసరా పండుగను పురస్కరించుకొని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి సతీమణి వెంకటకుమారి పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెంకటకుమారికి స్వాగతం పలుకుతూ ఆశీస్సులు అందచేశారు. అనంతరం వాసవీ జ్ఞానమందిరంలో సరస్వతీ దేవి అలంకారంలో కొలువై ఉన్న అమ్మవారిని వెంకటకుమారి దర్శించుకున్నారు. శ్రీ గంగా పార్వతీ సమేత ఉమామహేశ్వర దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గీతా మందిరం, రామాలయంలోని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆమెను కమిటి సభ్యులు సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందచేశారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని విద్యార్ధులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటకుమారి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అందరికి అమ్మవారి ఆశీస్సులు అందాలని ప్రార్ధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్యవైశ్య ప్రముఖులు, దేవస్థాన కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## భావనారుషి నగర్‌లోఅమ్మవారిని దర్శించుకొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట,సెప్టెంబర్30,ప్రభాతవార్త: పట్టణంలోని భావనారుషి నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నందు దసరా నవరాత్రులలో బాగంగా మూలానక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు శ్రీ సరస్వతీ అమ్మవారి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ వేడుకలలో దసరా ఉత్సవ కమిటి ఆహ్వానం మేరకు శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం 4వేలమంది భక్తులకోసం ఏర్పాటుచేసిన అన్న ప్రసాదాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగ్ అజిత్‌కుమార్. జంజనం వెంకట్రావు, దుర్గానాయక్, గంజి శివ తదితరులు పాల్గొన్నారు.




## తూబాటి చిన్నబ్బాయ్‌కు ఘననివాళి



నాదెండ్ల,సెప్టెంబర్30,ప్రభాతవార్త: మండలంలోని గణపవరం గ్రామ పంచాయితీ వార్డు సభ్యులు తూబాటి చిన్నబ్బాయ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంగళవారం శాసనమండలి సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ నాయకులు వలేటి హిమవంతరావు, కాట్రు శ్రీనివాసరావు, ముక్కపాటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన పార్వతీదేవి






యడ్లపాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : శరన్నవరాత్రుల్లో భాగంగా మంగవారం శ్రీ పార్వతీదేవి అమ్మవారు, కాటి అంకమ్మతల్లి భక్తులకు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. నవదుర్గతులను నివారించే మహాశక్తి స్వరూపమే శ్రీఅమ్మవారి శ్రీ దుర్గాదేవి అలంకారం విశిష్టత. శ్రీ దుర్గాదేవి అవతారంలో శ్రీ అమ్మవారు దుర్గముడనే రాక్షసుడ్ని సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. పంచప్రకృతి మహాస్వరూపాల్లో శ్రీ దుర్గాదేవి రూపం మొదటిది. భవబంధాలలో చిక్కుకున్న మానవుడిని శ్రీ దుర్గాదేవిమాత అనుగ్రహించి ప్రసాదిస్తుందని, కోటి సూర్యప్రభలతో వెలిగొందే శ్రీ దుర్గాదేవి అలంకారంలోని శ్రీ అమ్మవారిని అర్చిస్తే శత్రుబాధలు నశిస్తాయిని తెలుపుతున్నారు. అమ్మవారికి నివేదనగా పులగాన్న ం ప్రసాదంగా నివేదించి భక్తులకు పంచిపెట్టటం జరిగిందని అన్నారు. ఉదయం నుండే భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాలలో దేవాలయాలు భక్తులతో నిండిపోయాయి.

## విద్యార్దులు ఏర్పాటుచేసిన గ్రామ స్వరూపం చిత్రపటం



యడ్లపాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : బాపట్ల వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్ధినులు వ్యవసాయ పనులు క్షేత్రస్దాయిలో పరిశీలన, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ఇటీవల యడ్లపాడు వచ్చి నివశిస్తున్నారు. పత్తి, మిరప, ఉద్యాన పంటచేలకు వెళ్లి సమగ్ర యాజమాన్య పద్దతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో బాగంగా మంగళవారం స్దానిక పెద్ద బజారులో గ్రామ నైసర్గిక స్వరూప చిత్రపటం చిత్రీకరించారు. స్దానిక ప్రభుత్వ కార్యాలయాలు, అసుపత్రి, బ్యాంకులు, పోలీస్ స్టేషన్, పంటచేల వివరాలు సాగునీటి కాలువులు, ఇతర సహజ వనరులు చిత్రపటంలో రూపకల్పన చేశారు. గ్రామస్తులకు చిత్రపటంలోని అంశాలను తెలియజేసారు. కార్యక్రమంలో విద్యార్ధినులు చాందిని, భువనేశ్వరి, భాగ్యశ్రీ, కె హర్షిత, జ్యోత్న, హమీదా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్వారీ గుంతలో విద్యార్థి గల్లంతు





యడ్లపాడు, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త : మండల పరిధిలోని కొండవీడు రిజర్వ్ ఫారెస్ట్ కొత్తపాలెం పంచాయితీ పరిధిలోని చౌడవరం గ్రామ శివార్లలో ఉన్న క్వారీ గుంట వద్ద ఒక బాలుడు గల్లంతు అయిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్దానిక ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం మధ్యాహ్నం సుమారు 3.30గంటల సమయంలో మొత్తం 9మంది విద్యార్దులు అక్వారీ గుంటకు ఈత కొట్టడానికి వెళ్లారని, ఈ క్రమంలో దాసరి పాలెం గ్రామానికి చెందిన మైనర్ బాలుడు అయిన షేక్ మాబు మాత్రం ప్రమాదవశాత్తు నీటి గుంటలో మునిగిపోయాయి గల్లంతు అయ్యాడని, ఇతను యనమదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడన్నారు. సమాచారం అందుకున్న వెంటనే చిలకలూరిపేట రూరల్ సిఐ సుబ్బనాయుడుతో కలసి సిబ్బంది సంఘటనా స్దలానికి చేరుకొని మృతుడి ఆచూకి కోసంన చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం గజ ఈతగాళ్లను పిలిపించి శరీరాన్ని వెలికితీసే ప్రయాత్నాలు ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. పూర్తిగా చీకటికావటంతో విద్యుత్ దీపాల వెలుతురులో గాలింపు నిర్వహించుతున్నామన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రులు

వినుకొండ,సెప్టెంబర్29,ప్రభాతవార్త: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ వద్ద గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం 9వ రోజు అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమించారు. అమ్మవారికి ప్రకృతి సిద్ధమైన





నెమలీకలతో ప్రత్యేక అలంకరణ చేశారు. బాలికలచే ప్రత్యేక భరతనాట్యం,కళ్యాణ మండపం ఆవరణలో 350 మంది మహిళలతో కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పది రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు,కుంకుమార్చనలు,పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు బొన్నలగడ్డ బాబ్జి,గౌరవ అధ్యక్షులు తాతా వెంకట సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల అమర్నాధ్, రెడ్డి నగేష్‌బాబు,కోశాధికారి పెండ్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**నూజెండ్లలో:** మండలంలోని రవ్వారం గ్రామ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర జగన్మాత పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు కనకదుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రధానాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు,పూజలు చేసి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

## బొల్లాపల్లి మండలంలో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

ఈపూరు,సెప్టెంబర్30,ప్రభాతవార్త: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలంలోని అనుమానాస్పద గ్రామాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టినట్లు



ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల్లో మద్యం కొనుగోలు చేయాలన్నారు. ఎక్సైజ్ సంబంధిత నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు తమకు తెలియజేయాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అక్టోబర్ 2న మాంసాహార విక్రయాలు నిషేధం

వినుకొండ,సెప్టెంబర్30,ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 2న జాతిపిత మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని పట్టణంలో మాంసం విక్రయాలపై పూర్తిగా నిషేధం విధించడం జరిగిందని మున్సిపల్ కమీషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మాంసం వ్యాపారులు,హోటల్స్,రెస్టారెంట్,చికెన్,మటన్,చేపల స్టాల్స్‌ను మూసివేయాల్సిందిగా పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## సత్తెనపల్లిలో దేవీ శరన్నవరాత్రుల కోలాహలం









సత్తెనపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు. 9వ రోజున దుర్గాదేవి అలంకరణలో వాసవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా వెంకటపతికాలనీలో శ్రీలక్ష్మి పీఠం నందు దసరా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. మాతాజీ శ్యామలమ్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. త్రిశక్తి దుర్గాపీఠం నందు నవదుర్గ అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. వడ్డవల్లి పోలేరమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

## 'మాస్టర్ ప్లాన్‌ను పారదర్శకంగా తయారు చేయాలి'



సత్తెనపల్లి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : సత్తెనపల్లి మాస్టర్ ప్లాన్‌ను పారదర్శకంగా తయారు చేయాలని లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాబోయే 25 ఏళ్ళ కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారదర్శకంగా మాస్టర్ ప్లాన్ రెడీ చేయాలన్నారు. నివాస ప్రాంతాలు, వ్యాపార, పారిశ్రామిక, వ్యవసాయ, పర్యావరణ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు మేధావులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. గోప్యంగా సమావేశాలు నిర్వహించవద్దని జొన్నలగడ్డ విజయ్‌కుమార్ సూచించారు.

## 75 తాళ్ళూరు హైస్కూల్ హెచ్‌ఎంకు విశిష్ట అధ్యాపక పురస్కారం

పెదకూరపాడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : మండలంలోని 75 తాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎ.శ్రీనివాసరెడ్డికి విశిష్ట అధ్యాపక పురస్కారం లభించింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి విద్యాసేవ, వేములపల్లి మాణిక్యాలరావు ఆదర్శ అధ్యాపక పురస్కారాన్ని ఇస్తున్నట్లు "విద్యార్థి వికాస వాహిని" సంస్థ ప్రకటించింది. ఎన్నో సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా, వ్యాసకర్తగా విద్యారంగంలో చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని శ్రీనివాసరెడ్డికి ఇస్తున్నట్లు విద్యార్థి వికాస వాహిని నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 5న మచిలీపట్నంలో మహతి అలిత కళావేదికలో జరిగే ఈ కార్యక్రమంలో మాజీమంత్రి, అవనిగడ్డ శాసనసభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, విద్యార్థి వికాస వాహిని వ్యవస్థాపక అధ్యక్షులు వేములపల్లి కేశవరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, శతాధిక గ్రంథకర్త డాక్టర్ జి.వి.పూర్ణచంద్, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సూర్యప్రకాష్‌రావు, వివిధ రంగాల్లోని ప్రముఖులు పాల్గొని పురస్కారాన్ని ప్రధానం చేయనున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన శ్రీనివాసరెడ్డిని ఆంధ్రప్రదేశ్ హెచ్‌ఎంల సంఘం గుంటూరు, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎ.తిరుమలేష్, గోవింద రాజులు, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పల్నాడు జిల్లా ఫ్యాప్టో కో ఛైర్మన్ టి.చంద్రయ్య, పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ జి.వి.హనుమంతరావు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం



పెదకూరపాడు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెదకూరపాడులో మంగళవారం స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్తిమళ్ళ రమేష్‌లు పాల్గొన్నారు. మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రామ్‌గోపాల్‌రావు, డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి షేక్.ముంతాజ్, టిడిపి పార్టీ సీనియర్ నాయకులు మద్దినేని వెంకట సత్యనారాయణ, గ్రామ ఉప సర్పంచ్ జాగర్లమూడి రఘు, కంచర్ల సుధాకర్, గోగులపాటి శ్రీను, గుడిపూడి బాబురావు, నందిగామ రమేష్, గోగులపాటి వెంకటేశ్వర్లు, బావన రాంబాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్జీవో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

నకరికల్లు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : ఏపి ఎన్జీవో అసోసియేషన్ పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం అడహాక్ కమిటీ ఛైర్మన్ ఎం.రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగూర్‌షరీఫ్ పాల్గొన్నారు. నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా శాఖను వారు అభినందించారు. జిల్లాలో అన్ని తాలూకా యూనిట్ల సభ్యత్వాన్ని పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా అడహాక్ కమిటీ సభ్యులతో పాటు జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జిఎస్‌టి స్లాబ్‌ల తగ్గింపుతో వినియోగదారులకు ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టిని తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులతో పాటు అనేక వస్తువులపై ధరలు తగ్గి మేలు జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మంగళవారం రాష్ట్ర జిఎస్‌టి జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడను ఆయన కార్యాలయంలో కలిశారు. అదే విధంగా సిటివో ఎం.రామారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు వనమా సాంబశివరావు, పచ్చిపులుసు సతీష్, టిడిపి టౌన్ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణలు కలిశారు. వారితో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పెద్ద ఎత్తున జిఎస్‌టి తగ్గింపు సేవలపై ప్రచారం నిర్వహించాలన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఫోటో

## రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వపరంగా నిర్వహించాలి : డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వపరంగా నిర్వహించాలని వైకాపా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.



మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎస్.సి. సెల్ నాయకులు కె.చంద్రశేఖరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటైతే కేవలం రూ.30 లక్షల నుండి రూ.40 లక్షల్లోపే పిల్లలు డాక్టర్లుగా చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చదువుకోవాలంటే రూ.కోటి వరకు వ్యయం అవుతుందన్నారు. అదే విధంగా రూ.8500 కోట్లు ఖర్చు పెట్టి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 17 మెడికల్ కళాశాలలను వై.ఎస్.జగన్ తీసుకువచ్చారని గుర్తు చేశారు. అయితే వీటిని అప్పనంగా తన అనుచరులకు కోట్ల రూపాయలు లంచాలు తీసుకొని అప్పగించే కుట్ర చేయడమే కాక వచ్చిన మెడికల్ సీట్లను వద్దని తిరిగి పంపించడం దుర్మార్గమన్నారు. కోట్ల విలువ చేసే ఆర్టీసీ స్థలాన్ని విజయవాడలో రూ.400 కోట్లకు అమ్మకం చేశారని, విశాఖపట్నంలో ఎకరం రూ.99 పైసలకు ప్రైవేట్ వ్యక్తులకు బ్యాక్‌డోర్‌లో కోట్ల రూపాయలు లంచం తీసుకొని అమ్ముకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. 15 మెడికల్ కళాశాలలకు సుమారు రూ.1500 కోట్లు దండుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఒక్కొక్క కళాశాలకు 60 నుంచి వంద ఎకరాల భూమిని అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ సేకరించడం జరిగిందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే మొత్తం మెడికల్ కళాశాలలు పూర్తవుతాయన్నారు. రూ. 2500 కోట్లు అప్పులు చేసిన చంద్రబాబునాయుడు కేవలం రూ.5 వేల కోట్లను ఎందుకు ఖర్చు పెట్టడం లేదన్నారు. 14 సంవత్సరాల పాటు సిఎంగా చేసి రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాలను తీసుకునానందుకు సిగ్గుపడాలన్నారు. ఎస్.సి. సెల్ జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ పేద వర్గాల వారి కోసం తీసుకు వస్తున్న 15 మెడికల్ కళాశాలలను అమ్ముకోవాలనుకోవడం ఘోరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్లో ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : కొండవీడు ఇ.యన్.టి.హాస్పటల్లో 78వ మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రీవర్షిణిలు వివరాలు తెలియజేశారు. గాంధీజయంతి రోజున ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య పరీక్షలు అందిస్తామన్నారు. చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత పరీక్షలతో పాటు మందులను



అందించడం జరుగుతుందన్నారు. వినికిడి లోపం ఉన్నవారికి చెవిటి మిషన్‌పై 30 శాతం రాయితీ అందిస్తామన్నారు. తల తిరుగుడు సమస్యలకు సంబంధించి పరీక్షపై 20 శాతం రాయితీ ఉంటుందన్నారు. లాటరీ పద్ధతి ద్వారా 10 మందిని ఎంపిక చేసి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో తమతో పాటు డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ సుధీర్‌చంద్ర, విష్ణురాజు, నాగేశ్వరరావు తదితరులు వైద్య సేవలు అందిస్తారని డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ శ్రీవర్షిణిలు తెలియజేశారు.

## పుట్టగొడుగులకు పెరిగిన డిమాండ్!



నరసరావుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : పట్టణంలోని పలు ప్రధాన సెంటర్‌లలో పుట్టగొడుగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంతాల నుండి సహజంగా లభించే పుట్టగొడుగులు పోషక విలువలను కలిగి ఉంటాయి. జోరుగా వర్షాలు కురవడంతో పుట్టగొడుగులు పెద్ద ఎత్తున లభిస్తున్నాయి. పోషక విలువలతో పాటు మంచి రుచిగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే పుట్టగొడుగులకు సంబంధించి కట్టకు 4-5 మాత్రమే ఉండేవి రూ.150ల నుండి రూ.200ల వరకు విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు పుట్టగొడుగులు పరిస్థితి లేకుండా పోయింది. సహజసిద్ధమైన పద్ధతిలో లభించే పుట్టగొడుగులకు పోషక విలువలు అధికంగా ఉన్నప్పటికీ ఎక్కువ ధరలతో వాటిని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ సత్కారం


నరసరావుపేట క్రైం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి ఎస్పీ బి.కృష్ణారావు స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సత్కారం చేశారు. ఏఎస్ఐ



మస్తాన్‌వలి, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్ మౌలాలి ఉద్యోగ విరమణ చేయడంతో వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి వారి సేవలను ప్రశంసించారు. వారి సేవల వెనుక కుటుంబసభ్యుల సహకారం ఎంతో ఉంటుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం, కుటుంబసభ్యులతో సుఖ సంతోషాలు వారికి ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.వి.సంతోష్, సత్తిరాజు, డిఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, పోలీస్ అధికారులు ఎస్.కృష్ణ, గోపినాథ్, యువరాజ్, మాణిక్యాలరావు తదితరులు ఉన్నారు.

## శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

నకరికల్లు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : శాఖా గ్రంథాలయం అభివృద్ధి కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు జిల్లాలోని శాఖా



గ్రంథాలయాలకు అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ తెలియజేశారు. కమిటీ అధ్యక్షులుగా స్వర్ణ చిన్నరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రత్నాకరం రాము, కార్యదర్శిగా పి.వీరబ్రహ్మం, సంయుక్త కార్యదర్శిగా అమ్మ జిలానీ, సభ్యులుగా ఈదర గోపిచంద్, మామిళ్ళ కృష్ణయ్య, ప్రసాదరావు, బత్తుల మురళీ, బాజీ మస్తాన్ నియమితులయ్యారు. కన్వీనర్, కోశాధికారిగా యడ్లపాటి రాధ కొనసాగుతారని సభ్యులు తెలియజేశారు.

## జర్నలిస్టుల హెల్త్ కార్డులపై అవగాహన సమావేశం



నరసరావుపేట, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : జర్నలిస్టుల హెల్త్ కార్డులకు సంబంధించి మంగళవారం స్దానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏపియుడబ్ల్యూజే సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అసోసియేషన్ నియోజకవర్గ కార్యదర్శి బుజ్జిబాబు అధ్యక్షత వహించారు. జిల్లా నాయకులు వార్త జగన్‌మోహన్‌రెడ్డి, ఐ న్యూస్ నాగరాజు, సాక్షి సాంబశివారెడ్డి, సాక్షి లవకుమార్‌రెడ్డి, అడ్డగిరి అప్పారావు, శివ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్యేకంగా అక్రిడేషన్ ఉన్నా లేకపోయినా జర్నలిస్టులకు వైద్యసేవల్లో 50 శాతం పైగా రాయితీలతో హెల్త్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని ప్రముఖ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌తో పాటు వివిధ విభాగాలకు సంబంధించిన ప్రత్యేక హాస్పటల్స్‌లో వైద్యసేవలను హెల్త్‌కార్డులతో పొందవచ్చన్నారు.

# ఆర్తుల ప్రాణధార.. వంద పడకల వైద్యం!

### అత్యవసర వైద్యసేవలకు కేంద్ర బిందువు! దశాబ్దాల కల నెరవేరితే... మాచర్లకు మహర్దశ! చంద్రబాబు హామీతో జూలకంటి ఆశయాలకు బీజం!

మాచర్ల, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: లక్షలాది ఆర్తనాధాలతో మూడు దశాబ్దాలుగా ఘోషిస్తోంది మాచర్ల ప్రభుత్వాసుపత్రి! నాలుగు నియోజకవర్గాల ప్రజలకు లైఫ్‌లైన్‌గా ఉన్న మాచర్ల ప్రభుత్వాసుపత్రి వంద పడకలుగా అప్‌గ్రేడ్ అయితే.. అన్ని రకాల అత్యవసర వైద్యసేవలు ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్నాయి. ప్రమాద సమయాల్లో అత్యవసర వైద్యసేవలకు ఇకమీదట క్షతగాత్రులు కంఠంలో ప్రాణాలు నిలుపుకొని 150 కి.మీ. దూరంలో ఉన్న గుంటూరుకు పరుగులు పెట్టాల్సిన ప్రస్తుత పరిస్థితి నుంచి విముక్తి లభిస్తుంది.

**అత్యవసర వైద్యసేవలకు కేంద్ర బిందువు!**

50 పడకలుగా ఉన్న మాచర్ల ప్రభుత్వాసుపత్రి 100 పడకలుగా అప్‌గ్రేడ్ అయితే ఆసుపత్రిలో వైద్యసిబ్బంది ప్రస్తుతం ఉన్న సంఖ్యకు మూడు రెట్లు అధికమవుతోంది. అలానే పెద్దపెద్ద ఆపరేషన్ థియేటర్లు, అధునాతన వైద్య పరికరాలు, ఇంటెన్సివ్ కేర్, అడ్వాన్స్ ఆర్టిఫిషియల్ ఆక్సిజన్ పరికరాలు, అతిపెద్ద రక్తపరీక్షల ల్యాబ్, అడ్వాన్స్ సీటీ స్కానింగ్, ఇతర స్కానింగ్ పరికరాలు, బ్లడ్‌బ్యాంకు వంటి అనేక వసతులతో కూడిన విభాగాల్లో దాదాపు 25 మంది సివిల్ సర్జన్లు, 30 మంది గ్రేడ్-2, ఇతర నర్సింగ్ స్టాఫ్, రేడియాలజిస్టు, ల్యాబ్ టెక్నీషియన్స్ ఇలా వంద నుంచి 150 మంది వైద్యసిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తారు. ఈ ఆసుపత్రి మాచర్ల నియోజకవర్గంతోపాటు గురజాల, యర్రగొండపాలెం, మార్కాపురం, ఇటు తెలంగాణలోని నాగార్జునసాగర్ ప్రజలకు సైతం అత్యవసర చికిత్సలు అందుతాయి. రమారమి ఏడు లక్షల మందికి వైద్యసేవలు




అందుతాయన్నది నిపుణుల అంచనా.

**దశాబ్దాల కల నెరవేరితే... మాచర్లకు మహర్దశ!**

మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రి అప్‌గ్రేడ్‌పై అభివృద్ధి కూడా ముడిపడి ఉంది. కొన్ని రంగాలు శరవేగంగా పుంజుకుంటాయన్నది ఎమ్మెల్యే జూలకంటి విజన్. మల్టీస్పెషాలిటీని తలదన్నేలా ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులోకి వస్తే.. అయిదు నియోజకవర్గాల పరిధిలోని లక్షలాది మంది ప్రజలు ఆసుపత్రికి తరలివస్తుంటారు. తద్వారా మాచర్ల పట్టణానికి ప్రజల రద్దీ పెరుగుతుంది. ప్రజల తాకిడి అమాంతం పెరిగితే.. వసతి, ఆహారం, వినోదం, ట్రాన్స్‌పోర్ట్, క్రూడాయిల్ వంటి రంగాలకు డిమాండ్ పెరుగుతుంది. అలాగే ప్రైవేటు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సంఖ్య కూడా పెరుగుతుంది. మరోవైపు ఇక్కడ భూములకు కూడా డిమాండ్ పెరుగుతుంది. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు ఊపందుకుంటాయి. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

**చంద్రబాబు హామీతో జూలకంటి ఆశయాలకు బీజం!**

పల్నాడు జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం, భౌగోళికంగా రాష్ట్రానికి దూరంగా విసిరేసినట్లు ఉండే మాచర్ల నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి అనే మంత్రంతో సంకల్ప బీజం వేశారు ఎమ్మెల్యే జూలకంటి. ఆర్థికంగా... సామాజికంగా వెనుకబడిన ఈ ప్రాంత ప్రజలకు ఆరోగ్య ప్రదాయినిగా 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిలుస్తుందని విశ్వసించి.. ఇక్కడ వైద్యపరంగా ఉన్న అత్యవసర పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు మాచర్ల నియోజకవర్గ పర్యటనకు వచ్చినప్పుడు జూలకంటి విన్నపాలకు హామీ ఇచ్చారు. మాచర్ల ప్రభుత్వాసుపత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తానని మాట ఇచ్చారు. ఈ స్టేట్‌మెంట్‌తో మాచర్ల నియోజకవర్గంతోపాటు పక్కనున్న నియోజకవర్గాల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణంతో ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఆరోగ్యమే కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితులు బాగుపడతాయి. సీఎం చంద్రబాబు హామీతో మోడుబారిన బతుకులకు జవసత్వాలు వచ్చినట్లుగా ఉంది. చంద్రబాబుకు, ఎమ్మెల్యే జూలకంటికి కృతజ్ఞతలు.

**- జూలకంటి చిరంజీవిరెడ్డి, వెల్దుర్తి**



ఎమ్మెల్యే జూలకంటి, సీఎం చంద్రబాబు దార్శనికతతో వెనుకబడిన మాచర్ల అభివృద్ధి శరవేగంగా పుంజుకుంటుంది. 100 పడకల ప్రభుత్వాసుపత్రి అన్ని వర్గాల ప్రజలకు ప్రాణాధారం! నిర్మాణాలు ప్రారంభమైన నాటి నుంచే అభివృద్ధి కనిపిస్తుంది. చంద్రబాబు, జూలకంటిలకు రుణపడి ఉంటాం.

**- గుండాల శ్రీనివాసయాదవ్, కొప్పునూరు**

## కూటమి అరాచకాలు డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: కూటమి నాయకుల దురాగతాలను, అరాచకాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రమైన చేబ్రోలులో మంగళవారం రాత్రి జరిగిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో కూటమి నాయకులు కక్షపూరిత అరాచకాలను, దురాగతాతో నష్టపోయి ప్రతి ఒక్క వైకాపా నాయకుడు, కార్యకర్త కూడా మన పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి మనకోసం ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించడంలో వైఫల్యం చెందిందన్నారు. అదేమని అడిగే నాయకులపై కేసులు బనాయించడం, కక్షపూరితంగా వ్యవహరించడం వంటి కార్యకలాపాలకు దిగుతుందన్నారు. ఎవరైతే నష్టపోయారో వారు వారికి జరిగిన నష్టాన్ని, అన్యాయానికి సంబంధించిన వివరాలను ఫోటోలతో సహా డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలనికోరారు. అనంతరం డిజిటల్ బుక్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ శ్రీరామిరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు జయపాల్‌రెడ్డి, నియోజకవర్గ బీసిసెల్ పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడు ముత్యేశ్వరరావు, అన్నదాసు సుబ్బారావు, మండల బీసిసెల్ అధ్యక్షుడు శంకరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు అల్లం వెంకటరామయ్య, మండల బూత్ కమిటి అధ్యక్షుడు కొల్లి శేషిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు పల్లిపాటి కోటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు యాతం మమత, దాసరి ధనమ్మ, సీనియర్ నాయకులు పోతురాజు, పోలేశ్వరరావు, అశోక్, హరి, జ్యోతి, పరిస చిరంజీవి, గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## డా.కొండలరావుకు గుర్రం జాషువా ఎక్సలెన్స్ అవార్డు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు30, ప్రభాతవార్త: వర్సిటీలోని లైబ్రరీ సైన్స్ విభాగంలో అతిధి అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న డా.దేవరపల్లి కొండలరావుకు గుర్రం జాషువా ఎక్సలెన్స్ అవార్డు-2025 ప్రధానం చేశారు. నవ్యాంధ్ర విద్యార్థి సమైక్య, ద్రావిడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కర్నూల్‌లో గుర్రం జాషువా జయంతి సభను నిర్వహించారు. ఈ సభలో డా.కొండలరావుకు అవార్డును అందజేశారు. స్కోప్ ఫౌండేషన్ ద్వారా పేద, బడుగు, బలహీన, వర్గాలకు సామాజిక చేయూత, విద్య, ఆరోగ్యం పరంగా నిరంతరం అందుబాటులో ఉండి తగు సేవలను చేస్తున్నారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం, ట్యూషన్ చెప్పించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈక్రమంలో దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన నవ్యాంధ్ర విద్యార్థి సమైక్య, ద్రావిడ సంక్షేమ సంఘం జాషువా అవార్డుతో సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ డా. రాజన్న, కర్నూల్ డిఎస్పి మహబూబ్ బాషా, కమిటీ సభ్యులు శర్మ తదితరులు కొండలరావు దంపతులను సన్మానించి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, లైబ్రరీ సైన్స్ విభాగం అధ్యాపకులు, ఉద్యోగులు కొండలరావును అభినందించారు.


## పూర్వకార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు ఆత్మీయ వీడ్కోలు సభ

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురంలోని శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో పూర్వ కార్యదర్శి,ప్రస్తుత సలహాదారు నేతి విశ్వేశ్వరరావు వీడ్కోలు సభ జరిగింది.సభకు అధ్యక్షులుగా సాహితీ వేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆత్మీయ అతిధిగా అధ్యక్షులుగా శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు,డాక్టర్ రాఘవరావు, మోదుగుల రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.అతిధులు మాట్లాడుతూ నేతి విశ్వేశ్వరరావు శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదన్నారు.నేతి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో అనేక సంఘటనలను ఎదుర్కొని నిలబడిన జ్ఞాపకాలను తలచుకున్నారు.తాను వైజాగ్ 6గంటల ప్రయాణదూరంలో ఉన్నానని తన సహకారం ఎప్పుడూ సంఘానికి ఉంటాయన్నారు.మరువలేని 30ఏళ్ల ప్రస్థానం ఉగాది పచ్చడి లాగా అనేక రుచులతో నిండిందన్నారు.సభానంతరం అతిధులు సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ విశ్వేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు.సభానంతరం గోపరాజు లక్ష్మీ చే గాత్ర సంగీత సభ జరిగింది.వీరికి వయోలిన్‌పై పెరవలి మహతీ,మృదంగం పై బీరక భార్గవ చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు.




## నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయుడు

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త : మూఢాచారాలపై తిరగబడ్డ అగ్నిగుండం సమ సమాజాని న్న కాంక్షిస్తున్న కష్టజీవుల పక్షపాతి,దళితవర్గ జ్వాల స్ఫూర్తి,నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయులని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు.అవగాహన సంస్థ




కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ళ వి.ఎస్.ప్రసాదరావు మాట్లాడుతూ కవి కోకిల జాషువా నభూతో నభవిష్యత్ అనే రీతిలో ఆధునిక తెలుగు సాహిత్యాన్ని జాజ్వల్యమానంగా వెలిగించిన మహానుభావుడన్నారు.సాహిత్య విశ్లేషకులు వి.వి.రావ్ మాట్లాడుతూ క్షీణించిపోతున్నర తెలుగువారి సొత్తైన పద్యకవిత్వాన్ని బతికించిన కవి జాషువాయేనన్నారు.కవయిత్రి పింగళి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ ఆయన రచనలు గబ్బిలం,ఫిరదౌసీ,సాలీడు,గిజిగాడు,కాందిశీకుడు,ముంతాజ్ మహల్ మొదలైనవి విశిష్టతను చాటుతాయన్నారు.కార్యక్రమంలో కవి జమదగ్ని,గాయకులు రాజశేఖర్,బిళ్ళా అశోక్,కోటేశ్వరరావు తదితరులు జాషువా పద్యాలను అద్భుతంగా అలాపించారు.

## ఎస్ఐ ఆనంద్ కుమార్‌కు పదవీ విరమణ సత్కారం

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 30: జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై శి. ఆనంద్ కుమార్ కుటుంబాన్ని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) రమణ మూర్తి ఇతర జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించిన ఎస్సై ఆనంద్ కుమార్ 1987 లో ఉమ్మడి గుంటూరు పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ గా చేరి, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్,



ఏఎస్సై మరియు ఎస్సైగా సుమారు 38 ఏళ్ల పాటు పలు స్థాయిల్లో పోలీస్ శాఖలో సేవలందించారు. సుదీర్ఘకాలం ప్రజల రక్షణ శాంతి భద్రతల పరిరక్షణ కోసం విశేష కృషి చేసి, గౌరవ ప్రదంగా ఉద్యోగ విరమణ పొందినందుకు వారి సేవలను గుర్తించి వారిని పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించారు అదనపు ఎస్పీ (అడ్మిన్)తో పాటు ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, సురేష్, శ్రీనివాసరావు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

## 16ఏళ్ళ తర్వాత విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ...!

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు30, ప్రభాతవార్త: అసెంబ్లీలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన సర్వత్రా ఆసక్తిని రేపింది. విశ్వవిద్యాలయాలలో అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని మంత్రి ప్రకటించిన వెంటనే డాక్టరేట్ నిరుద్యోగుల ఆశలు సజీవంగానే ఉన్నాయంటూ ప్రచారం మొదలైంది. గడిచిన 16 ఏళ్ళలో విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ జరుగలేదు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు మాత్రం స్వల్ప సంఖ్యలో భర్తీ అయ్యాయి. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీని పరిశీలిస్తే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 2006లో ఒకసారి, 2009లో మరొకసారి విశ్వవిద్యాలయాలలో అధ్యాపక పోస్టులను భర్తీ చేసింది. ఆ తరువాత ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చినా భర్తీ ప్రక్రియ ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తరువాత ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు వస్తాయని భావించారు. కొన్నేళ్ళ నిరీక్షణ తరువాత 2014లో తేదేపా ప్రభుత్వం అధికారంలోకి వచి అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును రెండేళ్ళు పొడిగించింది. ఆపై అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం, ఏపిపిఎస్‌సి ద్వారా టెస్ట్ నిర్వహించడం, ఫలితాలు విడుదల చేయడం వరకు ముందుకు సాగింది. టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు పోస్టులపై నేటికీ నిరీక్షిస్తున్నారు. అలాగే 2019లో వైసిపి ప్రభుత్వం అధ్యాపక పోస్టుల భర్తీపై నోటిఫికేషన్ వరకు వెళ్ళింది, ఈలోగా ఎన్నికల షెడ్యూల్, న్యాయపరమైన చిక్కులు రావడంతో అవి ఆగిపోయాయి. ఇదిలాఉండగా అధ్యాపకుల




ఉద్యోగ విరమణ వయస్సును మరొక 3ఏళ్ళు పొడిగించింది. దీంతో ఉద్యోగ విరమణ వయస్సు 65ఏళ్ళకు పెరిగింది. దీని కారణంగా నిరుద్యోగుల శాతం రెట్టింపయ్యింది. 2029నాటికి రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో దాదాపు 60శాతం అధ్యాపక పోస్టులు ఖాళీకానున్నాయి. ఈతరుణంలో ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తేదేపా ప్రభుత్వం మెగా డిఎస్సీ పేరుతో వేలల్లో టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసింది. అదే విధంగా విశ్వవిద్యాలయాల్లో పోస్టులను కూడా భర్తీ చేయాలని పలు విశ్వవిద్యాలయాల నుంచి నిరుద్యోగ డాక్టరేట్‌లు కోరుతున్నారు. దీంతో 16ఏళ్ళ తరువాత విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీ అంశం మళ్ళీ తెరమీదికి వచ్చింది. ప్రస్తుతం విద్యాశాఖను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్న మంత్రి లోకేష్ విశ్వవిద్యాలయాలపై దృష్టి సారిస్తే విశ్వవిద్యాలయాలకు మళ్ళీ పూర్వ వైభవం వస్తుందనే ఆశలో నిరుద్యోగులు ఉన్నారు. రాష్ట్రంలో వేగంగా పుట్టుకొస్తున్న ప్రవేట్ విశ్వవిద్యాలయాలను తట్టుకుని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు నిలవాలంటే తప్పనిసరిగా అధ్యాపక పోస్టుల భర్తీ చేపట్టాలి. ఇది జరగాలంటే ముందుగా విశ్వవిద్యాలయాలలో పోస్టుల భర్తీపై ఉన్న న్యాయవివాదాలను పరిష్కరించుకోవాలి.

16ఏళ్ళుగా అధ్యాపక పోస్టుల భర్తీ లేకపోవడంతో ప్రతీఏటా వందల సంఖ్యలో పీహెచ్‌డిలు చేసిన డాక్టరేట్ పట్టబద్రులు నోటిఫికేషన్‌ల కోసం ఎదురుచూసిచూసి చిరుద్యోగులుగా, నిరుద్యోగులుగా పనిచేసుకుంటున్నారు. అలాగే చాలా విశ్వవిద్యాలయాల్లో సరిపడ అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, గెస్ట్ ఫ్యాకల్టీల ద్వారా తరగతుల నిర్వహణ నెట్టుకొస్తున్నారు. ఇది నిరుద్యోగులకు కొంత ఉపశమనం కలిగించినా సీనియర్ ప్రొఫెసర్‌ల పేరుతో పెన్షనర్‌లకు ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగుల ఆశలపై నిళ్ళుచల్లుతున్నారు. చాలా విశ్వవిద్యాలయాల్లో రిటైర్డ్ అయిన ప్రొఫెసర్‌లను మళ్ళీ విధుల్లోకి తీసుకుంటున్నారు. ఈ విధానం సరికాదని నిరుద్యోగులు మొత్తుకుంటున్నారు. రాష్ట్రంలో ఉన్న విశ్వవిద్యాలయాలు మెరుగైన ఎన్‌ఐఆర్‌ఎఫ్, క్యు ఎస్ ఐగేజ్, వంటి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి ర్యాంకులు సాధించాలంటే అధ్యాపక పోస్టుల భర్తీ అనివార్యం. ప్రస్తుతం చాలా విశ్వవిద్యాలయాలు ర్యాంకుల సాధనలో అధ్యాపక లేమి కనిపిస్తుంది. విశ్వవిద్యాలయాల మనుగడకు అధ్యాపక పోస్టుల భర్తీ కీలకంగా ఉంటుంది. ప్రభుత్వం హేతుబద్ధీకరణ పేరుతో కాకుండా వాస్తవాలను పరిగణలోకి తీసుకుని పోస్టుల భర్తీ చేయాలనేది నిరుద్యోగుల డిమాండ్. అలాగే పోస్టుల భర్తీపై న్యాయ వివాదాలు లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. అధ్యాపక పోస్టులను విశ్వవిద్యాలయాలే నేరుగా భర్తీ చేసేకునే విధానంపై సమగ్ర అధ్యయనం చేయాల్సిఉంది. విశ్వవిద్యాలయాలు గడిచిన కొన్నేళ్ళుగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వాటిల్లో అధ్యాపకుల లేమి ప్రధానంగా చెప్పవచ్చు. బోధనతో పాటు పరిశోధనల్లో కూడా విశ్వవిద్యాలయాలు ఉత్తమ పనితీరు సాధించాలన్నా, ప్రగతి పథంలో నడవాలన్నా, యూజిసి నిధులు పొందాలన్నా, అత్యుత్తమ ర్యాంకులు సాధించాలన్నా కూడా ప్రధానంగా అధ్యాపకుల పాత్రపై ముడిపడిఉంది. ఏదిఏమైనా అధ్యాపక పోస్టులను భర్తీ చేసి విశ్వవిద్యాలయాల మనుగడను కాపాడాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

## నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

గుంటూరు కల్చరల్,సెప్టెంబర్ 30,ప్రభాతవార్త : అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ వేడుకలు అక్టోబర్ 1వ తేదిన ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో జరుగుతుందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు ప్రముఖ వైద్యులు మధుమేహ వ్యాధినిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ ప్రసంగిస్తారన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన చాముండేశ్వరి అమ్మవారు

అమరావతి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త : అమరావతిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకలలో భాగంగా శ్రీ బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ బాల చాముండేశ్వరి అమ్మవారు మంగళవారం శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని కనులారా దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## యూరియా కట్టలు పంపిణీ



పెదకూరపాడు, సెప్టెంబర్ 30 ప్రభాత వార్త : మండలంలోని మునుగోడు సొసైటీ నందు మంగళవారం రైతులకు యూరియా బస్తాలు పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నాయకత్వంలో పిఏసిఎస్ ఛైర్మన్ ఎస్.నాగార్జున సూచనలతో కూటమి రైతులకు యూరియా బస్తాలను అందించారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భవిరెడ్డి వెంకటేశ్వర్లరావు తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడి ఆలయాల్లో ఘనంగా దుర్గాష్టమి

కారంపూడి, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: కారంపూడి మండలంలో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వీర్లఅంకాళమ్మ దేవాలయం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, దేవాలయాల వీధిలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయం, షిరిడిసాయి మందిరం, ఆర్యవైశ్య వీధిలో ఉన్న సత్యసాయి మందిరంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి దర్శించుకునేందుకు దేవాలయానికి తరలివచ్చారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాష్ఠాలగడ్డ వద్ద దుర్గమ్మ మండపంలో అమ్మవారి అలంకార దాతలుగా సీతారామయ్య ఉదితలక్ష్మి దంపతులు సహకరించారు. అలాగే మహిళా భక్తులచే లలితా సహస్రనామంతో కుంకుమపూజ కార్యక్రమం పండితులు దిలీప్‌కుమార్ ఆచార్యులు, రామానుజాచార్యులు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



## వైకాపా అభివృద్ధికి కృషి చేస్తా: పండ్ల మంగయ్య



విజయపురిసౌత్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నివిధాలా అభివృద్ధికి కృషి చేస్తానని మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన వైసీపీ నేత పండ్ల మంగయ్య (మనోజ్) అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తన సేవలను, కృషిని గుర్తించి మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వాలంటీర్ విభాగం జాయింట్ సెక్రటరీగా తనను పార్టీ అధిష్టానం నియమించడం జరిగిందన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తానన్నారు. తన నియామకంపై పార్టీ పెద్దలకు, వైసీపీ శ్రేణులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రూ.11.14లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడు తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలంలో మంగళవారం 17మందికి రూ.11,14,729పంపిణీ చేశారు. పాతరెడ్డి పాలెం గ్రామానికి చెందిన పొదిలి నరసింహారావుకు రూ.30వేలు, కారుమూరి మరియదాసుకు రూ.44,641, నారాకోడూరు గ్రామానికి చెందిన తాటి శంకరరావుకు రూ.85,020, వూసికర్ల సతీష్‌బాబుకు రూ.35,350, వేజండ్ల గ్రామానికి చెందిన షేక్ నూరుద్దీన్‌కు రూ.67,800, మహబూబ్ జానీకి రూ.1,13,980, షేక్ నూర్జహాన్‌కు రూ.42,362, కామినేని అచ్చమ్మకు రూ.20,524, సుద్దపల్లి గ్రామానికి చెందిన ఆళ్ళ అచ్చయ్యకు రూ.1,06,756, మట్టుపల్లి వెంకటరత్నంకు రూ.1,05,000, మైలా బాజీబాబుకు రూ.51,404, వడ్లమూడి గ్రామానికి చెందిన షేక్ గోహర్‌జాన్‌కు రూ.25,574, శలపాడు గ్రామానికి చెందిన ఏమినేని హేమలతకు రూ.43,900, సెగ్గం నాగజ్యోతికి రూ.1,02,102, గుమ్మడిదల సాంబయ్యకు రూ.54,258చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు టిడిపి అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.



## కనువిందు చేస్తున్న విశాలాక్షి అమ్మవారి అలంకరణ



పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: అతి పురాతనమైన సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువై వున్న శ్రీ కాశీ విశాలాక్షి అమ్మవారికి మంగళవారం దుర్గాదేవి అలంకరణ నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి నిమ్మకాయలతో తయారు చేసిన గజమాల భక్తులను విశేషంగా ఆకట్టుకొంది. భక్తులపేరున గోత్రనామార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. అసిస్టెంట్ కమిషనర్ గాండ్ల కామేశ్వరమ్మ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.

## స్వీయ పరిశీలన-స్వీయ అభివృద్ధికి ప్రతీక !

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: చదరంగం అనేది స్వీయపరిశీలన, స్వీయ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను మంగళవారం ఆయన తిలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని మాట్లాడుతూ చదరంగం ఆడడం వల్ల మెదడుకు పదును పెట్టుకోవడంతోపాటు సమస్య పరిష్కారంలో తక్షణ నిర్ణయాలు తీసుకోవడం, ముందుగానే ప్రత్యర్థి ఆలోచనలను అంచనా వేయడం, అనుకోని పరిస్థితుల్లో ప్రశాంతంగా ఆలోచించడం వంటి గుణాలు మనలో పెరుగుతాయన్నారు. ఈ ఆట మనకు ఒక కదలికకు పది ఫలితాలు అనే దృక్పథాన్ని నేర్పుతుందన్నారు. మనకు మనమే సవాలు విసురుకోవడం, ప్రతిదాన్ని కొత్త కోణంలో చూడటం, ఎప్పటికప్పుడు మెరుగవ్వడం.....ఈ ఆటలో నిజమైన విజయానికి మార్గమన్నారు. అందుకే చదరంగాన్ని బ్రెయిన్ గేమ్ అని కూడా అంటారు. చదరంగం ఆటకు ప్రత్యేకత ఏమిటంటే, ఎవరితోనూ పోల్చుకునే అవసరం లేదు. ప్రతి ఆటగాడు తనకంటూ ప్రత్యేకమైన శైలి, తనదైన ఆలోచనలా విధానం కలిగి ఉంటాడని తెలిపారు. ఎవరితో పోల్చుకోవాల్సిన అవసరం లేదు కానీ మనలోని ప్రతిభకు పదును పెట్టుకోవాలి. ఇదే చదరంగం ఇచ్చే అసలు సందేశమన్నారు. చదరంగం ఆడినవారు ఏ రంగంలోనైనా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడంలో, ప్రతికూలతలను ఎదర్కొనే ధైర్యంలో, కొత్త మార్గాలు అన్వేషించే తత్వంలో ముందుంటారని చెప్పారు. ఏపి నుంచి మొట్టమొదటి ఇంటర్నేషనల్ మాస్టర్ లంకా రవి మాట్లాడుతూ చదరంగం అనేది ఒక మేధోక్రీడ మాత్రమే కాకుండా, అనేక గుణాలను, అనేక నైపుణ్యాలను నేర్పే వేదికని చెప్పారు. ఇందులో అన్ని విషయాలపై దృష్టి కేంద్రీకరించడం, ఏకాగ్రతను పెంచుకోవడం అత్యంత అవసరమన్నారు.చదరంగం ఒక ఆట మాత్రమే కాదని, అది ఒక జీవన పాఠమని చెప్పారు. ప్రతి ఆట ఒక కొత్త అనుభవం, ప్రతి తప్పు ఒక కొత్త పాఠమని, క్రీడాకారులు ఎప్పుడూ సంతృప్తి చెందకుండా, మరింత నేర్చుకోవాలనే ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు అతిథులతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.




## యూరియా మీ చెంతకు-కూటమి నాయకులు

పొన్నూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త: ఇటీవల కాలంలో ఎరువుల కొరతతో అల్లాడుతున్న రైతున్నలకు కూటమి ప్రభుత్వం యూరియా సరఫరాను సులభతరం చేసేందుకు యూరియా మీ చెంతకు అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. యూరియా నిల్వలను లారీలలో, ట్రాక్టర్లలో తీసుకొచ్చి వార్డుల్లో ఒకచోట చేర్చి రైతులకు కూటమి నాయకుల ద్వారా అందజేస్తుంది. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ ఇటీవల యూరియా ప్రతి రైతుకు అందాలని వ్యవసాయాధికారులను ఆదేశించడంతో అధికారులు ఎరువుల నిల్వలను పెంచారు. దీంతో ప్రతి ఒక్కరికీ యూరియాను అందించేందుకు రైతు చెంతకే యూరియాను తెచ్చి విక్రయిస్తున్నారు. జనసేన పార్టీ నాయకుడు యన్నం నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు ఆదేశాల మేరకు 29,30,31వార్డుల పరిధిలోని రైతులకు ఎరువులను అందించడం జరిగిందన్నారు. పచ్చలతాడిపర్రు సొసైటీ డైరెక్టర్ యర్రాగోపుల గోపి, యన్నం నాయకుడు, దేశింశెట్టి సూర్య, దాసరి విజయ్‌కుమార్, మిరియాల చంద్రకాంత్, తదితరులున్నారు.



# వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్-1బి వీసాల్లో మార్పులు

## అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్




**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** హెచ్-1బి వీసాల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్-1బి వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైమ్ లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకునే వారికే అమలు చేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. '2026 నుంచి ఈ ప్రక్రియ అంతా అమలులోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయి' అని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చే వారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హెచ్-1బి కోసం ప్రస్తుతం ఉన్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతన స్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

వీసాలపై అమెరికా కాంగ్రెస్‌లో మరో బిల్లు..

హెచ్-1బి, ఎల్-1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యుఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సెనెటర్లు చక్‌గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరకట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

# అమెరికా ఆనాడు యుద్ధం వద్దని ఒత్తిడి తెచ్చింది..

## కేంద్ర మాజీ హోంమంత్రి చిదంబరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 26/11 ముంబై ఉగ్రదాడులపై కేంద్ర హోం శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక సమాచారాన్ని వెల్లడించారు. ముంబై దాడుల అనంతరం తాను కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు తీసుకోవడం నుంచి పాక్‌పై ప్రతిదాడికి అడ్డుపడిన పరిస్థితులను ఆయన ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ముంబై ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌పై సైనిక చర్యకు ఆలోచించినప్పటికీ అంతర్జాతీయ ఒత్తిడులు, ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన ఒత్తిళ్ల కారణంగా ఆ నిర్ణయం నిలిచిపోయిందని చెప్పారు. అప్పట్లో పాకిస్థాన్‌పై దాడి చేయాలని తన మనసులో ఉందని, అయితే సైనిక చర్యకు దిగరాదని యూపీఏ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ముంబై ఉగ్రదాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే కేంద్ర హోం మంత్రిగా పి.చిదంబరం బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ప్రపంచం అంతా యుద్ధం ప్రారంభించవద్దని చెప్పడానికి ఢిల్లీకి వస్తోందని, నాటి అమెరికా విదేశాంగ కార్యదర్శి కండోలిజా రైస్ ప్రత్యేకంగా తనను, ప్రధానిని కలిసేందుకు ఢిల్లీకి వచ్చారని చెప్పారు. యుద్ధంపై ముందుకు వెళ్లొద్దని తమను కోరారని వెల్లడించారు. పాకిస్థాన్‌కు బదులు చెప్పాలని తన మనసులో ఉందని, దీనిపై ప్రధానమంత్రి, ఇతర ముఖ్య వ్యక్తులతో చర్చించానని చెప్పారు. అయితే భౌతికంగా కాకుండా దౌత్యమార్గాలను ఉపయోగించాలని చివరికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. చిదంబరం వ్యాఖ్యలపై బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందించారు. ముంబై దాడుల అనంతరం హోం మంత్రి భాధ్యతలు తీసుకునేందుకు తొలుత చిదంబరం నిరాకరించారని, పాకిస్థాన్‌పై మిలటరీ చర్యను ఆయన కోరుకున్నప్పటికీ ఆయనపై ఇతరులు విజయం సాధించారని అన్నారు. పాక్‌పై ప్రతీకార చర్యలను కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీ అడ్డుకున్నారా, ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అడ్డుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. యూపీఏ ప్రభుత్వంపై కండోలిజా రైస్ ప్రభావం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. 2008 నవంబర్ 8న ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు చెందిన 10 మంది పాక్ ఉగ్రవాదులు ముంబైలోని పలు కీలక ప్రాంతాల్లో ఒకేసారిదాడులకు దిగారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ రైల్వే స్టేషన్, ఒబెరాయ్ ట్రిడెంట్, తాజ్ మహల్ ప్యాలెస్ అండ్ టవర్ హోటల్, కామా ఆసుపత్రి, నారిమన్ హౌస్‌లపై విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 175 మంది ప్రాణాలు కోల్పోగా, 308 మంది గాయపడ్డారు. లష్కరే ఉగ్రవాది అజ్మల్ కసబ్ ఒక్కరే ముంబై పోలీసులకు పట్టుబడగా, 2012లో అతన్ని ఉరితీశారు.

# భారత్ జిసిసిలవైపు అమెరికా కంపెనీల ఫోకస్

## వర్క్‌ఫ్రం ఇండియా అంటున్న టెక్ దిగ్గజాలు

## ట్రంప్ హెచ్1బి వీసా ఫీజుల భారం

**బెంగళూరు,సెప్టెంబరు 30:** అమెరికా అధ్యక్షుడు వీసా ఫీజులు ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెంచడంతో ఇపుడు అమెరికా సంస్థలన్నీ కూడా భారత్‌కేంద్రంగా పనులను షిఫ్ట్‌చేసే ఆలోచనలో పడ్డాయి. అమెరికా టెక్ సంస్థలు ఇతరబహుళ జాతి సంస్థలన్నీ కూడా భారత్‌లో అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు (జిసిసి)లు భారత్ కేంద్రంగా ఉండటంతో వీసా భారం అధిగమించేందుకు క్లిష్టమైన ప్రాజెక్టులన్నింటినీ భారత్‌కు తరలించడమే మేలని భావిస్తున్నాయి. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన భారత్‌లో 1700కిపైగా జిసిసిలున్నాయి. అంటే ప్రపంచం మొత్తం ఉన్న సంస్థల్లో 50శాతానికిపైగా భారత్‌లోనే ఉన్నాయి. లగ్జరీ కార్ డిజైన్లు, డ్యాష్ బోర్డులనుంచి ఔషధాల అన్వేషణవరకూ వీటిల్లోనే జరుగుతోంది. కృత్రిమమేధ, వీసాలపై ఆంక్షలు పెరుగుతుండటంతో అమెరికా సంస్థలు తమ కొలువుల వ్యూహాలను మారుస్తున్నాయి. భారత్‌లోని జిసిసిలతో కలిసి పనులుచేసుకోవాలని చూస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలున్న జిసిసిలతో తమ పనులు చక్కబెట్టుకోవచ్చునిచూస్తున్నాయి. వీసా పెంపుభారంతో ఇపుడు అమెరికాలోని అనేక సంస్థలు తమ వర్క్‌ఫోర్స్ అవసరాలను పునఃసమీక్ష చేస్తున్నాయి. ఐదువేల డాలర్లకు మించిలేని వీసా ఫీజులు ఒకేసారి లక్షడాలర్లకు పెంచడంవల్ల నైపుణ్యం ఉన్న వర్కర్లు లభించడం కష్టంగా మారుతోంది. హెచ్‌వన్‌బి, ఎల్‌వన్ వర్క్ వీసాలకు సంబంధించి కఠిన ఆంక్షలతో కూడిన వీసా బిల్లును సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో అనేక లొసుగులు ఉన్నాయని, అవి యాజమాన్యాలకు మేలుచేస్తున్నాయని, అమెరికన్లకు నష్టం కలుగుతోందని చెపుతున్నారు. వీటిన్నింటినీ గమనిస్తున్న అమెరికా సంస్థలు హైఎండ్ పనులు అన్నీ ఎఐతో ముడిపెడుతున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, అనలిటిక్స్ వంటి వాటిని ఇండియా జిసిసిలకు తరలిస్తున్నారు.

# ప్రతీకారం నాపై తీర్చుకోండి..పార్టీ నేతలపై కాదు..

## ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ ఎదుర్కోలేదు..

## త్వరలోనే బాధితులను పరామర్శిస్తా: టివికె చీఫ్ విజయ్



**చెన్నై,సెప్టెంబరు 30:** కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని టీవీకే అధినేత, నటుడు విజయ్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోలేదన్నారు. తన మనసు పూర్తిగా బాధతో నిండిపోయినట్లు ఆయన చెప్పారు. కరూర్ తొక్కిసలాట ఘటన జరిగిన రెండురోజుల తర్వాత టీవీకే అధినేత, నటుడు విజయ్ తొలిసారి స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డీఎంకే సర్కార్ తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చున్నారు. తమ పార్టీ నేతలను టార్గెట్ చేయొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టీవీకే నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరూర్ ఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. నాపై అమిత ప్రేమతో ప్రజలు ర్యాలీకి వచ్చారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. త్వరలోనే కరూర్ వెళ్లి బాధితులను పరామర్శిస్తాను. వాస్తవానికి మేము ఏ తప్పు చేయకపోయినా, మాపై కేసులు పెట్టారు. నిజం త్వరలోనే బయటపడుతుందన్నారు. సీఎం స్టాలిన్ మాపై ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నారా కావాలంటే నాపై ప్రతీకారం తీర్చుకోవచ్చు. నాపై కోపం, మా నాయకులపై చూపించవద్దు.ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటూ టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా మథియాళన్, కార్యకర్త పౌన్‌రాజ్, యూట్యూబర్ ఫెలిక్స్ జెరాల్డ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిపై హత్యాయత్నం, ప్రజా భద్రతకు ముప్పు కలిగించడం సహా పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. మరోవైపు విజయ్ ఉద్దేశపూర్వక రాజకీయ బలప్రదర్శన వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

# బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు




## తుది ఓటరు జాబితా విడుదల చేసిన ఎన్నికల కమిషన్

## ముసాయిదా కంటే 18 లక్షల మంది ఓటర్లు అధికం

## అక్టోబరు 6-7 తేదీలో ఎన్నికల షెడ్యూల్?

## నవంబర్ 5-15 మధ్య మూడు దశల్లో పోలింగ్?

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడుతున్న వేళ బీహార్‌లో ఎంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న తరుణంలో తుది ఓటరు జాబితా విడుదలైంది. దీంతో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ ముగిసింది. మంగళవారం విడుదలైన తుది జాబితా ప్రకారం, బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఆగస్టు 1న విడుదల చేసిన ముసాయిదా జాబితా (7.24 కోట్లు)తో పోలిస్తే ఓటర్ల సంఖ్య 18 లక్షలు పెరిగింది. అదే జూన్ 24నాటికి ఎస్ఐఆర్ ప్రకటించిన నాటికి బీహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. ముసాయిదా జాబితాతో పోలిస్తే వాస్తవంగా 21.53 లక్షలు అదనంగా ఉన్నారని అధికారులు తెలిపారు. కానీ 3.66 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు ఫారాలను నింపారు కానీ, గుర్తింపు పత్రాలు సమర్పించలేదు.దీంతో వారి పేర్లను తొలగించారు. దీంతో ముసాయిదా జాబితా కంటే 18 లక్షల మంది ఓటర్లు పెరిగారు.జూన్ 24కి ముందు బీహార్‌లో మొత్తం 7.89 కోట్ల మంది ఓటర్లు. ఆగస్టు 1న ఈసీ విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 7.24 కోట్ల మంది ఓటర్లున్నారు. అంటే దాదాపు 65 మంది లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించింది. ఇక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్ 6-7 తేదీల్లో విడుదలయ్యేఅవకాశముందని ఈసీ వర్గాలు తెలిపాయి. 3-4 తేదీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బీహార్‌లో పర్యటించనున్నారు. ఆ తర్వాత షెడ్యూల్ విడుదల కానుంది. నవంబర్ 5 నుంచి 15 తేదీల మధ్య మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ ఉంటుందని అధికార వర్గాల సమాచారం.ప్రస్తుత బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22న ముగియనుంది. అంటే, అంతకు ముందే ఎన్నికల ప్రక్రియ ముగించాల్సి ఉన్నందున అధికారుల ఆ మేరకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

# ఇడి విచారణకు ఊర్వశి రౌతేలా




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో సినీనటి ఊర్వశి రౌతేలా ఈడీ విచారణకు హాజరయ్యారు. మంగళవారం ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఊర్వశి రౌతేలా, విచారణ అధికారుల ముందు హాజరై, పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేసే సమయంలో భారత గేమింగ్, ఆర్థిక చట్టాల గురించి తెలియదా? ప్రమోషన్ చేయడం వల్ల పారితోషకం ఎంత తీసుకున్నారు? ఏ రూపంలో ఎంతెంత అందుకున్నారు? అంటూ సినీ నటిపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానమిచ్చానని, విచారణ అనంతరం ఊర్వశి రౌతేలా మీడియాతో మాటాడుతూ వెల్లడించారు. ఆర్థికపరమైన అంశాలతోపాటు ప్రమోషన్స్‌కు సంబంధించిన అంశాలపైనే ప్రశ్నించారని సినీనటి పేర్కొన్నారు.



# జీవాయుధ ముప్పను సైతం ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

## సిడిఎస్ అనిల్‌చౌహాన్ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** మానవులు సృష్టించిన జీవ ఆయుధాల వల్ల భవిష్యత్తులో సహజంగా లేదా ప్రమాదవశాత్తు ముప్పు పెరగొచ్చని భారతదేశ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్ ) జనరల్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. అణ్వాయుధాల నుంచి వెలువడే రేడియో కాలుష్యంతోనూ గండం పొంచి ఉండొచ్చన్నారు. కరోనా (కొవిడ్) మహమ్మారిని ఎదుర్కొనే క్రమంలో యావత్ ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొందని ఆయన గుర్తు చేశారు. ఫ్యూచర్‌లో జీవ ఆయుధాల ముప్పును, అణ్వాయుధాల రేడియో కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు భారత సైనిక దళాలు రక్షణపరమైన సన్నద్ధతతో ఉండాలని పిలుపునిచ్చారు. మిలిటరీ నర్సింగ్ సర్వీస్ శత వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని మానిక్‌షా సెంటర్‌లో నిర్వహించిన శాస్త్రీయ చర్చా కార్యక్రమంలో అనిల్ చౌహాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్రాల్వకూ వెరువని భారత్‌ను సిద్ధం చేద్దామని జీవ ఆయుధాలతో దాడి జరిగినప్పుడు, అణ్వాయుధాల నుంచి రేడియో కాలుష్యం వ్యాపించినప్పుడు ఎలా స్పందించాలి ఆ రెండు రకాల ముప్పులను ఎదుర్కోవాలి వాటి వల్ల ఇన్ఫెక్షన్ బారినపడే వారికి ఎలాంటి ప్రాథమిక చికిత్స, అత్యవసర చికిత్స అందించాలి అనే సమాచారంతో నిర్దిష్టమైన చికిత్సా విధానాలను మనం ఇప్పుడే సిద్ధం చేసుకోవాలన్నారు.ఆపరేషన్ సిందూర్ ముగిసిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఒక విషయాన్ని క్లియర్‌గా చెప్పారు. న్యూక్లియర్ బెదిరింపులకు భారత్ భయపడదని ఆయన తేల్చి చెప్పారు.



## అబార్షన్ చేయించుకోమన్నాడని

# బాయ్‌ఫ్రెండ్ పీకకోసిన యువతి

**రాయ్‌పూర్, సెప్టెంబరు 30:** చత్తీస్‌ఘడ్‌లో దారుణమైన హత్య జరిగింది. గర్భం దాల్చిన ఓ మైనర్ అమ్మాయి తన బాయ్‌ఫ్రెండ్‌ను కత్తితో గొంతుకోసి చంపేసింది. ఈ ఘటన రాయ్‌పూర్‌లోని ఏవన్ లాడ్జిలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం బిలాస్‌పూర్‌కు చెందిన 16 ఏళ్ల నిందితురాలు ఈనెల 28వ తేదీన తన బాయ్‌ఫ్రెండ్ మొహమ్మద్ సద్దాంను కలిసేందుకు రాయ్‌పూర్ వెళ్లింది. బీహార్‌కు చెందిన ఎంఎస్ ఇంజినీరింగ్ ఆఫీసర్ అయిన బాధిత వ్యక్తితో కలిసి లాడ్జిలో గడిపింది. ప్రెగ్నెంట్ అయిన ఆ మైనర్‌పై బాధిత వ్యక్తి వత్తిడి తెచ్చాడు. అబార్షన్ చేయించుకోవాలని ఆమెపై ప్రెజర్ పెట్టాడు. దీంతో లాడ్జి బయట ఇద్దరి మధ్య ఆ రోజు గొడవ జరిగింది. కత్తితో చంపేస్తానని బెదిరించాడతను. అయితే ఆ రోజు రాత్రి లాడ్జి రూమ్‌లో సద్దాం నిద్రిస్తున్న సమయంలో అతడు బెదిరించిన కత్తితోనే అతని గొంతు కోసేసిందామె. ఆ తర్వాత రూమ్‌ను బయటి నుంచి లాక్ చేసి సద్దాం మొబైల్ ఫోన్‌తో పరారీ అయ్యింది. లాడ్జి రూమ్ తాళంచెవులను సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద పడేసింది. మరుసటి రోజు బిలాస్‌పూర్‌లో స్వంత ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన నేరం గురించి ఆ మైనర్ తన తల్లికి చెప్పింది. కోని పోలీసు స్టేషన్‌కు వెళ్లి నిందితురాలి తల్లి మర్డర్ గురించి ఫిర్యాదు చేసింది. ఏవన్ లాడ్జికి వెళ్లిన రాయ్‌పూర్ పోలీసులు.. అక్కడ నిర్జీవంగా పడి ఉన్న సద్దాం మృతదేహాన్ని వెలికితీశారు. బీహార్‌లో ఉన్న సద్దాం ఫ్యామిలీతో కాంటాక్టు అవుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత వ్యక్తికి చెందిన ఫోన్ తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. కేసు రిజిస్టర్ చేసి మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ అమ్మాయి మూడు నెలల గర్భిణి అని తెలిసింది. అబార్షన్ చేయించుకోవాలన్న ఇష్టం లేదని ఆ అమ్మాయి పేర్కొన్నది. పెళ్లి చేసుకోవాలని లేదని, గర్భస్రావం చేయించుకోవాలని సద్దాం వత్తిడి చేసినట్లు విచారణలో వెల్లడైంది. చివరకు ఆమె బాయ్‌ఫ్రెండ్ ప్రాణాలు తీసింది.



# లడఖ్ ప్రజలను మోసగించిన ప్రధాని మోడీ

## రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేసారు. హింసా రాజకీయాలను ఆపాలని విన్నవించారు. ఇటీవల లేహ్‌లో నలుగురు ప్రాణాలను బలిగొన్న హింసపై న్యాయపరమైన విచారణను జరిపించాలన్నారు. కాల్పుల్లో మరణించిన బాధితుల్లో ఒకరు సైనికుల కుటుంబానికి చెందినవారని రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడే వారి రక్తం దేశభక్తితో ప్రవహిస్తుంది. అయినప్పటికీ, లద్దాఖ్‌తోపాటు అతడి హక్కుల కోసం నిలబడినందుకు బీజేపి ప్రభుత్వం దేశ ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. ఈ రోజు దేశానికి సేవ చేసినందుకు లభించే ప్రతిఫలమా?'అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో విమర్శించారు. "లద్దాఖ్‌లో జరిగిన హత్యలపై న్యాయ విచారణ జరగాలని దోషులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలి అనేది మా డిమాండ్ అన్నారు. మోడీ జీ, మీరు లద్దాఖ్ ప్రజలను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. లద్దాఖ్ ప్రజలు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారని, అందుకు వారితో చర్చించాలని కోరారు. హింస, భయ రాజకీ యాలను ఆపాలని అన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 24న లేహ్‌లో నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. స్థానిక బీజేపీ కార్యాలయానికి నిప్పు పెట్టారు. ఈ ఘర్షణల్లో నలుగురు మరణించారు. అయితే లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని, ఆ ప్రాంతాన్ని ఆరో షెడ్యూలు పరిధిలో చేర్చాలని కోరడంతో పాటు పలు డిమాండ్ల సాధన కోసం సాగుతున్న ఉద్యమం ఇటీవల హింసాత్మకంగా మారాయి.

## ఇంగ్లీషు రాయడం రాయని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్




**సిమ్లా, సెప్టెంబరు 30:** అతడొక ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్. కానీ థౌజెండ్ స్పెల్లింగ్ రాయరాదు. హండ్రెడ్ స్పెల్లింగ్ రాదు. సిక్స్‌కు సిక్స్‌టీన్‌కు తేడా తెలియదు. కనీసం సెవెన్ స్పెల్లింగ్ కూడా చక్కగా రాయడం రాలేదు. ఆయన రూ.7,616ను (సావెన్ థర్స్‌డే సిక్స్ హరేంద్ర సిక్స్ రూపీస్ ఓన్లీ) అని రాశాడు. ఈ చెక్కు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఓ ప్రభుత్వ స్కూల్ ప్రిన్సిపాల్ మిడ్‌డే మీల్ వర్కర్స్‌కు ఇవ్వాల్సిన నగదుకు సంబంధించి రూ.7,616 చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులో నగదుకు సంబంధించి ఇంగ్లిష్‌లో అన్నీ తప్పులే రాశాడు. దాంతో బ్యాంకు అధికారులు స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నాయంటూ ఆ చెక్కును నగదుగా మార్చకుండా రిజక్ట్ చేశారు. ఆ చెక్కును సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది. నెటిజన్‌ల నుంచి రకరకాల కామెంట్స్ వస్తున్నాయి.

## బిజెపి సీనియర్‌నేత సంజయ్‌కుమార్ మల్హోత్రా కన్నుమూత



విజయ్ కుమార్ మల్హోత్రా(ఫైల్)

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా మంగళవారం ఉదయం తన 94వ ఏట కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా వయసు సంబంధిత సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్ లో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం ప్రాణాలు కోల్పోయినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆయన మరణవార్తను ఎక్స్ వేదికగా తెలిపారు. మల్హోత్రా జీవితం మొత్తం దేశానికి, ప్రజలకు అంకితం అయినదని అన్నారు. అది ఆయన నిరాడంబరతకు, ప్రజా సేవకు నిదర్శనమని కూడా సచ్‌దేవా తెలిపారు. జనసంఘ్ రోజుల నుంచి ఆయన ఢిల్లీలో పార్టీ సిద్ధాంతాలను విస్తరించడానికి అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు ఆయన మృతి పట్ల ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేశారు. మల్హోత్రా చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

# సంక్షిప్తంగా..

## పాకిస్థాన్‌లో భారీ పేలుడు, కాల్పులు..

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 30:** పాకిస్థాన్‌లోని క్వెట్టా ప్రాంతం భారీ పేలుడుతో దద్దరిల్లింది. అక్కడే కాల్పుల మోత వినిపించింది. ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ భద్రతా సిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో పేలుళ్ల ఘటన జరిగింది. దాంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు,భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గరలోని ఆస్పత్రులను తరలించారు. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 13 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

## కూలిన స్కూల్ భవనం:శిథిలాల కింద 65 మంది విద్యార్థులు



**జకార్తా, సెప్టెంబరు 30:** ఇండోనేసియాలో నిర్మాణంలో ఉన్న ఓపాఠశాల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల్లో చిక్కుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం జావాలోని సిడోర్జో పట్టణంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల ఇస్లామిక్ పాఠశాల భవనం సోమవారం కుప్పకూలింది. మధ్యాహ్న సమయంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాఠశాల భవనంలో ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో భవనం కూలిపోవడంతో స్థానికులు 79 మంది విద్యార్థులను రక్షించారు. ఇంకా దాదాపు 65 మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. విద్యార్థులంతా 12 నుంచి 17 యేళ్లలోపు ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనా స్థలంకలో విద్యార్థుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. శిథిలాలలో చిక్కుకొన్న విద్యార్థుల సంఖ్యను నిర్ధారించడానికి పోలీసులు పాఠశాల అధికారుల సాయం తీసుకుంటున్నట్లు సమాచారం.

## ఇజ్రాయెల్ గాజా యుద్ధం ముగింపు స్వాగతిస్తున్నాం: ప్రధాని మోడీ



**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు కీలక ముందడుగు పడిన విషయం తెలిసిందే. గాజాలో యుద్ధం ముగింపునకు ట్రంప్ సూచించిన 20 సూత్రాల శాంతి ఫార్ములాకు ఇజ్రాయెల్ అంగీకరించింది. ట్రంప్ ప్లాన్‌ను పలు దేశాలు స్వాగతిస్తున్నాయి. తాజాగా గాజాపై ట్రంప్ ప్రణాళికను భారత్ కూడా స్వాగతించింది. గాజాలో యుద్ధం ముగించేందుకు ట్రంప్ చేసిన ప్రణాళికను స్వాగతిస్తున్నట్లు ప్రధాన మంత్రి మోడీ తెలిపారు. ట్రంప్ ప్రణాళిక పశ్చిమాసియాలో దీర్ఘకాలిక శాంతికి మార్గమని పేర్కొన్నారు. యుద్ధం ముగించి శాంతిని నెల కొల్పే ఈ ప్రయత్నానికి అందరూ మద్దతు ఇస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్టు వైరల్ అవుతోంది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే.

## మంత్రి బాలాజీని అరెస్టు చేయాలంటూ టివికె కార్యకర్త ఆత్మహత్య

**విల్లుపురం(తమిళనాడు),సెప్టెంబరు 30:** తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ జిల్లాలో టీవీకే ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటన రాజకీయపరంగా తీవ్ర దుమారం రేపుతోంది. విల్లుపురం జిల్లాకు చెందిన అయ్యప్పన్ (51) టీవీకే పార్టీలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం తన వృద్ధ తల్లిదండ్రులను చూసేందుకని మైలం గ్రామానికి వెళ్లారు. అయితే, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన ఆయన తల్లి మునియమ్మల్ చుట్టుపక్కల వారికి సమాచారం అందించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయ్యప్పన్ గదిలో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. అందులో పార్టీ చీఫ్ విజయ్ ప్రచారం సందర్భంగా 41 మంది ప్రాణాలు కోల్పోయిన కరూర్ తొక్కిసలాటకు డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీ, పోలీసులే కారణమని అయ్యప్పన్ సూసైడ్ నోట్‌లో రాశారు.

1-10pg6exHMNWJQEP 10_1-10pg6exHMNWJQEP.qxd 9/30/2025 11:59 PM Page 1



# తిరుమల సమాచారం

## చంద్రప్రభపై 'సర్వజగద్రక్షకుడు'



**తిరుమల,సెప్టెంబరు30 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరునికి అత్యంత వేడుకగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో మంగళవారం రాత్రి చంద్రప్రభవాహనంపై సర్వజగద్రక్షకుడు భక్తులను కరుణించాడు. శ్రీవారికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన శ్రీనివాసుడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతోకూడిన వాహనంపై విహరించాడు. చంద్రుడు భగవంతుని మారు రూపమే. గీతాచార్యుడు తాను చుక్కలలో చంద్రుడని తెలియజేశాడు. రసస్వరూపుడైన చంద్రుడై భగవానుడు ఓషధులను పోషిస్తు న్నాడని అర్థం. చల్లనిదేవరప్రభతో శ్రీమలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. వాహనమండపం వద్ద వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని చంద్రప్రభవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి 7గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డుసభ్యులు శాంతారాం, దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, తిరుపతి జిల్లాఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## సూర్యప్రభపై శ్రీమన్నారాయణుడు

**తిరుమల,సెప్టెంబరు30 ప్రభాతవార్తప్రతినిధి:** సూర్య భగవానుడు సకలరోగనివారకుడు, ఆరోగ్యకారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. సప్తగిరులపై అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం సప్తఅశ్వాలు లాగుతున్నట్లుగా రూపొందించిన సూర్యప్రభవాహ నంపై చేతిలో గత,మరోచేతిలో బాణం ధరించి భక్తులకు అభయమిచ్చాడు. సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్తుడై దివ్యకిరణకాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులనుఆరోగ్యవంతుల్నిచేస్తూ దర్శనమిచ్చాడు. చంద్రుడుకూడా సూర్యతేజంవల్లనే ప్రకా శిస్తూ వృద్ధి పొందుతున్నారు. సూర్యప్రభవాహనం పై వచ్చిన బద్రీనారాయణుడిని దర్శించుకున్న భక్తులకు ఇతోధిక బోగభాగ్యాలు



,సత్సంతానసంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. **శాస్త్రోక్తంగా రెండోస్నపన తిరుమంజనం:** ఏడుకొండలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు మంగళవారం మధ్యాహ్నం 1గంట నుండి 3గంటలవరకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి విశేష స్నపనతిరుమంజనం జరిగింది.

## భక్తితో బంగారుగొడుగు ఊరేగింపు



**తిరుమల,సెప్టెంబరు 30 ప్రభాతవార్తప్రతినిధి:** బంగారుదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు బుధవారం (నేటి)ఉదయం జరిగే రథోత్సవానికి పైన బంగారుగొడుగు అలంకరించడం సాంప్రదాయం. ఈ గొడుగునుకల్యాణకట్ట మిరాశీదారులు అందజేస్తారు. మంగళవారం సాయంత్రం ఈ గొడుగు ఊరేగింపు కల్యాణకట్ట వద్దనుండి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ ప్రత్యేక పూజలుచేశారు. మిరాశీదారులు పంతులుగారి రామనాధమ్ ,వంశస్థులు, కల్యాణకట్ట డిప్యూటీ ఈఓ వెంకటయ్య,సివిఎస్‌ఓ మురళీకృష్ణ తదితరులు ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అధికారులకు అందజేశారు.

## రేపటి 'చక్రస్నానమహోత్సవం'కు సకల ఏర్పాట్లు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సప్తగిరుల్లో వెలసిన శ్రీనివాసుడికి జరుగుతున్న తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాల వైభవం గురువారం అక్టోబర్ 2వతేదీ రేపు ఉదయంతో ముగింపుకుచేరుకోనుంది. బ్రహ్మోత్సవాల్లో చివరివాహనంగా రేపురాత్రి అశ్వవాహనంకాగా ,చివరి ఘట్టంగా చక్రస్నానమహోత్సవం శాస్త్రోక్తంగా జరుగుతుంది. చక్రత్తాళ్వార్‌కు జరిగే ఈ పవిత్ర కార్యక్రమం ఆలయానికి పక్కనేవున్న శ్రీవరాహస్వామి ఆలయంకు ఆనుకుని వున్న పుష్కరిణిలో జరుగుతుంది. గురువారం ఉదయం 6గంటల నుండి 9గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం ముందు శ్రీమలయప్పస్వామివారికి ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు,పెరుగు, నెయ్యి,తేనె కొబ్బరిజలం ఇత్యాది పవిత్రసుగంధద్రవ్యాలతో ఈ అభిషేకం చేస్తారు.



ధూపదీపాలతోస్వామివారు ప్రసన్నుడవుతాడు. చక్రస్నా సమయంలో భక్తులు,అర్చకులు, అధికారులు అందరూ పవిత్ర స్నానం చేస్తారు. ఇప్పటికే టిటిడి అధికారులు టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్,జెఈఓ వీరబ్రహ్మం, సిఐ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, పోలీసు యంత్రాంగం పుష్కరిణి వద్ద గట్టి ఏర్పాట్లు చేసింది. ఆదివారం రాత్రి గరుడసేవ విజయవంతం తరహాలోనే చక్రస్నానం విజయవంతంగా నిర్వహించనున్నారు.

## కట్టెదురా వైకుంఠము ..కాణాచైన కొండ

### వాహనసేవల ముందు ఆడెదరదివో అప్సరసలు...



**తిరుమల,సెప్టెంబరు 30ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామివారికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజూ కళాకారులు రకరకాల ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. స్వామివారి సేవలో అప్సరసలే ఆనాడు పాలసముద్రంలో శ్రీమహావిష్ణువును తమ నాట్యభంగిమలతో ప్రసన్నంచేసుకున్నారు. ఈ రీతిలో తిరుమలలో దేశంనలుమూలల నుండి వచ్చిన కళాకారులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. స్వామివారి చెంత తమ ప్రదర్శనలతో ఆనందపరవశులవుతున్నారు. ఒకరేమిటి వందలసంఖ్యలో నిష్ణాతులైన కళాకారులు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశ్శా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుండి విచ్చేసి రోజువారీగా జరిగే ఆయా వాహనసేవలకు అనుగుణంగా తమతమ నైపుణ్యాలనుప్రదర్శిస్తున్నారు. మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనసేవలో 20కళాబృందాలు 490మందికి పైగా కళాకారులు కూడా తమతమ రీతిలో విద్యార్థులు కూడా సూర్యమండలంలాగా దుస్తులు ధరించి నృత్యాలు చేశారు.

## విద్యుత్ హై టెన్షన్ టవర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

### కర్ణాటక కడూరుకు చెందిన శివానిగా గుర్తించిన పోలీసులు

**రేణిగుంట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం గురవరాజు పల్లె సబ్ స్టేషన్ సమీప పొలాల్లోని 220 కె.వి హై టెన్షన్ విద్యుత్ టవర్ పై నుండి పడి మంగళవారం కర్ణాటక రాష్ట్రం కడూరుకు చెందిన శివాని మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం కడూరు కు చెందిన శివాని తన బావ మిత్రులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. శ్రీవారి దర్శనానంతరం వీరంతా తిరుగు ప్రయాణం కోసం రేణిగుంట రైల్వే స్టేషన్ చేరుకున్నారు. స్టేషన్ బయటకు వెళ్లి మద్యం సేవించి వస్తానని బంధువులకు చెప్పి వెళ్ళాడు. అతను ఎక్కాల్సిన ట్రైన్ వెళ్లిపోవడంతో ట్రైన్ ఎక్కలేకపోయాడు. బంధువులకు ట్రైన్ మిస్ అయిందని చరవాణి ద్వారా చెప్పడంతో వేరే ట్రైన్‌లో రావాలని వారు చెప్పినట్లు సమాచారం. అయితే స్టేషన్ రెండవ వైపు నుండి బయటకు వచ్చిన శివాని తిన్నగా గురవరాజు పల్లె చేరుకొని మద్యం మత్తులో అక్కడున్న హై టెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కాడని అందరూ అంటున్నారు. స్థానికులు అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని అతనిని స్తంభం పై నుండి దిగాల్సిందిగా కోరారు.

ఎట్టకేలకు పైనుండి కిందికి దూకాడు. పోలీసులు హుటాహుటిన అతనిని దగ్గర్లోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ కు తరలించినా అతని ప్రాణాలు నిలువలేదు. రేణిగుంట పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

# ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

## కూటమినేతలకు సిఎం చంద్రబాబు సూచన



**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం చేసే సంక్షేమం.అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఎన్డీఏ పక్షాలకు ఆదేశాలు జారీ చేసారు. కూటమిలోని టీడీపీ ,జెఎస్పీ, బిజెపి ఈ విషయంలో వ్యూహాత్మక కార్యాచరణ చేపట్టాలన్నారు.కూటమి నేతలతో సిఎం చంద్రబాబు ఢిల్లీ నుంచి మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నేతలకు దిశా నిర్దేశం చేశారు జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ ప్రచారం, పెన్షన్లు, విద్యుత్ సమర్థ నిర్వహణ వంటి అంశాలపై కీలక ఆదేశాలు ఇచ్చారు. చేసిన పనులను ప్రజలకు చెప్పుకున్నప్పుడే.. ప్రజల్లో ప్రభుత్వం పట్ల పాజిటివిటీ పెరుగుతుందని అన్నారు. ప్రజలతో మమేకం కావడమే కాదు.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలి. ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలే పార్టీకి ప్రతినిధులు. అని అన్నారు. పార్టీకి ప్రతినిధుల్లాంటి వారు తమ వ్యవహార శైలితో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచింది. అయితే కూటమి ప్రభుత్వం ట్రూ డౌన్ పేరుతో విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం దన్నారు. పీక్ లోడ్ లో కరెంట్ కొనుగోలు చేయకుండా స్వాపింగ్ విధానాన్ని అనుసరించాం. దీంతో తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. సోలార్, విండ్ వంటి సాంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తిపై ఫోకస్ పెట్టాం. సమర్థ పాలనకు.. అసమర్థ పాలనకు ఉన్న తేడాలను ప్రజలకు వివరించాలని సిఎం అన్నారు. జనాభాలో 13 శాతం మందికి పెన్షన్ల ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నాం.. అతి పెద్దదైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కూడా పెన్షన్ల నిమిత్తం కేవలం రూ.5.500 కోట్లు మాత్రమే ఇస్తున్నారని సిఎం తెలిపారు. ఏపీలోని కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.33 వేల కోట్లకు పైగా నిధుల్ని పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తోంది. ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేలు ఇస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ధర్మవరం అభివృద్ధి నా లక్ష్యం: మంత్రి సత్యకుమార్



**అనంతపురం, సెప్టెంబరు 30 ప్రభాతవార్త బ్యూరో:** ప్రతి గ్రామం, ప్రతి పట్టణము అభివృద్ధి దిశలో ముందుండాలని, ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధి నా లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నింటినీ వేగవంతంగా పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. ఇప్పటికే జరుగుతున్న రహదారుల పనుల పురోగతిని సమీక్షించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యతతో పనులు చేయాలని ఆదేశించారు. అలాగే పారిశుద్ధం, మురుగునీటి పారుదల, మంచినీటి సరఫరా, ప్రజారోగ్యం వంటి అంశాలపై సవివరంగా విచారించారు. పట్టణంలో చెత్త సేకరణ, డ్రైనేజ్ వ్యవస్థ మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, బిజెపి రాష్ట్రకార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, మంత్రినియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు, మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదు వేల గుడులకు నిధులు భక్తులవే

### రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**నెల్లూరు, సెప్టెంబరు 30, ప్రభాతవార్త-వైద్యం:** రాష్ట్రంలో నిర్మించబోయే ఐదు వేల గుడులకు సంబంధించిన నిధులు భక్తుల నుండి వచ్చినవేనని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక మంత్రి వారి క్యాంపు కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల కాల పరిమితిలో రాష్ట్రంలోని దళిత గిరిజన వాడలలో 5 వేల గుడులు నిర్మించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో దేవాదాయ శాఖ మనుగడ కోల్పోయిందని మంత్రి ఆనం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేక దేవాలయాల్లో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరిగాన్నారు. భగవంతునికి రక్షణ, భద్రత లేకుండా ఉండిందని ఆయన అభిప్రాయపడ్డారు. నేడు విజయవాడలో కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా వేల జ్యోతుల కాంతిలో విరాజిల్లుతుందని తెలిపారు. హిందూ ధర్మ మనోభావాలు దెబ్బతినకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. హిందూ ధర్మంతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడే విధంగా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని, దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆ దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. దూపదీప నైవేద్యాలకై సుమారు 5523 దేవాలయాలకు నెల పది వేల రూపాయలు చొప్పున నిధులు కేటాయించడం జరిగిందని, అదే విధంగా అర్చకులకు కూడా జీతం పెరుగుదల జరిగిందన్నారు. వేద అధ్యాయం చేసిన వేద విద్యార్థులకు నెలకు సాంభావన కింద నెలకు 3వేల రూపాయలు చొప్పున దాదాపు 600 మందికి మూడు సంవత్సరాలు పాటు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

## చేయని తప్పుకు బలి చేశారు: సీనియర్ నటి హేమ



**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** చేయని తప్పుకి నన్ను బలి చేశారంటూ టాలీవుడ్ సీనియర్ నటి హేమ కన్నీరు పెట్టుకున్నారు. మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆ తర్వాత ఆమె మీడియాతో మాట్లాడుతూ కన్నీరు పెట్టుకున్నారు."ఈ రోజు దుర్గమ్మ దర్శనానికి వచ్చాను, ప్రతీ ఏడాది వస్తాను. అయితే, ఈ సంవత్సరం ఓ ప్రత్యేకత ఉంది. గత ఏడాది మీరందరూ నాపై వేసిన నీలప నిందలు దుర్గమ్మ తుడిచిపెట్టింది. నేను చేయని తప్పుకి మీరందరూ నన్ను బలి చేశారు. కొన్ని నెలల క్రితం బెంగుళూరులో రేవ్ పార్టీలో నటి హేమ కూడా పట్టుబడినట్లు అక్కడి పోలీసులు ప్రకటించారు.ఆ కథనం అప్పట్లో టాలీవుడ్‌లో తీవ్ర కలకలం రేపింది. అంతేకాదు, హేమ డ్రగ్స్ సేవించిందని, టెస్ట్ రిపోర్ట్ లో కూడా పాజిటివ్ గా వచ్చిందని పోలీసులు పేర్కొన్నారు. ఆమెకు నోటీసులు జారీ చేశారు. ఆ తర్వాత విచారణకు పిలిచి పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.ఆ తర్వాత హేమపై నమోదైన కేసులో కోర్టు స్టే విధిం చడంతో ఆమెకు ఊరట దక్కింది. ఈ విషయాన్నే హేమ ప్రస్తావిస్తూ ఆ సమయంలో నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చి ఈరోజు నన్ను గుడికి వచ్చేటట్టు ఆ దుర్గమ్మ చేసింది. ఆ సమయంలో నేను దాని నుండి బయటపడడం నావల్ల కాలేదు. ప్రతిక్షణం దుర్గమ్మ తల్లి నేనున్నాను నువ్వు ముందుకెళ్లు అని నన్ను బతికిచ్చింది. ఎన్ని జన్మలెత్తినా దుర్గమ్మ ఆశీస్సులు అండదండలు నేనుమర్చిపోలేను. దయచేసి మీరు ఏదైనా వార్త వేసేటప్పుడు నిజా నిజాలు తెలుసుకుని వేయండి అంటూ మీడియా ప్రతినిధులకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈరోజు నేను గుడిలో ఉండిచెప్తున్నాను. నేను ఈ తప్పుచేయలేదు అని హేమ మరోసారి స్పష్టం చేశారు.

## సీమ మీదుగా మరికొన్ని పండుగ ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** ప్రస్తుత పండుగల సమయంలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ రాయలసీమ జిల్లాల మీదుగా షోలాపూర్ ధర్మవరంషోలాపూర్,బెంగళూరు బీదర్ బెంగళూరుల మధ్య మరికొన్ని పండుగ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. షోలాపూర్ నుంచి ధర్మవరం వెళ్ళే నెంబర్ 01437 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ అక్టోబర్ 02న గురువారం రాత్రి 11 30 గంటలకు షోలాపూర్ నుంచి బయలుదేరి శనివారం తెల్లవారు జామున 0330 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ధర్మవరం నుంచి షోలాపూర్ వెళ్ళే నెంబర్ 01438 రైలు అక్టోబర్ 04న శనివారం ఉదయం 0630 గంటలకు ధర్మవరం నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 1030 గంటలకు షోలాపూర్ చేరుకుంటుంది. ఈరైళ్లు మార్గమధ్యంలో వికారాబాద్, యాద్గీర్,క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం, ఆదోని,గుంతకల్లు,గుత్తి,తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప,రాజంపేట,రేణిగుంట, తిరుపతి,పాకాల,పీలేరు, మదనపల్లె, మొలకలచెరువు,కదిరి స్టేషన్ లతో పాటు మహారాష్ట్రలోని ముఖ్యమైన స్టేషన్ లలో నిలుస్తాయి.

బీదర్‌బెంగళూరు ప్రత్యేక రైళ్లు: బీదర్ నుంచి బెంగళూరు కంటోన్మెంట్ వెళ్ళే నెంబర్ 07063 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు అక్టోబర్ 04న శనివారం మధ్యాహ్నం 0240 గంటలకు బీదర్ నుంచి బయలుదేరి, ఆదివారం ఉదయం 0500 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో బెంగళూరు కంటోన్మెంట్ నుంచి బీదర్ వెళ్ళే నెంబర్ 07064 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు అక్టోబర్ 05న ఆదివారం రాత్రి 1030 గంటలకు బెంగళూరు కంటోన్మెంట్ నుంచి బయలుదేరి, సోమవారం మధ్యాహ్నం 0240 గం టలకు బీదర్ చేరుకుంటుంది. ఈరైళ్లు మార్గమధ్యంలో యలహంక, హిందూపురం,ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని,మంత్రాలయం, రాయచూరు, క్రిష్ణా, యాద్గీర్, వాడి, షాహ బాద్,గుల్బర్గా,హుమ్నాబాద్ స్టేషన్ లలో నిలుస్తాయి.

## సియోల్‌లో లొట్టే గ్రూప్ ప్రతినిధులతో మంత్రులు భేటీ



**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ కొరియా రాజధాని సియోల్ లో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ లొట్టే సంస్థ ప్రతినిధులతో ఏపీ మంత్రులు పి. నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, ఉన్నతాధికారులు సమావేశమయ్యారు.ప్రపంచవ్యాప్తంగా ఫుడ్, రిటైల్, కెమికల్స్, అతిథ్యం వంటి రంగాలలో పెట్టుబడులు పెట్టే లొట్టే (Lotte) గ్రూప్‌లను ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని మంత్రులు ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం ఉందని లొట్టె గ్రూప్ ప్రతినిధులకు ఏపీ మంత్రులు వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి సానుకూల అంశాలను లొట్టే గ్రూప్ ప్రతినిధులకు మంత్రులు వివరించారు.అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నవంబర్ 14,15 తేదీల్లో విశాఖ వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 30 వ సిఐఐ భాగస్వామ్య సదస్సుకు లొట్టే సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఆంధ్రప్రదేశ్ లో సుస్థిర ప్రభుత్వంతో అభివృద్ధి దిశలో తొలి అడుగులు పడుతున్న వేళ వ్యూహాత్మక పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలపై మంత్రులు తెలిపారు.సమావేశంలో పాల్గొన్న అధికారులు ఎం.టీ.కృష్ణ బాబు, ఇండియన్ ఎంబసీ, ఈడీబీ అధికారులు పాల్గొన్నారు.

## తాడేపల్లి ప్యాలెస్‌కు విద్యా కానుక నిధులు:మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం విద్యా కానుక నిధుల్ని తాడేపల్లి ప్యాలెస్ పనుల కోసం వాడుకుందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. జగన్ ప్రభుత్వం విద్యార్థులకు పెండింగ్ పెట్టిన రూ.400 కోట్ల బకాయిలతో కలిపి మొత్తం రూ.1,788 కోట్ల బోధనా రుసుముల్ని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించిందన్నారు. పది లక్షల మందికి పైగా విద్యార్థులకు సర్టిఫికెట్లు విడుదల య్యేలా చూసిందని పేర్కొన్నారు. ఫీజుల కోసం కళాశాలలు విద్యార్థుల్ని ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మంగళగిరి లోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.'జగన్‌రెడ్డి రూ.2,382 కోట్ల బోధనా రుసుములు,రూ.989 కోట్ల వసతిదీవెన,రూ.450 కోట్ల ఫీజ్ భోధనా రుసుములు బకాయి పెట్టారు. ట్యాబ్‌ల పేరుతో నిధులు దారిమళ్ళించారు. వీటి మీద అసెంబ్లీలో చర్చకు రమ్మంటే పారిపోయారు' అని ధ్వజమెత్తారు. పాత ఫీజు రీయంబర్స్‌మెంట్ విధానం అమలు చేసి తల్లిదండ్రులపై భారాన్ని తగ్గించడమే కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యా ర్థులకు సిఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ అండగా నిలిచారన్నారు. ఇప్పటికే 10 లక్షల మందికి పైగా విద్యార్థుల సర్టిఫికెట్లు విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చామన్నారు.

## నవంబర్ నుంచి విద్యుత్ చార్జీల తగ్గింపు:సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 30.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు మేలు జరిగేలా కీలక అడుగు పడింది. దేశ చరిత్రలో తొలి సారి ట్రూడౌన్ తో విద్యుత్ చార్జీల భారం తగ్గిస్తున్నాం. ఈ నిర్ణయంతో నవంబర్ నుంచి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు తగ్గుతాయి అని చెప్పడానికి నేను సంతోషిస్తున్నానని సిఎం చంద్రబాబు తెలిపారు. 15 నెలల్లో విద్యుత్ వ్యవస్థల సమర్థ నిర్వహణతో వచ్చిన సత్ఫలితాల కారణంగానే ఈ ఘనత సాధించాం. ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ విధానం ద్వారా పీక్ డిమాండ్ ఉన్న సమయాల్లో అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్ల విధానానికి చెక్ పెట్టాం. స్వల్ప కాలిక కొనుగోళ్లలో ఎక్కువ రేటుకు విద్యుత్ కొనుగోలు చేసే అవసరం లేకుండా పవర్ స్వాపింగ్ ఉపయోగపడింది. పిఎం కుసుమ్ స్కీంలో భాగంగా రైతులకు సౌర విద్యుత్ ను ఉచితంగా అందిస్తున్నాం. పిఎం సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందుతోంది. ఈ పథకంలో బీసీ వినియోగదారులకు గరిష్టంగా రూ. 98 వేలు సబ్సిడీ ఇస్తున్నాం.యూనిట్ కు 13 పైసలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.



కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మకు జ్ఞాపికను అందిస్తున్న విజయవాడ ఉత్సవ్ నిర్వహకులు

## రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతం విజయవాడ

### కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ

**విజయవాడ, సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతంగా విజయవాడ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ వేడుకలకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విజయవాడ చరిత్రకు అద్భుతమైన ఘట్టానికి తెరదీసిన వ్యక్తి ఎంపీ కేశినేని శివనాథ్" అని ప్రశంసించారు. మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ విజయవాడకు గొప్ప చరిత్ర ఉంది. కృష్ణమ్మ చెంత వెలసిన అమ్మవారితో పాటు దేశంలో రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతంగా ఈ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది."నవరాత్రుల సందర్భంలో ఇక్కడి అమ్మవారి సాక్షిగా ఇలాంటి ఉత్సవాలు ఇప్పటివరకు జరగకపోవడం ఆశ్చర్యకరం. దసరా సందర్భంగా మైసూరు, కలకత్తా ఉత్సవాలను చూసేందుకు ప్రజలు దేశం నలుమూలల నుంచి వెళ్తారు. ఇకపై విజయవాడ కూడా ఆ స్థాయిలో ఉత్సవాలకు వేదిక కావాలన్నారు. చాలా తక్కువ సమయంలో ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌ను అభినందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ విజయవాడకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని విజయవాడ ఉత్సవ్ వంటి వేదికల ద్వారా దేశం మొత్తం ఎదుట ప్రదర్శించాలన్నది నా లక్ష్యమన్నారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ నవరాత్రి సందర్భంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్, కేవలం వినోదం మాత్రమే కాకుండా ప్రజల ఐక్యతకు ప్రతీక అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి అంటే విజయవాడే గుర్తొస్తుంది

### ప్రగతి సంకల్పానికి ఇలాంటి ఉత్సవాలే ప్రేరణ

### విజయవాడ ఉత్సవ్‌లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు




**విజయవాడ,సెప్టెంబరు 30,ప్రభాతవార్తప్రతినిధి:** విజయ దశమి' అనగానే మైసూరు,కోల్‌కత్తా గురించి మాట్లాడుకుంటాం. ఈ 11 రోజుల ఉత్సవ్ పూర్తయ్యాక దేశంలో ఎక్కడైనా విజయదశమి ప్రస్తావన వస్తే విజయవాడ గురించి మాట్లాడుకునే స్థాయిలో నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడైనా దసరా ఉత్సవాలు చేయాలంటే విజయవాడ ఉత్సవాలే నమూనాగా నిలుస్తాయి. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు జరగాలంటే మానవ,దైవ సంకల్పాలు మమేకం కావాలి' అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉత్సవాల 8వ రోజైన విజయవాడ ఉత్సవ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అంతరించిపోతున్న కళలకు జీవం పోయడమే ఉత్సవ్‌కు గొప్ప విజయం .శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మొదలు అనంతపురం వరకు అన్ని ప్రాంతాల కళల పరిరక్షణ, కళాకారులను గౌరవించడమే కేంద్ర బిందువుగా కార్యక్రమం జరుగుతోంది. ఉత్సవ్‌లో హెలిరైడ్ ద్వారా నా ప్రాతినిథ్యం కూడా ఉన్నందుకు ఆనందంగా ఉంది. డ్రోన్ ప్రదర్శన చూస్తే నాకు గతంలో ఇదే పున్నమి ఘాట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించిన డ్రోన్ సమ్మిట్ గుర్తొస్తోంది. ఈ విజయదశమి మెగా కార్నివాల్ వాక్ కార్యక్రమంతో మరో గిన్నిస్ రికార్డు సాధిస్తాం' అని రామ్మోహన్‌నాయుడు చెప్పారు. రాజధాని ఏర్పాటు కావాలన్నా,రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కేవలం సిఎం చంద్రాబు విజన్‌తో 24 గంటలూ పని చేస్తే సరిపోదు.రాష్ట్రం లోని 5 కోట్ల మంది ఆంధ్రులు కలిసి వస్తేనే సాధ్యమవుతుంది. ముఖ్యమంత్రి చాలా పెద్ద లక్ష్యాలు పెడుతున్నారు కదా అవి చేరుకోవడం సాధ్యమవుతుందా అనుకోవచ్చు. దానికి ఈ ఉత్సవమే పెద్ద సమాధానం. ప్రగతి సంకల్పానికి ఇలాంటివే ప్రేరణ.అభివృద్ధి అటే భవిష్యత్తుకు సంబంధించే కాదు, మన కళలు,సాంప్రదా యాలు, ఆచారాలు, చరిత్రను కాపాడుకోవడం కూడా. ఉపరాష్ట్రపతిని ఈ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు వెళితే నేను ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి తిరుపతి రావాలనుకున్నాను. అమ్మవారి నుంచి ఆహ్వానం వస్తే రాకుండా ఎందుకు ఉంటానంటూ ముందు విజయవాడే వచ్చారు'అని పేర్కొన్నారు.

1-10P g7exHMNWJQEC 11_1-10P g7exHMNWJQEC.qxd 9/30/2025 11:51 PM Page 1



# నిజరూపంతో దుర్గమ్మ అనుగ్రహం

- విజయవాడంతా ఉత్సవాల శోభ
- 98వేల మంది భక్తులకు దర్శనం
- భవానీలకు ప్రాధాన్యం: కలెక్టర్ లక్ష్మీషా
- వేదసభలో వేదనాదాలతో ఆధ్యాత్మిక శోభ



**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మవారు నిజ రూపంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం 5 గంటలకు 98 వేలమంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నట్లు ఇఒ. వికె శీనా నాయక్ తెలిపారు. రూ. 40లక్షల ఆదాయం సమకూరిందన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భవానీ మాలధారులకు మరింత ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ లక్ష్మీషా తెలిపారు. నగరవ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలతో తావులేకుండా భద్రత కల్పించే చర్యలు తీసుకున్నామన్నారు. దుర్గమ్మ వారి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులను ఓలలాడించాయి.

### వేదసభలో వేదనాదం

ఆలయంలో మంగళవారం జరిగిన వేదసభలో వేదనాదంతో ప్రాంగణ మంతా మార్మోగింది. వేదపండితులు చతుర్వేదాలను శ్రీ అమ్మవారి సన్నిధిలో పఠిస్తుంటే ఆలయమంతా ఆధ్యాత్మిక ఆనందం వెల్లివిరిసింది. 450 మంది వేదపండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వైభవంగా నగరోత్సవం

సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో విహరిస్తు శ్రీ స్వామి అమ్మవార్ల భక్తులను కటాక్షించారు. కమిషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు. దుర్గమ్మవారిని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి హరిజవహర్‌లాల్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు దంపతులు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు, తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.



వేదసభ నిర్వహిస్తున్న దృశ్యం



## సిద్ధిధాత్రి అలంకరణలో జ్ఞాన ప్రసూనాంబ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నవమి, మంగళవారం రావటంతో శక్తి ఆలయాలు కిటకిట లాడాయి. వివిధ ఆలయాల్లో అలంకారాలు ఆకటుకుంటున్నాయి. మహిళలు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో ఆకట్టుకుంది. బొమ్మల కొలువులో సిద్దిదాత్రి దేవిగా దర్శనమిచ్చారు. కనకాచలంపై వెలసిన దుర్గమ్మకు మహిషాసుర మర్ధిని అలంకరణ చేసి, అభిషేకాలు జరిపారు.



## భక్తిశ్రద్ధలతో శివయ్య ఆయుధ పూజ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా భక్తి శ్రద్ధలతో ఆయుధ పూజల్ని నిర్వహించారు. ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి దంపతులు హాజరు కాగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి పర్య వేక్షణలో కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు సంబంధం, కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదపండితులు విశ్వనాధ్ శర్మ, అవినాష్ శర్మ, శ్రీనివాస్‌శర్మ, శివప్రసాద్ అర్ధగిరి, డిప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒలు విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూ షణం, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## మణిద్వీప మహాసంస్థానంలో వైభవంగా నవరాత్రి పూజలు

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 30 ప్రభాత వార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహాసంస్థానంలో దేవి నవరాత్రి పూజలు అత్యంత వైభవంగా ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయే శ్వరీ దేవి నిర్వహిస్తున్నారు. దేవి నవరాత్రి ఉత్సవాలలో 9వ రోజైన మంగళవారం ఉదయం 5 గంటలకు గర్భాలయంలోని శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిలకు, శ్రీ మహాగణపతి, శ్రీ సుబ్ర మణ్యేశ్వరల స్వాములకు ఆశ్రమ వ్యవస్థాపకరాలు భగవతి కరుణామయి శ్రీశ్రీశ్రీ విజయే శ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, మహా మంగళహారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రుల ప్రాముఖ్యతను అనుగ్రహ బాషణం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ముగ్గరమ్మలను దర్శించుకున్నారు.

## పాఠశాలలకు లక్ష నోట్ పుస్తకాలు విరాళం

**విజయవాడ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పథకానికి హైదరాబాద్‌కు చెందిన కేఎల్ఎస్ఆర్ ఇన్ ఫ్రాటెక్ లిమిటెడ్ సుమారు రూ.40 లక్షల విలువైన లక్ష నోట్ పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేయనున్నారు. ఈ మేరకు నోట్ పుస్తకాల పంపిణీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. పుస్తకాల ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్‌తో పాటు కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా టెక్ లిమిటెడ్ ఎండీ కేఎల్ శ్రీధర్ రెడ్డి, డైరెక్టర్ కే.ప్రీతమ్ రెడ్డి, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో కొత్త నిబంధనలు

- కూలీలకు ఇ-కెవైసి, ఆధార్ లింక్
- చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా నేటి నుంచి అమలు

**కుప్పం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** వలసల నివారణ, పేదలకు ఉపాధి కల్పించే నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న విషయం విదితమే. ఈ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల అమలుకు ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్తూరు, కర్నూలు జిల్లాలు ఈ నూతన నిబంధనల అమలు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికయ్యాయి. అక్టోబర్ 1 నుంచి ఈ కొత్త నిబంధనలు ఈ రెండు జిల్లాల్లో అమలవుతాయి. తదనంతరం అన్ని జిల్లాల్లో అమలుచేస్తారు. ప్రధాన ంగా ఈ పథకంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సంబంధించి ఇ-కెవైసి తీసుకుని వారి ఆధార్ కార్డుతో లి ంక్‌చేస్తారు. తద్వారా ఎవరైతే ఇకెవైసి చేయించుకున్నారో ఆయా కూలీలు మా త్రమే క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాల్సి ఉ ంటుంది. తద్వారా జాబ్‌కార్డులు పొందిన, ఇ కెవైసి చేయించుకున్న కూలీలే పనులు చేపడతారు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది. ఒకరి బదులు మరొకరు కూలీలుగా పనిచేసే అవకాశం ఉండదు. ఇందుకు ఉపాధి యాప్ కూడా అంగీకరించదు. అలా వచ్చి పనులు చేసేవారికి కూలీనగదు చెల్లించరు. రాష్ట్రంలో సుమారు 70లక్షలకు పైగా ఉపాధి కూలీలకు జాబ్‌కార్డులు ఇదివరకే మంజూరు చేశారని సమాచారం. అయితే జాబ్ కార్డులు పొందిన కూలీలంతా పలుచోట్ల పనులకు హాజరు కావడం లేదని ప్రభుత్వాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనల అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో బుధవారం నుంచి చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో ఈ నిబంధనలను అధికారులు అమలు చేయనున్నారు.



## పండుగ బట్టలు కొని తిరిగివెళ్తూ...

### ఆటోను ఢీకొన్న బియ్యం లారీ ముగ్గురు దుర్మరణం

**పత్తికొండ, సెప్టెంబరు 30 ప్రభాత వార్త:** కర్నూలు జిల్లా పత్తికొండలో ఆగి ఉన్న ఆటోను వెనుక నుండి బియ్యం లారీ ఢీ కొంది. దీంతో ముక్కెళ్ళ గ్రామానికి చెందిన భూమిక (36), శిరీష(65), నిఖిత(3) మృతి చెందారు. మంగళవారం పత్తికొండలో పండుగ బట్టలు, సరుకులు తీసుకొని స్వగ్రామం ముక్కెళ్ళకు వెళ్ళడానికి ఆటోలో కూర్చున్నారు. ఇంతలో ఆ ఆటోని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కళ్ళ ముందరే ఘటన చోటుచేసుకోవడం, ముగ్గురు మృతి చెందిన వార్త దావానంలా గ్రామానికి చేరడంతో విషాదఛాయలు అలుము కున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజాస్వామ్యాన్ని ఈసీ పరిరక్షించాలి

**అనంతపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త బ్యూరో:** కేంద్ర ఎన్నికల కమిషన్ పార దర్శకంగా, జవాబుదారీతనంగా మెలగాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి, రాజకీయాలతో భాగస్వామ్యం కాకూడదని జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అభిప్రాయ పడ్డారు. మంగళవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ పనితీరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కె.అల్తాఫ్ అధ్యక్షత వహించగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి, జెవివి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ నాయక్, ఇస్మాయిల్, జైభారత్ సంస్థ నాయకులు కుల్లాయప్ప అతిథులుగా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థ అనేక ఆరోపణలు ఎదుర్కొంటూ అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. తద్వారా నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక లాంటి పరిణామాలను భవిష్యత్తులో చవిచూసే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు సాంబశివుడు, సుబ్బరాయుడు, టివి రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐక్యవేదిక నాయకులు సాకే హరి, ఒపిడిఆర్ నాయకులు జి.సి. ప్రకాష్, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్, చంద్రప్ప, రాందాసు, లక్ష్మి, ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ శంకర్ గౌడ్, భీమన్న, బయపరెడ్డి, తరిమెల రాజు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, టి.యన్.రసూల్, కవులు షేక్ రియాజుద్దీన్, డాక్టర్ అంకె రామలింగయ్య, ఫణిభూషణ్, రోగప్ప పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

**విజయవాడ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంగళవారం ఆ ఉద్యోగుల సంచాలకులు ఎమ్. శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని జెఎసి నేతలు గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శిని కోరామని, ప్రభుత్వం తరఫున గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శి సానుకూలంగా స్పందించారని శివప్రసాద్ తెలిపారు. ప్రభుత్వం సానుకూల దృక్పథాన్ని అనుసరించి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరూ తమ విధులకు హాజరై ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకము లేకుండా సక్రమంగా నిర్వహించాలని కోరారు.

## శ్రీదుర్గమ్మ భక్తులకు అలుపెరగని సేవలు

**విజయవాడ, సెప్టెంబరు 30 ప్రభాతవార్త ప్రతినిధి:** బెజవాడ ఇంద్రకీలాద్రి దసరా నవరాత్రులలో అమ్మవారి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులకు అవసరమైన సేవలందించడానికి దేవస్థానం, జిల్లా యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పలు ఏర్పాట్లు చేశాయి. చిన్నారులకు వేడి పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. రద్దీగా ఉండే క్యూలైన్లలో ప్రతి ఒక్కరికి అందేలా విశేష కృషి చేస్తున్నారు. మొదటి ఎనిమిది రోజులలో 1,75,000 బిస్కెట్ ప్యాకెట్లను, మూడు లక్షల అరవై వేల మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. 6,600 లీటర్ల పాలను 70 వేల కప్పుల ద్వారా భక్తులకు అందించారు. భక్తులకు 8 రోజులలో 35 లక్షల మంచినీటి సీసాలు పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు దర్శనంలో ఇబ్బందులు కలగకుండా బ్యాటరీ కార్లు, చక్రాల కుర్చీలు ఏర్పాటు చేశారు. అధికార యంత్రాంగంతో పాటు వందలాది మంది సేవకులు స్వచ్ఛందంగా రేయింబవళ్లు భక్తులకు సేవలందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చైర్మన్‌గా ఉండే రెడ్ క్రాస్ సంస్థ రోజుకు మూడు షిఫ్టుల్లో వృద్ధులకు, దివ్యాంగులకు సేవలందిస్తోంది. అటు పోలీసు యంత్రాంగం "సేవాదళ్" పేరిట ఒక బృందాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సాయపడుతోంది. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ భక్తులకు పాలు అందించడంలో చురుకైన పాత్ర పోషిస్తోంది. లిటిల్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థకు చెందిన "శక్తి సేవ" వాలంటీర్లు దేవాలయంలోని వివిధ విభాగాలలో సేవలందిస్తున్నారు. నగరపాలక సంస్థ కు చెందిన 1490 మంది పారిశుద్ధ్య కార్మికులు వివిధ ప్రాంతాలలో సేవలందిస్తున్నారు. దేవాలయ ప్రాంగణంలోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుతూ భక్తుల మన్ననలు పొందుతున్నారు. రేయింబవళ్లు అలుపెరగకుండా అందిస్తున్న సేవలపై భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



## ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు హోంమంత్రి అనిత క్లాస్!

**విజయనగరం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లా చింతలవలసలోని 5వ బెటాలియన్ సమీపంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను హోంమంత్రి వంగలపూడి అనిత గమనించారు. తన కాన్వాయ్‌ను అక్కడే ఆపించి, మైనర్లను సుతిమెత్తగా మందలించారు. వాహనాలను చట్టవిరుద్ధంగా మైనర్లకు ఇవ్వడం నేరమని గుర్తు చేసిన హోంమంత్రి, ఈ ఘటనను తల్లిదండ్రులకు తెలియజేయాలంటూ పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ వాహనాలను నడిపే వయస్సు రాకముందే పిల్లలకు స్కూటీలు, బైకులు ఇవ్వడం వల్ల వారు తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారన్నారు. ఇది కేవలం ఒకరి వ్యక్తిగత సమస్య కాదని, సమాజంలోని రహదారి భద్రతకు ముప్పుగా మారుతుందని ఆమె వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో చట్ట నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆమె సూచించారు.

## పూజల కోసం తిరుణ్ణామలైకు వెళ్తే రక్షకభటులే కాటేశారు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు యువతులు తిరుణ్ణామలై(అరుణాచలం)లో వెలసిన అగ్నిలింగం దర్శనానికి వెళ్ళినారు. అక్కడ ఇద్దరు కానిస్టేబుల్స్ వారిని అటకాయించి అత్యాచారానికి పాల్పడినట్లు మంగళవారం సాయంత్రం తిరుపతి జిల్లా ఎస్‌పికి కూడా సమాచారం అందినట్లు తెలిసింది. ఆ యువతులు శ్రీకాళహస్తికి చెందిన వారుగా భావిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల తిరుణ్ణామలైకు పౌర్ణమి సందర్భంగానే కాకుండా సాధారణ రోజుల్లో కూడా తిరుపతి జిల్లా నుంచి తండోపతండాలుగా మహిళా భక్తులు తరలి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి చెందిన తల్లి, కూతురు తిరుణ్ణామలై ఆలయానికి వెళ్ళి వారిని గస్తీలో ఉన్న కానిస్టేబుల్స్ సురేష్‌రాజ్, సుందర్‌లు వారిని భయపెట్టి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం అందింది. బాధిత మహిళలు స్థానిక పోలీస్ స్టేషన్‌కెళ్లి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సమాచారం. అత్యాచారానికి పాల్పడిన కానిస్టేబుల్స్‌ను అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. బాధితురాళ్లను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. ఈ సంఘటనకు సంబంధించి వేలూరు సారాకా డిఐజి, తిరుణ్ణామలై ఎస్‌పి సుధాకర్, అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ సతీష్ ఆస్పత్రికి వెళ్ళి బాధితురాల నుంచి వివరాలు సేకరించారు. ఈ సంఘటనను తమిళనాడు పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రేమికుడి ఎదుటే మైనర్‌పై గ్యాంగ్ రేప్



అత్యాచారం కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ సాయినాథ్

**చిత్తూరు, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం చిత్తూరు మురకంబట్టుకు సమీపంలోని నగరవనంలో ఓ మైనర్‌పై ముగ్గురు యువకులు అత్యాచారం చేశారు. ప్రేమికుడి ఎదుటే మైనర్ బాలికను బెదిరించి ఒకరి తరువాత ఒకరు అత్యాచారం చేశారు. ఈ ఘటన సెప్టెంబర్ 25వ తేదీ జరుగగా బాధితురాలి ప్రేమికుడు సోమవారం చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెలుగు చూసింది. ముగ్గురు నిందితులపై ఎస్ఐ మల్లికార్జున్ పోక్సో, ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా వున్నాయి. ప్రేమికులు సెప్టెంబర్ 25న నగరవనంలో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడుతున్న సమయంలో అక్కడికి మురకంబట్టుకు చెందిన మహేష్, కిషోర్, సంతపేటకు చెందిన హేమంత్‌కుమార్‌లు వచ్చి తాము ఇక్కడ ఫారెస్ట్ సిబ్బంది అని ఇక్కడ మీరెం చేస్తున్నారని ఆ ప్రేమికులను బెదిరించారు. వారి వద్ద వున్న విలువైన వస్తువులను లాక్కున్నారు. మేడం పిలుస్తున్నారు రమ్మని యువకుడిని అందులో ఒకరు తీసుకెళ్ళారు. ఒంటరిగా వున్న మైనర్ బాలికపై ఇద్దరు యువకులు బెదిరించి అత్యాచారం చేశారు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన యువకుడు అత్యాచారం చేశాడు. ఈ విషయంను బాధితురాలు ప్రేమికుడు తన గ్రామస్తులకు తెలిపాడు. ఈ ఘటన పాల్పడిన ముగ్గురిని వదలకూడదని నిర్ణయించిన గ్రామస్తులు నందనవనం పార్కుపై నిఘా ముమ్మరం చేశారు. అత్యాచారంకు పాల్పడిన ఇద్దరు యువకులు సోమవారం పార్కు పరిసరాల్లో కన్పించడంతో గ్రామస్తులు వారిపై దాడి చేశారు. అటు మైనర్ ప్రేమికుడు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పూర్వపరాలు విచారించడంతో మైనర్‌పై అత్యాచారం వెలుగు చూసింది. ఈ మేరకు చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర్, చిత్తూరు వెస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలింపులు చేపట్టారు.

BAJAJ FINSERV

బంగారు ఆభరణాల వేలం కోసం దిన పత్రిక ప్రకటన
బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి-పూణె రోడ్డు, అకుర్ది, పూణె - 411035

గోల్డ్ లోన్ పొందే సమయంలో, ఆయా రుణ ఖాతాలలో మరియు రుణ మొత్తాన్ని చెల్లించలేకపోయిన డీఫాల్టర్స్ లేదా కావలసిన లాభాన్ని కేటాయించడంలో విఫలమైనవారు, నోటీసులను పునరావృతంచేసినా కూడా రుణగ్రహీతలుచే సెక్యూరిటీగా ఉంచబడిన గోల్డ్ జ్యువెలరీ "యథాతథంగా" మరియు "ఎక్కడైతే మరియు ఎలా ఉందో దాని ఆధారంగా" వేలం వేయబడుతుందని ఇందుమూలముగా బీఎఫ్ఎల్ సంబంధిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియచేస్తోంది. బిడ్డర్స్ ఈ క్రింది నియమాలను అనుసరించాలని అభ్యర్థిస్తున్నాము:

(a) ప్రకటన గురించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి (లోన్, జ్యువెలరీ, స్థూల బరువు, ప్రదేశం మరియు వేలం వేసే తేదీ) ప్రక్కన ఉన్న QR కోడ్ స్కాన్ చేయాలి;
(b) ఈ ప్రకటనకు సంబంధించిన బిడ్డర్ నియమాలు, షరతులు గురించి పూర్తిగా చదవడానికి ("నియమాలు & షరతులు") వెబ్‌లింక్ http://172.30.1.235:3000/?WOUB2QG9WU పై క్లిక్ చేయాలి;
(c) నియమాలు & షరతులు అర్థం చేసుకోవడానికి, తదుపరి ధరావతు సొమ్ము రూ.25,000/- ను వేలం వేసే తేదీ నాడు లేదా అంతకు ముందు ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్/బజాజ్ గోల్డ్ ఆక్షన్ యాప్) ద్వారా డిపాజిట్ చేయడానికి;
(d) ఉదయం 10 గంటలకు వేలం వేసే వేదిక వద్దకు వ్యక్తిగతంగా హాజరవ్వాలి; మరియు
(e) వేలం వేసే వేదిక వద్దకు తమ చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామాను తీసుకురావాలి.
(f) వేలం వేసే వేదిక వద్ద తమ చెల్లుబాటయ్యే గుర్తింపు మరియు చిరునామా ప్రూఫ్ తీసుకువెళ్లాలి వేలం వేసే తేదీ నాడు మధ్యాహ్నం 12 గంటలు తరువాత వేలం వేసే ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్స్ అనుమతించబడరు.
(g) ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) చెల్లింపు తరువాత కూడా నిర్దేశించబడిన టైమ్ పరిమితి లోగా పాల్గొనని బిడ్డర్స్ ను తిరస్కరించడానికి లేదా అనుమతించడానికి బ్రాంచ్ మేనేజర్/వేలందారుకు హక్కు గలదు.

నన్ను స్కాన్ చేయండి

వేదికలో మరియు వేలం వేసే తేదీలో ఏవైనా మార్పులు ఉంటే, వేలం వేసే వేదిక వద్ద ప్రదర్శించబడతాయి. మీరు బిడ్ సమర్పించడం పైన చెప్పిన నియమాలను మీరు ఆమోదించినట్లుగా భావించబడుతుంది. ప్రజా వేలం సేల్‌ను రద్దు చేయడం/ఆపు చేయడం చేసినట్లయితే బీఎఫ్ఎల్ రుణగ్రహీత (లు) యొక్క విషయంలో కూడా ప్రైవేట్ సేల్ ద్వారా జ్యువెలరీని విక్రయించే హక్కు బీఎఫ్ఎల్ కు ఉంది. మీకు ఏవైనా సందేహాలు ఉంటే మీరు మమ్మల్ని ఈ మెయిల్ ఐడీ పై సంప్రదించవచ్చు - gold.auction@bajajfinserv.in


(10-11-25) అనకపల్లి - భార్గవి ప్లాజా; PBV8SGL13561572, 13713176, 13757381. అనంతపూర్ - కల్యాణ్‌దుర్గ్ రోడ్; PIV9SGL13757728, 13779448. అనంతపూర్ - సుభాష్ రోడ్; PGA7SGL13406290, 13442827, 13575962, 13605135, 13619241, 13697610, 13696490, 13716691, 13776279. బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్; PJU6SGL13460343, 13639577, 13657187. బొబ్బిలి - పెద్ద బజార్ మైన్ రోడ్; PKI4SGL13801625. చీరాల - సంత బజార్; PEJ9SGL13409515, 13639464, 13822429. (11-11-25) గుడివాడ - బిజిఎల్; P563SGL11932377, 11936008, 12037615, 13648715, 13742738, 13776421. హిందూపూర్ - ధన లక్ష్మి రోడ్; PEG4SGL13442241, 13441837, 13477937, 13496762, 13504858, 13547682, 13548520, 13550063, 13597433, 13624907, 13658771, 13773270, 13801425. జంగారెడ్డిగూడెమ్ - ఏలూరు మైన్ రోడ్; PGH1SGL13774788. కదిరి - ఎన్‌టీఆర్ సర్కిల్; PIW8SGL13492348, 13617920. మదనపల్లె - ఎన్‌టీఆర్ సర్కిల్; PEG6SGL13404838, 13458566, 13542860, 13543131, 13683429. నందిగామ - మైన్ రోడ్; PLN1SGL13695757, 13827422, 13822422. నంద్యాల్ - శ్రీనివాస్ నగర్; PEO1SGL13696981, 13774587. (12-11-25): కడప - భాగ్యనగర్ కాలోనీ; PGA9SGL13784626. కాకినాడ - జగన్నాయిక్‌పూర్; PBW1SGL13405421. నరసారావుపేట్ - అరుండేల్ పేట్; PEO2SGL13542493. నర్సీపట్నం - మైన్ రోడ్; PIW7SGL13463951, 13807683. నెల్లూర్ - బీజీఎల్; P468SGL13715174. నెల్లూర్ - కనకమహల్ సెంటర్; P19ISGL13406782, 13629581. నెల్లూర్ - నవాబ్‌పేట్; PXB4SGL13550900, 13631174, 13618891, 13679720, 13721478, 13746284, 13816778. నెల్లూర్ - వేదయపాలెం; PXB5SGL13441144, 13581927. నెల్లూర్ అద్దంకి - బస్ స్టాండ్ సెంటర్; PEJ8SGL13409099, 13441346, 13530779, 13662459, 13698294. (13-11-25): పీలేరు - కడప రోడ్; PEG3SGL13443632. పొన్నూర్ - బస్ స్టాండ్; PLN2SGL13542945, 13746962. రైల్వే - కోడూరు నేతాజీ రోడ్; PGC5SGL13426577, 13574140, 13620135, 13619044, 13676214, 13739159, 13755182. రాయచోటి - బంగ్లో రోడ్; PBW4SGL13466800, 13512713, 13533561, 13549707, 13544764, 13561002, 13589593, 13629683, 13665655, 13678051, 13744678, 13781482, 13806352, 13826029. శ్రీకాకుళం - రామలక్ష్మణ్ జంక్షన్; PBW5SGL13432853. శ్రీకాళహస్తి - మైన్ రోడ్; PGC6SGL13444655, 13491841, 13592643, 13660258, 13720997. సూళ్లూరుపేట - పాండు రంగ స్ట్రీట్; PBW7SGL13458560, 13543766, 13595555. (14-11-25) తాడిపత్రి - యల్లనూర్ రోడ్; PBW8SGL13406990, 13441118, 13444393, 13459469, 13476419, 13527873, 13550829, 13637331, 13697270, 13736930. తెనాలి - గాంధీ చౌక్; PEK2SGL13700545. తగరపువలస - భీమిలి రోడ్; PIW6SGL13431094, 13449453, 13715776. తిరుపతి - బైరాగి పట్టెడ; PMB8SGL13582070. తిరుపతి - వీజీఎల్; P442SGL13641339, 13738998, 13804032. తిరుపతి - కోర్లగుంట; PNB1SGL13624003. తిరుపతి - ఆర్‌సీ రోడ్; PNB2SGL13411678. (17-11-25) తిరుపతి - తిలక్ రోడ్; PMB9SGL13780189, 13780369. తుని - సినిమా రోడ్; PBW9SGL13607273, 13666360. విజయవాడ - అజిత్ సింహ్ నగర్; PLB9SGL13604113, 13820557. విజయవాడ - భవానీపురం; PMB1SGL13450231, 13698652, 13742855, 13780034. విజయవాడ - చిట్టి నగర్; PMB3SGL13528320, 13607970, 13619223. విజయవాడ - ఇబ్రాహింపట్నం; PMB6SGL13563257, 13701609, 13757270. విజయవాడ - మొఘల్‌రాజ్‌పురం; PGA8SGL13579523. విజయవాడ - రామవరపాడు; PMB5SGL13681933. (18-11-25): శృంగవరపు - కోట; PBW6SGL13575423. వైజాగ్ - అక్కయ్యపాలెం; PI90SGL13478032. వైజాగ్ - బీజీఎల్; P408SGL13444052, 13607186. వైజాగ్ - ద్వారకానగర్; PI52SGL13462227, 13473171, 13655350, 13719512, 13757002. వైజాగ్ - గోపాలపట్నం; PB91SGL13449446, 13458901, 13648127, 13684621, 13679965, 13738227, 13761204, 13761542, 13800430. వైజాగ్ - హెచ్‌బీ కాలోనీ; PI58SGL13458949, 13745287, 13818227. వైజాగ్ - కంచర పాలెం; PI54SGL13530188, 13666691, 13762362, 13780224. వైజాగ్ - కూర్మన్నపాలెం; PI57SGL13623477, 13621876, 13680836. (19-11-25) వైజాగ్ - మధురవాడ; PI93SGL13458846, 13579288, 13661569, 13656038, 13759232. వైజాగ్ - ఎన్ఏడీ జంక్షన్; PI94SGL13404545, 13442663. వైజాగ్ - కొత్త గాజువాక; PI53SGL13441155, 13561782, 13677552, 13741412, 13740580, 13785393. వైజాగ్ - పాత గాజువాక; PB47SGL13534827. వైజాగ్ - పెందుర్తి; PI92SGL13457396, 13547769, 13563783, 13638235, 13685939, 13714673, 13737328, 13743594, 13776678, 13817561. వైజాగ్ - రవీంద్ర నగర్; PI95SGL13509625, 13645216, 13736932, 13756140, 13779765, 13778388. విజయనగరం - ఫోర్ట్ ఏ జీ రోడ్; PBX1SGL13472969, 13558406, 13807161, 13827582. విజయనగరం - ఎంజీ రోడ్; PCZ4SGL13403011, 13586890, 13694616, 13717662.

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

1-10P10exA 12 GNT_1-10P10exA.qxd 9/30/2025 11:06 PM Page 1



## జపాన్ ఓపెన్ ఛాంపియన్ అల్కరాజ్



**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ 2025 ఛాంపియన్‌గా కార్లోస్ అల్కరాజ్ నిలిచాడు. ఫైనల్లో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించి 8వ టైటిల్ గెలుచుకున్నాడు. ఈ విజయంతో ఈ నెలలో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన లావర్ కప్‌లో ఫ్రిట్జ్ చేతిలో జరిగిన అద్భుత ఓటమికి అల్కరాజ్ ప్రతీకారం తీర్చుకున్నాడు. మంగళవారం జరిగిన జపాన్ ఓపెన్ ఫైనల్‌లో ప్రపంచ నంబర్ వన్ అల్కరాజ్ 6-4, 6-4 తేడాతో టేలర్ ఫ్రిట్జ్‌ను ఓడించాడు. ఆరుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన ఈ ఆటగాడు త్వరగా 4-1 ఆధిక్యాన్ని సాధించాడు. దీనితో ఫ్రిట్జ్ నిరాశతో తన రాకెట్‌ను నేలపై పడేశాడు. అల్కరాజ్ తర్వాత సర్వ్‌లో కొద్దిసేపు తడబడినప్పటికీ, అతను తన మొదటి టోక్యో టైటిల్‌ను గెలుచుకున్నాడు.

## ప్రో కబడ్డీ లీగ్‌లో గుజరాత్, ఢిల్లీ చిరస్మరణీయ గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రో కబడ్డీ లీగ్ (ఐపీఎల్) సీజన్ 12లో గుజరాత్ జెయింట్స్, దబాంగ్ ఢిల్లీ కెసి చిరస్మరణీయ విజయాలను సాధించాయి. జెయింట్స్ జట్టు తమ ఐదు మ్యాచ్‌ల పరాజయ పరంపరను 33-27 తేడాతో యుపి యోధాస్‌పై విజయంతో ముగించింది. మొహమ్మద్రెజా షాడ్లాయి, అంకిత్ దహియా కీలక ప్రదర్శనలు గుజరాత్ తొలి దశలోనే వెనుకబడిన తర్వాత మ్యాచ్‌ను తన ఆధిక్యంలోకి తీసుకెళ్లాయి. షాడ్లాయ్ రైడ్ ఆల్ అవుట్ చేసి హాఫ్ టైం స్కోరును 21-16తో ఐదు పాయింట్లు పెంచే ముందు టోన్‌ను సెట్ చేసింది. భవానీ రాజ్‌పుత్ చివరి సూపర్ రైడ్ అంతరాన్ని 29-26కి తగ్గించినప్పటికీ, దహియా నిర్ణయాత్మక టాకిల్స్, షాడ్లాయ్ చివరి మల్టీపాయింట్ రైడ్ అవసరమైన ఆరు పాయింట్ల విజయాన్ని నిర్ధారించాయి. కాగా రెండవ మ్యాచ్‌లో, టేబుల్‌టాపర్స్ దబాంగ్ ఢిల్లీ కెసి డిఫెండింగ్ ఛాంపియన్స్ హర్యానా స్టీలర్స్‌పై 38-37 తేడాతో విజయం సాధించింది. అషు మాలిక్ తన 100వ పికెఎల్ ప్రదర్శనలో సూపర్ 10తో ముందుండి నడిపించగా, ఫజెల్ అత్రాచలి డిఫెన్స్‌ను బలోపేతం చేశాడు. మూడవ క్వార్టర్‌లో ఢిల్లీ రెండు ఆల్ అవుట్‌లను సాధించి 30-19తో ఆధిక్యాన్ని నెలకొల్పింది. వినయ్ 18 రైడ్ పాయింట్లు, జైదీప్ హై ఫైవ్ ద్వారా హర్యానా ఉత్సాహంగా పునరాగమనం చేసింది, చివరి నిమిషాల్లో లోటును కేవలం రెండుకు తగ్గించింది. నీరజ్ నర్వాల్ కౌంటర్ మరియు కీలకమైన ఫైనల్ టాకిల్ ఢిల్లీకి సీజన్‌లో ఎనిమిదో విజయం కోసం నిలుపుకునేలా చేసింది.





## జపాన్ ఓపెన్.. రన్నరప్‌గా బోపన్న జోడీ

### ఫ్రాన్స్ చేతిలో 5-7 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** జపాన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో రోహన్ బోపన్న మరియు అతని జపాన్ భాగస్వామి టకేరు యుజుకి ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచారు. టోక్యోలో జరిగిన వైల్డ్‌కార్డ్ ద్వయం కోసం డ్రీమ్ రన్ రెండవ సీడ్ హ్యూగో నైస్ (మొనాకో)-ఎడ్వర్డ్ రోజర్‌వాస్సెలిన్ (ఫ్రాన్స్) చేతిలో 5-7, 5-7 తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో గట్టి పోటీ ఎదురై అనేక బ్రేక్ పాయింట్లు, సుదీర్ఘ ర్యాలీలు జరిగాయి. కానీ నైస్ మరియు రోజర్‌వాస్సెలిన్ అనుభవం మరియు స్థిరత్వం చివరికి గెలుపును తెచ్చిపెట్టాయి.

క్వార్టర్ ఫైనల్స్‌లో వారు మూడవ సీడ్ మాక్సిమో గొంజాలెజ్ (అర్జెంటీనా) మరియు ఆండ్రెస్ మోల్టెని (అర్జెంటీనా) లను 7-6(5), 7-6(4) తేడాతో ఓడించారు. సెమీఫైనల్ మ్యాచ్ మరో నాటకీయ థ్రిల్లర్‌గా సాగింది. వారు టాప్ సీడ్స్, యుఎస్‌ఎకు చెందిన క్రిస్టియన్ హారిసన్ మరియు ఇవాన్ కింగ్‌లను 4-6, 6-3, 1-0 (18-16) తేడాతో ఓడించి మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నారు. 43 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు మయామి మాస్టర్స్ టైటిళ్లను గెలుచుకున్న ఈ భారత స్టార్, ఇప్పుడు 64 కెరీర్ టూర్‌లెవల్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. మరియు 26 ఎటిపి డబుల్స్ టైటిళ్లతో సహా 537 టూర్‌లెవల్ డబుల్స్ విజయాలను సాధించాడు.

## వెస్టిండీస్ సిరీస్‌లో టీమిండియా నుంచి 11 మంది ఔట్

### ఛాంపియన్ టీమ్‌లో నలుగురికే ఛాన్స్



**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025 గెలిచిన తర్వాత టీమిండియా ఇప్పుడు స్వదేశంలో కొత్త సిరీస్ ఆడటానికి సిద్ధమవుతోంది. ఈ సిరీస్ కోసం భారత జట్టు జట్టును ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో ఛాంపియన్ జట్టు నుంచి నలుగురు ఆటగాళ్ళు మాత్రమే బరిలోకి దిగనున్నారు. ఆసియా కప్‌లో విజయం సాధించిన తర్వాత, టీం ఇండియా ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌పై దృష్టి పెట్టింది. శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలో, యువ, అనుభవజ్ఞులైన ఆటగాళ్ల బృందం అక్టోబర్ 2 నుంచి మైదానంలోకి దిగుతుంది. ఈ సిరీస్ భారత్‌లో జరుగుతుంది. ఇక్కడ కెప్టెన్సీ మాత్రమే కాకుండా ఆటగాళ్లను కూడా అప్‌డేట్ చేస్తారు. వాస్తవానికి ఆసియా కప్ విజేత భారత జట్టు నుంచి నలుగురు ఆటగాళ్ళు మాత్రమే ఈ సిరీస్‌లో ఆడతారు. మిగిలిన 11 మంది ఆటగాళ్ళు భారత టెస్ట్ జట్టులో లేరు. ఈ నలుగురు ఆటగాళ్ళు శుభ్‌మాన్ గిల్, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్. వీరితో పాటు, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దుబే, సంజు శాంసన్, హర్షిత్ రాణా, రింకు సింగ్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జితేష్ శర్మ కూడా టెస్ట్ జట్టులో లేరు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది. రెండవ మ్యాచ్ అక్టోబర్ 10న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రారంభమవుతుంది. ఈ సిరీస్ టీమిండియాకు కీలకం కానుంది. టీమ్ ఇండియా గత ఏడాది న్యూజిలాండ్‌తో జరిగిన చివరి స్వదేశీ టెస్ట్ సిరీస్, అక్కడ భారత జట్టు క్లీన్ స్వీప్‌ను చవిచూసింది. అయితే, ఆ సమయంలో రోహిత్ శర్మ కెప్టెన్‌గా ఉన్నాడు. కానీ ఈ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో శుభమాన్ గిల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగే ఈ టెస్ట్ సిరీస్ కోసం టీం ఇండియా జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి, ఎన్ జగదీశన్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ ఉన్నారు.

## ఖతార్ క్లాసిక్ స్క్వాష్‌లో అభయ్ ఓటమి, క్వార్టర్ ఫైనల్‌కు సుబ్రమణ్యం



**న్యూఢిల్లీ:** ఖతార్ క్లాసిక్ స్క్వాష్-2025లో భారత్ ప్లేయర్ అభయ్ ఓటమిచెందాడు. ఖతార్‌లోని దోహాలో జరుగుతున్న క్లాసిక్ స్క్వాష్‌లో భారత ఆటగాడు అభయ్ సింగ్ ఐదు గేమ్‌ల థ్రిల్లర్‌లో ఈజిప్టు ప్రపంచ 15వ ర్యాంకర్ ఫేర్స్ డెస్సౌకీ చేతిలో పరాజయం చెందాడు. గత రౌండ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ మరియు ప్రస్తుత ప్రపంచ 5వ ర్యాంక్‌లో ఉన్న ఈజిప్ట్‌కు చెందిన కరీం గవాద్‌ను ఓడించిన ప్రపంచ 35వ ర్యాంక్‌లో ఉన్న అభయ్, డెస్సౌకీపై రెండుసార్లు ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ ఆ తర్వాత ఈజిప్షియన్ ఆటగాడు 66 నిమిషాల్లో 11-13, 11-5, 9-11, 11-3, 11-3 తేడాతో గెలిచాడు. అనేక ఆసియా క్రీడల పతక విజేత అయిన 27 ఏళ్ల అభయ్, తదుపరి అక్టోబర్ 5 నుండి న్యూయార్క్‌లో జరిగే పిఎస్‌ఎ కాంస్య ఈవెంట్‌లో ఆడనున్నాడు. అంతకుముందు, భారత్‌కే చెందిన రమిత్ టాండన్ మొదటి రౌండ్‌లో ఈజిప్ట్‌కు చెందిన టాప్ సీడ్ మోస్తఫా అసల్ చేతిలో 3-0 తేడాతో (4-11, 5-11, 4-11) ఓడిపోయాడు. కాగా మహిళల విభాగంలో, ఏడో సీడ్ మలేషియా శివసంగారి సుబ్రమణ్యం రెండవ రౌండ్‌లో బెల్జియంకు చెందిన నేలే గిలిస్‌ను 3-0 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. ప్లాటినం స్థాయి టోర్నమెంట్‌లో శివసంగారి 11-8, 11-6, 11-5 తేడాతో గెలిచింది.

## వరల్డ్ పారా అథ్లెటిక్స్‌ఛాంపియన్‌షిప్..

### సంజయ్‌కి స్వర్ణం, సందీప్, యోగేష్‌కు రజతం




**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, పురుషుల జావెలిన్ త్రో ఎఫ్ 44లో సందీప్ సంజయ్ సర్గర్ స్వర్ణంతో మెరవగా, సందీప్ చౌదరి రజతంతోను, పురుషుల డిస్కస్ ఎఫ్ 56లో యోగేష్ కథునియా వరుసగా మూడో రజతం సాధించాడు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం జరిగిన ఈ పోటీలో సంజయ్ తన వ్యక్తిగత బెస్ట్ 62.82 మీటర్లతో స్వర్ణం సాధించగా, చౌదరి సీజన్ బెస్ట్ 62.67 మీటర్లతో రజతం సాధించాడు. ఇక బ్రెజిల్‌కు చెందిన ఎడెనిల్సన్ రాబర్టో 62.36 మీటర్లు విసిరి కాంస్యం గెలుచుకున్నాడు, ఇది ఎఫ్42 విభాగంలో ప్రపంచ రికార్డు. ఈ పోటీలో పాల్గొన్న మరో ఇద్దరు భారతీయులు పుష్పేంద్ర సింగ్ (61.94 మీ.), మహేంద్ర గుర్జార్ (57.84 మీ.) వరుసగా 4, 7 స్థానాల్లో నిలిచారు. కాగా ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో రెండుసార్లు రజత పతక విజేత, అర్జున అవార్డు గ్రహీత అయిన భారత్ పారా అథ్లెట్ యోగేష్ కథునియా తన విజయాల జాబితాలో మరో ప్రశంసను జోడించాడు. తన రెండవ ప్రయత్నంలో సాధించిన 42.49 మీటర్ల అత్యుత్తమ త్రో తో, కతునియా రెండవ స్థానంలో నిలిచాడు. బ్రెజిల్‌కు చెందిన క్లాడినీ బాటిస్టా 45.67 మీటర్ల త్రోతో స్వర్ణం సాధించిన తర్వాత రెండవ స్థానంలో నిలిచాడు. గ్రీస్‌కు చెందిన కాన్‌స్టాంటినోస్ జౌనిస్ 39.97 మీటర్ల దూరంతో మూడో స్థానంలో కాంస్యం గెలుచుకున్నాడు. ఫ్రాన్స్, జపాన్‌లలో వరుసగా జరిగిన 2023, 2024 ఎడిషన్‌లలో పోడియంను పూర్తి చేసిన తర్వాత, పురుషుల డిస్కస్ ఎఫ్ 56లో యోగేష్ వరుసగా ఇది మూడో రజతం.

వాణిజ్యం

## భారత్ ఆర్థికవృద్ధి 6.5% మాత్రమే!

### ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనా

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** భారత్ ఆర్థికవృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5శాతంగా మాత్రమే ఉంటుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు అంచనావేసింది. తొలిత్రైమాసికంలో 7.8శాతం వృద్ధినమోదయినా మొత్తం ఏడాదికి వృద్ధిరేటు 6.5శాతం మాత్రమేనని తెలిపింది అమెరికా సుంకాలు, భారత్ ఎగుమతులు తగ్గుతుండటంతో రెండో అర్థసంవత్సరంలో ఈ ప్రభావం ఉంటుందని ఎడిబి వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలచేసిన నివేదికలో భారత్ వృద్ధి ఏడుశాతం అని ప్రకటించిన ఎడిబి ఇపుడు తాజాగా 6.5శాతం ఉన్నట్లు తెలిపింది. తొలిత్రైమాసికంలో జిడిపి వృద్ధి 7.8శాతంగా ఉంది. వినియోగం పెరగడం, ప్రభుత్వ వ్యయం పెరగడంవల్లనే వృద్ధి ఎగువకు వెళ్లిందని అయితేఅమెరికా ట్యారిఫ్‌లవల్ల ఎగుమతులు తగ్గి వృద్ధిక్షీణిస్తుందని ప్రత్యేకించి రెండో అర్థభాగంలోను, 2027లోను ఈ క్షీణత నమోదవుతుందని అంచనావేసింది.



అయితే ఈప్రభావాన్ని దేశీయ డిమాండ్, సర్వీస్ ఎగుమతులు కొంతమేర భర్తీచేయగలవని తెలిపింది. అలాగే ఆర్థికలోటు కూడా బడ్జెట్ అంచనాలు 4.4శాతంకంటే ఎక్కువ ఉంటుందని ఎడిబి తెలిపింది. పన్నురాబడుల వృద్ధిమందగించడం, జిఎస్టీ కోతలు వంటివి వాస్తవ బడ్జెట్‌ను కొంతమేర ప్రభావితంచేస్తాయి. నికరంగాచూస్తే ఆర్థికలోటు జిడిపిలో 4.7శాతంవరకూ ఉంటుందని అలాగే కరెంటు ఖాతా లోటు 0.6శాతం మేర పెరుగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 0.9శాతంగా ఉంటుందని, 2027లో 1.1శాతానికి నమోదవుతుందని ఎడిబి అంచనావేసింది. ఇక పన్నురాబడులు కూడా 7.5శాతం తగ్గినట్లు అంచనా వేసింది. సెంట్రల్‌బ్యాంకునుంచి అందిన డివిడెండ్ల కారణంగా 4.8శాతం పెరిగి 2.7 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. వ్యయం కూడా 20.2శాతంపెరిగిందని తెలిపింది. సబ్సిడీలు 9.6శాతం మేర తొలిత్రైమాసికంలో తగ్గాయి. ఎరువుల సబినసడీలు మాత్రం 36.9శాతంపెరిగాయి. ఇక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రభావం కూడా జిడిపి వృద్ధిపై ఉంటాయని ఎడిబి స్పష్టంచేసింది.

## రూ.5.98 లక్షలకోట్లకు పెరిగిన ఆర్థికలోటు!

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 30:** కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలవరకుగాను జమాపద్దులు నివేదిక విడుదలచేసింది. మొత్తంగా ఆగస్టు నెలాఖరునాటికి రూ.12.83 లక్షలకోట్లు రాబడులు సాధించింది. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 36శాతం రాబడులు సాధించినట్లు కేంద్రం స్పష్టంచేసింది. ఈ మొత్తంలో 8.10 లక్షలకోట్లు పన్ను రాబడులు కాగా రూ.4.40 లక్షలకోట్లు పన్నేతర రాబడులు ఇక 31,970 కోట్లు రుణాలకిందకు రాని ఇతర రాబడులుగా ఉన్నాయి. ఈ మొత్తంలో 5.30 లక్షలకోట్లను రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల్లో వాటాగా బదలీచేసింది. ఈమొత్తం గత ఏడాది కంటే 74,431 కోట్లు ఎక్కువ ఉన్నట్లు కూడా తేలింది. ఇక ప్రభుత్వం ఆగస్టువరకూ చేసిన మొత్తం వ్యయం చూస్తే 18.81 లక్షలకోట్లుగా ఉంది. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 37.1శాతం వరకూ వ్యయం జరిగినట్లు తేలింది. ఈ మొత్తంలో 14.49 లక్షలకోట్లు రెవెన్యూ ఖాతాలో ఉంటే మరో 4.32 లక్షలకోట్లు మూలధన వ్యయం ఖాతాలో ఉంది. మొత్తం రెవెన్యూ వ్యయంలో రూ.5.29 లక్షలకోట్లు వడ్డీచెల్లింపులు, రూ.1.50 లక్షలకోట్లు మేజర్ సబ్సిడీలకు వెళుతోంది. ఇక మొదటి ఐదునెలల్లో ఈ ఏడాది ఆర్థికలోటు 5.98 లక్షలకోట్లుగా ఉన్నట్లు తేలింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదయిన 27శాతానికి మించి 38.1శాతంగా ఉన్నట్లు ప్రభుత్వ నివేదికలు చెపుతున్నాయి.

### నవంబరునుంచి ఎస్‌బిఐ కార్డ్ ఛార్జీలు పెంపు!





**ముంబయి,సెప్టెంబరు 30:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ ఎస్‌బిఐ కార్డ్ రుసుములు పెంచుతున్నట్లు తెలిపింది. ఫీ స్ట్రక్చర్, ఇతర ఛార్జీలను సవరించినట్లు నవంబర్ 1 నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లు, వాలెట్ లోడింగ్ వంటి ఎంపిక చేసిన ట్రాన్సాక్షన్లకు ఈ కొత్త ఛార్జీలు వర్తిస్తాయని ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు యూజర్లు తప్పనిసరిగా కొత్త ఛార్జీలు తెలుసుకోవాలని సూచించింది. క్రెడ్, చెక్, మొబి క్విక్ వంటి థర్డ్ పార్టీ యాప్స్ ద్వారా చేసే ఎడ్యుకేషన్ సంబంధిత పేమెంట్లపై కొత్త ఛార్జీలు వర్తిస్తాయి. ట్రాన్సాక్షన్ మొత్తంలో 1 శాతం ఫీజు ఉంటుందని ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. నేరుగా స్కూల్స్, కాలేజీలు, యూనివర్సిటీలకు నేరుగా పిఒఎస్ ద్వారా పేమెంట్లు చేస్తే ఎలాంటి ఛార్జీలు ఉండవని తెలిపింది. రూ.1000 దాటి వాలెట్ లోడింగ్ ట్రాన్సాక్షన్లు చేస్తే 1 శాతం ట్రాన్సాక్షన్ అమౌంట్ ఛార్జీ పడుతుంది. ఎంపిక చేసిన మర్చంట్ కోడ్స్ పరిధిలోని ట్రాన్సాక్షన్లకు కొత్త ఛార్జీలు వర్తిస్తాయని ఎస్‌బిఐ కార్డ్ తెలిపింది. క్యాష్ పేమెంట్స్, చెక్ పేమెంట్స్, కార్డ్ రీప్లేస్మెంట్, లేట్ పేమెంట్ వంటి వివిధ సేవలకు ఫీ, ఛార్జీలు వసూలు చేస్తోంది ఎస్‌బిఐ కార్డ్. అయితే, ఆయా ట్రాన్సాక్షన్ల ఛార్జీలను ప్రస్తుతానికి మార్చలేదు. ప్రస్తుతానికి క్యాష్ పేమెంట్ ఫీ రూ.250గా ఉంది. అలాగే పేమెంట్ ఆలస్యమేతం 2 శాతం ఛార్జీలు పడతాయి.

## రూ.11,500 కోట్లకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఐపిఒ

### అక్టోబరు ఏడున మార్కెట్లకు రాక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఎల్జీ ఎలక్ట్రానిక్స్ అక్టోబరు ఏడో తేదీ ఐపిఒకు వస్తున్నట్లుప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఇప్పటికే డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఇష్యూధరను బుధవారం ప్రకటిస్తామని యాంకర్ బుక్ వివరాలు కూడా అక్టోబరు ఆరోతేదీ వెల్లడిస్తామని వెల్లడించారు. ఆఫర్ ఫర్ సేల్ కింద 10,18,15,859 ఈక్విటీ వాటాలను రూ.10 ముఖవిలువతో ఐపిఒకు తెస్తోంది. దక్షిణకొరియా ప్రమోటర్ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇంక్ ఈ అమ్మకాలు చేపట్టింది. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఈ ఐపిఒనుంచి 1.3 బిలియన్ లేదా 11,500 కోట్ల రూపాయలు సమీకరించాలని నిర్ణయించింది. కంపెనీ విలువలు తొమ్మిది బిలియన్ డాలర్లుగా నిర్ణఇంచారు. అంతకుముందు 15 బిలియన్ డాలర్లనుంచి విలువలను కుదించారు. భారత సంస్థలో 15శాతం వాటాను విక్రయించాలనిచూస్తోంది. టాటాక్యాపిటల్ తర్వాత మూడో అతిపెద్ద కంపెనీగా ఎల్జీ ఎలక్ట్రానిక్స్ వస్తోంది. టాటాక్యాపిటల్ రూ.15,500 కోట్లతో వస్తున్న సంగతి తెలిసిందే. అలాగే హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ 12,500 కోట్లు జూన్‌లోనే రాబట్టింది. హుండై మోటార్ తర్వాత రెండో దక్షిణకొరియా ఐపిఒగా చెపుతున్నారు. హుండై గత ఏడాదే 27,800 కోట్లనిధులు సమీకరించింది. ఇపుడు ఎల్జీ హ్యావెల్స్ హ్యావెల్స్ ఇండియా, వోల్టాస్, విర్ల్‌పూల్ ఇండియా,




బ్లూస్టార్ ఇతరులతో పోటీగా ఉంది. 50శాతం వాటాలు అర్హత పొందిన సంస్థాగత బిడ్డర్లకు కేటాయించారు. 35శాతం రిటైల్ ఇన్వెస్టర్లు, మిగిలిన 15శాతం ఇతరులకు కేటాయించారు. యాక్సిస్ క్యాపిటల్, సిటీగ్రూప్ గ్లోబల్‌మార్కెట్స్, మోర్గాన్ స్టాన్లీ ఇండియా కంపెనీ, జెపిమోర్గాన్ ఇండియా బిఒఎఫ్‌ఎ సెక్యూరిటీస్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు. కెఫిన్ టెక్నాలజీస్‌రిజిస్ట్రారుగా ఎల్జీ ఎలక్ట్రానిక్స్ నియమించుకుంది.




## పెరుగుతున్న విదేశీ రుణభారం

**ముంబయి, సెప్టెంబరు 30:** భారత విదేశీ రుణ భారం పెరుగుతోంది. 747.2 బిలియన్ డాలర్లకు చేరింది. 2025 మార్చి నెలాఖరుతోపోలిస్తే 11.2 బిలియన్ డాలర్లు పెరిగినట్లు ఆర్‌బిఐ తన నివేదికలో పొందుపరిచింది. విదేశీ రుణాలు జిడిపి నిష్పత్తితో పోలిస్తే 18.9శాతంగా ఉన్నాయి. మార్చి నెలాఖరుకు 19.1శాతం ఉన్న ఈ నిష్పత్తి వాటా జూన్ నెలాఖరునాటికి కొంతమేర సర్దుబాటు అయి 18.9శాతంగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువల వల్లకూడా కొంతమేర ఎక్కువభారం ఉన్నట్లు కనిపించింది. అంతేకాకుండా ఇతర మేజర్ కరెన్సీలు యెన్, యూరో వంటి వాటి ప్రభావం కూడా ఉంది. స్పెషల్‌డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డిఆర్)లు 5.1 బిలియన్ డాలర్ల వరకూ ఉంది. డాలర్ రూపాయి విలువలను పరిగణనలోనికి తీసుకుంటే బాహ్యరుణాలు 6.2 బిలియన్ డాలర్లు పెరిగాయని ఆర్బీఐ తన నివేదికలోస్పష్టంచేసింది. ఇక దీర్ఘకాలిక రుణ భారం కూడా 611.7 బిలియన్ డాలర్లుగా ఉంది. మార్చి 2025తో పోలిస్తే జూన్ చివరినాటికి 10.3బిలియన్ డాలర్లు పెరిగినట్లు ఆర్బీఐ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి.

## ఎనిమిదోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలే!

### ఆర్బీఐ సమీక్షపైనే ట్రేడర్ల ఫోకస్



**ముంబయి, సెప్టెంబరు 30:** ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు ఎనిమిదోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. ఎన్‌ఎస్‌ఇ నెలవారీ ఫ్యూచర్ ఆప్షన్ల కాలపరిమితి ముగియడం, ఆర్‌బిఐ ఎంపిసి సమీక్ష వివరాలకోసం ఆతృత వంటివి సూచీలను వెనక్కినెట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకే మొగ్గు చూపించారు. నిఫ్టీ 24,650 దిగువననే ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా షేర్లు దిగజారితే పిఎస్‌యు బ్యాంకులు, మెటల్, ఆటో కౌంటర్లు లాభాల్లో ముగిసాయి. మార్కెట్లకు రానున్న రోజుల్లో కంపెనీ రాబడులు,ట్యారిఫ్ విధానాలు కీలకం అవుతున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 97.32 పాయిట్లు క్షీణించి 80,267.62 వద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 23.80 పాయింట్లు క్షీణించి 24,611.10 వద్ద ముగిసింది. బిఎస్‌ఇలో 2047 కంపెనీల షేర్లు పెరిగితే 2046 షేర్లు క్షీణించాయి. మొత్తం 175 కంపెనీల షేర్లు మాత్రం యధాతథంగా ఉన్నాయి. మిడ్‌క్యాప్‌సూచీ 0.04శాతం పెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ స్థిరంగా కొనసాగింది. పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.08శాతంపెరిగి 6.57కు చేరాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి చెలామణి 88.76గా నడిచింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో కొంతమేరక్షీణించింది. 0.31శాతంతగ్గి 1,15,085కి చేరింది. అమెరికా పదేళ్ల బాండ్ల మార్కెట్‌లో 0.22శాతంక్షీణించి 4.132 వద్దనే రాబడులు నిలిచ్చాఇయ. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 62 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 66.47 డాలర్లుగాక ఒనసాగింది. విదేశీ మార్కెట్లలో యుఎస్ డౌజోన్స్ సూచీ 112 పాయింట్లు క్షీణించింది. యూరోపియన్ మార్కెట్లు మంగళవారం క్షీణతలోనే ముగిసాయి.ఆసియా మార్కెట్లు మాత్రం మిశ్రమంగా ఉన్నాయి. ఇక ఆనంద్‌రాఠీ షేర్లు 445.65గాబిఎస్‌ఇలో నడిచాయి. 414 వద్దలిస్ట్ అయితే 7.64 ప్రీమియంతో కొనసాగింది. సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లుకూడా బిఎస్‌ఇలో 323.20గా ఉన్నాయి. 15.51 డిస్కౌంట్‌ధరకే వెళ్లాయి. ఇక శేషసాయి టెక్నాలజీస్ 411.50కి కొనుగోళ్లు జరిగాయి. 423 ఇష్యూధర అయితే 3.31 డిస్కౌంట్‌కేవెళ్లాయి. డిసిఎక్స్ సిస్టమ్స్ 2.42శాతంపెరిగాయి.భెల్ 1.97శాతం పెరిగితే అతిశయ్ కంపెనీ 1.61శాతం, డిసిఎక్స్ సిస్టమ్స్ 2.42శాతం పెరిగాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14